
మార్గదర్శకులు
రూ॥ 120/-
పేజీలు: 130


నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

సంపుటి 08, సంచిక: 158 | గురువారం | 08-05-2025 | మహబూబ్‌నగర్ | Published from: **Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar** | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

ఆదర్శవంతమైన వియత్నాం అద్భుత అభివృద్ధి

సంకల్పబలమే జయం

లోపలి పేజీల్లో

# 9 ఉగ్రవాద స్థావరాలు ధ్వంసం




## పాకిస్థాన్, పిఒకె భూభాగాలపై క్షిపణులతో భారత్ మెరుపుదాడి

## పహల్గామ్ టెర్రరిస్టు దాడికి ప్రతిస్పందన హక్కును ఉపయోగించుకున్న భారత్

### జైష్–ఎ–మొహమ్మద్, లష్కర్–ఎ–తైబా ప్రధాన కేంద్రాలు నేలమట్టం

- 'ఆపరేషన్ సిందూర్' పేరుతో ప్రతిచర్య
- అర్ధరాత్రి దాటాక 1:05 గంటలకు మొదలై 25 నిమిషాల్లో పూర్తి
- మురిద్కేలోని మర్కజ్ తైబా, బహవల్‌పూర్‌లోని మర్కజ్ సుభాన్ అల్లా, సియాల్‌కోట్‌లోని మెమూనా జోయా వసతి కేంద్రం, బర్నాలలోని ఎల్‌ఇటి కేంద్రం, ముజఫరాబాద్‌లోని షావాయ్ నల్లాలోని శిబిరాలపై మిస్సైల్, డ్రోన్లతో విరుచుకుపడిన భారత సైనిక బలగాలు

**న్యూఢిల్లీ :** పహల్గామ్ దారుణ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారతదేశం దీటైన జవాబు ఇచ్చింది. పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్(పిఒకె) భూభాగాలలో నెలవైన తొమ్మిది ఉగ్రవాద స్థావరాలను భారతీయ సైనిక బలగాలు ధ్వంసం చేశాయి. వాటిలో జైష్–ఎ–మొహమ్మద్, లష్కర్–ఎ–తైబాల ప్రధాన కేంద్రాలు కూడా ఉన్నాయి. బుధవారం తొలి జాములో (మంగళవారం అర్థరాతి దాటిన తరువాత) 25 నిమిషాల పాటు ''నిర్దేశిత'',''ఉద్రిక్తత పెంపు రహిత'' మిస్సైల్, డ్రోన్‌లతో ఉగ్రస్థావరాలపై భారత సైనిక విభాగాలు విరుచుకుపడ్డాయి. 'ఆపరేషన్ సిందూర్' సంకేతనామంతో భారతీయ మిలిటరీ మురిద్కేలోని లష్కర్–ఎ–తైబాకు చెందిన మర్కజ్ తైబా, బహవల్‌పూర్‌లోని జైష్–ఎ–మొహమ్మద్‌కు చెందిన మర్కజ్ సుభాన్ అల్లా, సియాల్‌కోట్‌లోన హిజ్‌బుల్ ముజాహిద్దీన్‌కు చెందిన మెమూనా జోయా వసతి కేంద్రం, బర్నాలలోని మర్కజ్ అహ్లే హాదిత్ పేరుతో ఉన్న ఎల్‌ఇటి కేంద్రం, ముజఫ్ఫరాబాద్‌లోని షావాయ్ నల్లాలోని శిబిరాలను లక్ష్యంగా చేసుకున్నట్లు మిలిటరీ అధికారులు తెలిపారు.లాహోర్ నగరానికి కొద్ది దూరంలోనే ఉండే మురిద్కే విస్తారమైన ప్రదేశంలో ''మర్కజ్'' లేదా లష్కర్–ఎ–తైబాకు కేంద్రం. బహవల్‌పూర్ జైష్–ఎ–మొహమ్మద్‌కు గట్టి పట్టు ఉన్న ప్రాంతం.

ఏప్రిల్ 22న పహల్గాం దాడులకు ప్రేరేపించిన, ప్రణాళిక వేసిన వారిని చట్టం ఎదుట నిలబెట్టడంలో, పాకిస్తాన్ నియంత్రిత భూభాగంలోని ఉగ్రవాద స్థావరాలకు వ్యతిరేకంగా చర్యలు తీసుకోవడంలో ఆ దేశం నుంచి ''కనిపించే స్థాయిలో చర్య లేదని'' విదేశాంగ కార్యదర్శి విక్రం మిస్రీ అన్నారు. అందుకే ''తగిన''చర్యలు తీసుకోవాలని భారతదేశం నిర్ణయించిందని తెలిపారు. పహల్గాం ఉగ్ర దాడులకు ప్రేరేపకులు, నిర్వాహకులు, ఆర్థిక సహాయకులు, ప్రాయోజకులను జవాబుదారీ చేయాలనే ఐక్య రాజ్య సమితి భద్రతా మండలి ప్రకటనకు అనుగుణంగానే భారతదేశం చర్యలు ఉన్నాయని మిస్రీ అన్నారు. 'ఆపరేషన్ సిందూర్' ఉదయం 1:05 నుంచి 1:30 గంటల్లో నిర్వహించబడిందని, అన్ని లక్ష్యాలను ఆశించిన స్థాయిలో నిరుపయోగంగా మార్చబడ్డాయని ఇద్దరు మహిళా సైనిక అధికారులైన ఆర్మీ కోర్ ఆఫ్ సిగ్నల్స్ అధికారిణి కల్నల్ సోఫియా ఖురేషీ, ఐఎఎఫ్ హెలికాప్టర్ పైలెట్ వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ మీడియా సమావేశంలో వెల్లడించారు. ఉగ్రశిబిరాలను ధ్వంసంపై బుధవారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన అధికారిక మీడియా సమావేశంలో మిస్రీతో కలిసి ఈ ఇద్దరు మహిళా సైనిక ఉన్నతాధికారులు వివరాలను వెల్లడించారు. అంతకుముందు తెల్లవారుజామున ఆపరేషన్ పూర్తయిన 15 నిమిషాల్లో రక్షణ మంత్రిత్వ శాఖ వివరాలను ప్రకటిస్తూ ''కొద్దిసేపటి క్రితమే భారతీయ సైనిక బలగాలు 'ఆపరేషన్ సిందూర్'ను చేపట్టి, పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత జమ్మూ కశ్మీర్‌లో ఎక్కడ నుండైతే భారతదేశంలో ఉగ్రదాడులకు ప్రణాళికలు రచించి, ఆదేశాలు వెళ్ళాయో, ఆ ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేశాయి'' అని పేర్కొంది. భారతీయ సైనిక బలగాల చర్యలు ''స్పష్టమైన, నిర్దేశితమైన, ఉద్రిక్తత పెంపు రహిత స్వభావమైనవని, ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేయడం, భారత్‌కు పంపే అవకాశం ఉన్న ఉగ్రవాదులను బలహీనపరచటంపైనే దృష్టి కేంద్రీకరించాయని, ఏ ఒక్క పాకిస్తాన్ సైనిక కేంద్రాలను లక్ష్యంగా చేసుకోలేదని తెలిపింది. ''లక్ష్యాలను ఎంపిక చేసుకోవటంలో,

తరువాయి 2లో

### నేడు అఖిలపక్ష సమావేశం

ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసిన 'ఆపరేషన్ సిందూ' నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం గురువారం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. న్యూఢిల్లీలోని పార్లమెంట్ కాంప్లెక్స్‌లోని పార్లమెంట్ లైబ్రరీ బిల్డింగ్‌లో కమిటీ రూమ్ నంబర్ జి–074లో ఉదయం 11 గంటలకు అఖిలపక్ష సమావేశం జరగనుంది. ఈ విషయాన్ని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెన్ రిజిజు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.



'ఆపరేషన్ సిందూర్'ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వయంగా పర్యవేక్షించినట్లు మిలిటరీ వర్గాలు తెలియజేశాయి. ఆపరేషన్ పూర్తయిన తరువాత ప్రతి బుధవారం నిర్వహించే యూనియన్ క్యాబినెట్ సమావేశం జరిగింది. జయప్రదంగా దాడులు పూర్తి చేసిన భారతీయ సైనిక బలగాలను ప్రశంసించారు. కాగా, రాష్ట్రపతి భవన్‌కు వెళ్ళి రాష్ట్రపతి, ఆర్మీ సుప్రీం కమాండర్ ద్రౌపది ముర్ముకు ఆపరేషన్ సిందు వివరాలను ప్రధాన మంత్రి మోదీ వివరించారు. 'ఆపరేషన్ సిందూర్' పేరును ప్రధానే ఎంపిక చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. సిందూర్ అంటే వివాహిత మహిళలు నుదట పెట్టుకునే సిందూరం.

### వివిధ దేశాల స్పందన

అణ్వస్త్రాలు కలిగివున్న భారత్‌పాకిస్థాన్ మధ్య యుద్ధం వస్తే ప్రపంచం తట్టుకోలేదు. నియంత్రణ రేఖ (ఎల్‌ఓసీ)తో పాటు ఐబీ వెంబడి భారత సైనిక చర్యలతో సంయమం పాటించాలి. శాంతియుతంగా దౌత్య మార్గంలో సమస్యలు పరిష్కరించుకోవాలి.
– ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్

భారత్, పాకిస్థాన్‌కు ప్రత్యేకంగా ఇచ్చే సందేశమేమీ లేదు కానీ ఇదంతా త్వరగా ముగుస్తుందని ఆశిస్తున్నా. ఈ పోరు ఇప్పటిది కాదు... కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతోంది. ఈ పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయి.
– అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

పాకిస్థాన్ మీద భారత్ ప్రతీకార దాడి... పోరు తీవ్రరూపం దాలుస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. పరిస్థితి చేయిదాటకుండా చూసుకోవాలి.
– మారియా జఖారోవా, రష్యా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి

'భారత్, పాకిస్థాన్ ఇరుగుపొరుగు దేశాలు, చైనాకు కూడా ఇవి పొరుగు దేశాలు. వీటి మధ్య ఇలాంటి పరిస్థితులు నెలకొనడం బాధాకరం. అన్ని రూపాల్లో ఉగ్రవాదాన్ని చైనా వ్యతిరేకిస్తుంది. పరిస్థితిని జటిలం చేసే చర్యలు నివారించాలని సూచిస్తోంది'
– చైనా విదేశాంగ శాఖ

### 26 మంది మృతి





46 మందికి గాయాలు : పాకిస్తాన్

తగిన జవాబిచ్చే హక్కు మాకుంది : పాక్ ప్రధాని

మా కుటుంబంలో 10 మంది చనిపోయారు

ధృవీకరించిన ఎల్ఇటి ఛీఫ్

**ఇస్లామాబాద్ :** భారత ఆపరేషన్ జరిగిన కొన్ని గంటల తరువాత పాకిస్తాన్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ మాట్లాడుతూ ''భారతదేశం పాల్పడిన యుద్ధ చర్యకు తగిన జవాబు'' ఇచ్చేందుకు అన్ని హక్కులు తమ దేశానికి ఉన్నాయని అన్నారు. ఐదు ప్రాంతాలలో భారతదేశం

తరువాయి 2లో

### ఎల్ఒసి వెంబడి పాక్ కాల్పులు

13 మంది పౌరులు మృతి, మరో 50 మందికి గాయాలు

**న్యూఢిల్లీ :** గత కొద్ది రోజులుగా జమ్ముకశ్మీర్‌లోని నియంత్రణ రేఖ (ఎల్ఒసి) వెంబడి పాకిస్తాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూనే ఉంది. బుధవారం కూడా ఎల్ఒసి వద్ద ఉన్న ఉన్న గ్రామాలపై పాకిస్తాన్ సైన్యం భారీ ఫిరంగి, మోర్టార్ షెల్లింగ్‌లతో విరిచుకుపడింది. కాల్పుల్లో నలుగురు పిల్లలు సహా కనీసం 13 మంది మరణించారని అధికారులు తెలిపారు. ఏప్రిల్ 22న దక్షిణ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడికి ప్రతీకారం తీర్చుకునేందుకు పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లోని తొమ్మిది ఉగ్రవాద లక్ష్యాలపై భారత సాయుధ దళాలు క్షిపణి దాడులు చేశాయి. ఆ తరువాత కొద్దిసేపటికే సరిహద్దు అవతల నుండి షెల్లింగ్‌లతో పాక్

తరువాయి 2లో

### 'ఆపరేషన్ సిందూర్'కు వామపక్షాల మద్దతు

ఉద్రిక్తతలను తగ్గించాలని సిపిఐ, సిపిఐ(ఎం), సిపిఐ(ఎంఎల్)లిబరేషన్ పార్టీల పిలుపు



**న్యూఢిల్లీ :** పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిస్పందనగా కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన 'ఆపరేషన్ సింధూర్'కు బుధవారం వామపక్షపార్టీలు మద్దతు ఇచ్చాయి. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్'కు మద్దతు ఇచ్చిన వామపక్ష పార్టీలలో సిపిఐ, సిపిఐ(ఎం), సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీలు ఉన్నాయి. ఉగ్రవాద మౌలికవసతులను కూల్చివేయడానికి పాకిస్థాన్‌పై నిరంతర ఒత్తిడి అవసరం అని అభిప్రాయపడ్డాయి. అదే సమయంలో ఒత్తిడిని మరింత తీవ్రతరం చేయకుండా కేంద్రందౌత్యపరమైన మార్గాలు అనుసరించాల్సిన ఆవశ్యకతను వామపక్షపార్టీలు నొక్కిచెప్పాయి. కశ్మీర్‌లోని పహల్గామ్‌లో 26మంది పౌరులపై ఉగ్రవాదులు అత్యంత కిరాతకంగా దాడిచేసి కాల్చిచంపిన రెండు వారాల తర్వాత బుధవారం అర్థరాత్రి దాటాక పాక్ ఆక్రమిత కశ్మీర్ (పిఒకె), పాకిస్థాన్‌లో ఉగ్రవాదుల స్థావరాలపై భారత్ 'ఆపరేషన్ సిందూర్'ను ప్రారంభించింది. ఈ నేపథ్యంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఇక్కడ విడుదల చేసిన ఒక ప్రకటనలో ఉగ్రవాదులు పహల్గామ్ పర్యాటక ప్రాంతాన్ని సందర్శించిన

తరువాయి 2లో




### భారత బలగాలకు ఇదే మా వందనం

'ఆపరేషన్ సిందూర్' దేశానికి గర్వకారణం

కేంద్ర ప్రభుత్వ చర్యలకు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు

**న్యూఢిల్లీ :** ''ఆపరేషన్ సిందూర్'' దేశానికి గర్వకారణమని కాంగ్రెస్‌పార్టీ అగ్రనాయకత్వం ప్రశంసించింది. ఎంతో ధైర్యసాహసాలతో భారత సాయుధ బలగాలు పాకిస్థాన్‌లో, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీరులో ఉన్న ఉగ్రవాద శిబిరాలకు వ్యతిరేకంగా''ఆపరేషన్ సిందూర్'' పేరుతో నిర్ణయాత్మక చర్యలు చేపట్టి జరిపన దాడులు గర్వకారణమని పేర్కొంది. ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సాయుధ బలగాలకు, కేంద్ర ప్రభుత్వ చర్యలకు కాంగ్రెస్‌పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే బుధవారంనాడు ఏర్పాటు చేసిన అత్యవసర

తరువాయి 2లో



కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నా. పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పిఓకె)లోని ఉగ్రవాద కేంద్రాలపై భారత సైన్యం నిర్వహించిన నిర్దేశిత దాడులు దేశ ప్రజలందరినీ గర్వపడేలా చేశాయి.. ఈ సమయంలో ప్రతి పౌరుడు భారత సైనికులకు అండగా సంఘీభావంగా, ఐక్యంగా నిలబడాలి. ''ఒక భారతీయ పౌరుడిగా నేను ముందుగా మన సాయుధ దళాలకు బలంగా అండగా నిలుస్తున్నాను. ఉగ్రవాద నిర్మూలన కోసం భారత సైన్యం చేపట్టిన ఈ ధైర్యవంతమైన చర్య దేశ భద్రతకు నిదర్శనం. ఈ దాడులు మన సైన్యం సామర్థ్యం, ధైర్యాన్ని ప్రపంచానికి స్పష్టంగా చాటాయి. మనమంతా ఒకే గొంతుకై, ఒకే స్వరం వినిపిద్దాం. జై హింద్''
– ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి



ఉగ్రవాదాన్ని తుదముట్టించేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ సింధూర్'ను స్వాగతిస్తూ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నాం. పాకిస్థాన్ పాలకులు, ఉగ్రవాదులు ఒకరిపై ఒకరు ఆధారపడి భారత్‌లో నరమేధాన్ని సృష్టించేందుకు కుట్రలు పన్నుతున్నారు. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌ను ఆసరాగా చేసుకుని ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తోంది. ఆ దేశానికి సరైన గుణపాఠం చెప్పాల్సిందే. సహనానికి మారుపేరైన భారత్‌లో ఉగ్రవాదాన్ని ఖచ్చితంగా శాశ్వతతంగా నిర్మూలించాల్సిందే. కేంద్ర ప్రభుత్వం పక్కా కార్యాచరణతో ముందుకు సాగేవిధంగా అన్ని రాజకీయ పార్టీలతో చర్చించి సరైన నిర్ణయం తీసుకోవాలి.
– సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

నేడు ఉగ్రవాద వ్యతిరేక పోరాటానికి సంఘీభావ ర్యాలీ

ప్రణాళిక ప్రకారం నిర్దేశిత లక్ష్యాలు ధ్వంసం చేశాం : రాజ్‌నాథ్‌సింగ్

ఇంతటితో ఆపొద్దు : హిమాన్షీ నర్వాల్

లోపలి పేజీల్లో

''భారత సైన్యం ప్రదర్శించిన తన సైనిక పాటవానికి ఒక భారతీయుడుగా నేను గర్వపడుతున్నాను. ఉగ్రవాదం, ఉన్మాదం ఏ రూపంలో వున్నా, ఏ దేశంలో వున్నా ప్రపంచ మానవాళికి నష్టం కలిగించేదే తప్ప లాభం చేకూర్చేదికాదు. ఉగ్రవాదం అంతం కావాల్సిందే. ఈ విషయంలో పాజిటివ్‌గా ఆలోచించే ప్రపంచ శక్తులన్నీ ఏకమై, ఉగ్రవాదాన్ని అంతమొందిస్తేనే శాంతి సామరస్యాలు నెలకొంటాయి'' భారత సైన్యం ఎంత విరోచితంగా దాడులు చేసిందో అంతే అప్రమత్తంగా వుండి దేశరక్షణలో మేమెవరికీ తీసిపోమనే విధంగా వారికి శక్తి సామర్థ్యాలుండాలి.
– బిఆర్ఎస్ అధ్యక్షులు కె.చంద్రశేఖర్‌రావు



### 'ఆపరేషన్ అభ్యాస్' సక్సెస్

హైదరాబాద్‌లో ఆరు ప్రాంతాల్లో మాక్ డ్రిల్





ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ : భారత్, పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో కేంద్రహోం శాఖ ఇచ్చిన ఆదేశాల మేరకు హైదరాబాద్‌లో సివిల్ మాక్ డ్రిల్ విజయవంతంగా ముగిసింది. హైదరాబాద్‌లో ఆపరేషన్ అభ్యాస్ పేరుతో జరిగిన ఈ మాక్ డ్రిల్‌లో వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో స్పందించాల్సిన విధానంపై అవగాహనకు మాక్ డ్రిల్ నిర్వహించారు. జిహెచ్‌ఎంసి పరిధిలోని పలు ప్రాంతాల్లో రెండు నిమిషాల పాటు సైరన్ మోగింది. హైదరాబాద్‌లోని ప్రధాన కూడళ్లలో సైరన్లు మోగాయి. ఒకవేళ యుద్ధం అనివార్యమైతే పౌరులు పాటించాల్సిన నియమాలను ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది వివరించారు. నగరంలోని నాలుగు ప్రాంతాలు (నాచారం, నల్‌నగర్, కంచన్‌బాగ్, సికింద్రాబాద్, ఇసిఐఎల్ ఎన్‌ఎఫ్‌సి) నుంచి కొనసాగిన మాక్ డ్రిల్స్‌ను కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ఉన్నతాధికారులు పర్యవేక్షించారు. మరోవైపు, మాక్ డ్రిల్‌లో భాగంగా ఫైరింగ్ జరిగినట్లుగా శబ్దాలు వినబటం, కొందరు సంఘ విద్రోహ శక్తులు కాల్పులు జరుపుతుండటం, ఒక భవనంలోకి వెళ్లి కాల్పులు జరిపితే..

తరువాయి 12లో

### కర్రెగుట్టల్లో భారీ ఎన్‌కౌంటర్

22 మంది మావోయిస్టులు హతం


- కొనసాగుతున్న కాల్పులు
- జల్లెడపడుతున్న సంయుక్త బలగాలు
- గుట్టల చుట్టూ కాల్పుల మోత

ప్రజాపక్షం/భద్రాచలం



తెలంగాణ రాష్ట్ర సరిహద్దు బీజాపూర్ జిల్లా పరిధిలోని కర్రెగుట్టల్లో బుధవారం భారీ ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. భద్రతా బలగాలుమావోయిస్టులకు నడుమ సాగిన భీకరపోరులో 22 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఘటను ఆ రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారి ధృవీకరించారు. అంతరాష్ట్ర సరిహద్దులోని కర్రెగుట్టల అడవిలో సంయుక్త భద్రతా బలగాలు కూంబింగ్ నిర్వహిస్తుండగా సుమారు తెల్లవారు జాము సమయంలో మావోయిస్టులు తరసపడటంతో ఇరు వర్గాల మధ్య ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి. ఐదు గంటలకుపైగా హోరాహోరీగా సాగాన ఎదురు కాల్పుల్లో 22 మంది సాయుధ మావోయిస్టులు మృతి చెందారు. వారి మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వారిని గుర్తించాల్సి ఉంది. ఎన్‌కౌంటర్‌తో మృతి చెందిన మావోయిస్టుల సంఖ్య ఏప్రిల్ 21నుండి ఇప్పటి వరకు 26కి చేరుకుంది. బస్తర్ ప్రాంతంలో మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా ప్రారంభమైన

తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## పలు దేశాల సెక్యూరిటీ అడ్వైజర్లకు అజిత్ దోవల్ ఫోన్



**న్యూఢిల్లీ :** ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని 9 ప్రదేశాలలో ఉగ్రవాదులు, వారి మౌలిక సదుపాయాలపై కేంద్రీకృత దాడులు జరిగిన తర్వాత మన నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్ అజిత్ దోవల్ పలు దేశాల ఎన్ఎస్ఎలతో అజిత్ సంప్రదింపులు జరిపారు. ఈ టెలిఫోన్ సంభాషణలో ఎన్ఎస్ఎ తన సహచరులకు.. యుద్ధంకు సంబంధించి తీసుకున్న చర్యలు, అమలు విధానం గురించి వివరించారు. అయితే, ఈ యుద్ధం తీవ్రతరం కానిది, సంయమనంతో కూడినది అని ఆయన సహచరులకు తెలిపారు. అయితే, పాక్ తో యుద్ధాన్ని తీవ్రతరం చేసే ఉద్దేశ్యం భారత్ కు లేదని, కానీ పాకిస్తాన్ తీవ్రతరం చేయాలని నిర్ణయించుకుంటే దృఢంగా ప్రతీకారం తీర్చుకోవడానికి సిద్ధంగా ఉందని దోవల్ నొక్కి చెప్పారు. రాబోయే రోజుల్లో దీనికి సంబంధించి తన సహచరులతో తాను సంప్రదిస్తానని కూడా ఎన్ఎస్ఎ అజిత్ దోవల్ తెలిపారు. ఇదే సందర్భంలో 'ఈ దాడికి బాధ్యులను జవాబుదారీగా ఉంచాలనే నిబద్ధతకు తాము కట్టుబడి ఉన్నాం' అని కూడా ఆయన విదేశీ ప్రతినిధులకు వెల్లడించారు.

# యుద్ధం రానివ్వొద్దు...సంయమనం పాటించండి

### భారత్-పాక్‌కు ప్రపంచ నేతల హితవు
### ప్రాదేశిక సుస్థిరతకు విఘాతం కలగనివ్వొద్దు
### శాంతియుతంగా చర్చించి సమస్యలు పరిష్కరించుకోండి
### దౌత్యానికి మా వంతు సహకరిస్తాం

**వాషింగ్టన్/మాస్కో:** భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధం జరిగే పరిస్థితులు నెలకొనడంపై ప్రపంచ దేశాధినేతలు ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యలను శాంతియుతంగా, సామరస్యంగా చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని, ఇందుకోసం రాజకీయ, దౌత్య, ద్వైపాక్షిక మార్గాలను అనుసరించాలని భారత్, పాకిస్థాన్‌కు హితవు పలికారు. ప్రాదేశిక శాంతి, సుస్థిరతకు విఘాతం కలగనివ్వవద్దని సూచించారు. దౌత్యానికి తమ వంతు సహకారం అందించేందుకు సిద్ధమని కొందరు నేతలు వెల్లడించారు. జమ్మూకశ్మీర్, పహల్గాంలో ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌పై భారత్ మంగళబుధవారం మధ్యరాత్రి పేరిట మెరుపు దాడులు చేసింది. పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలే లక్ష్యంగా 'ఆపరేషన్ సింధూర్' చేపట్టింది. దీంతో ప్రపంచ దేశాధినేతలు స్పందించారు. శాంతికి పిలుపునిచ్చారు. సంయమం పాటించాలని సూచనలు చేశారు. ఈ శత్రుత్వం త్వరగా ముగుస్తుందని అమెరికా, రష్యా, చైనా, పాన్, అరబ్‌తో పాటు అనేక దేశాలు ఆకాంక్షించాయి. శాంతి మార్గంలో సమస్యలు పరిష్కారం కాగలవని, యుద్ధం వద్దని, సంయమం పాటించాలని ఐక్య రాజ్య సమితి కూడా పిలుపునిచ్చింది. పహల్గాంలో ఉగ్రదాడి కి ప్రతీకారంగా భారత్ 'ఆపరేషన్ సింధూర్' ద్వారా పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్, పాకిస్థాన్‌లోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాను ధ్వంసం చేసింది. దాదాపు 100 మంది ఉగ్రవాదులను మట్టుబెట్టింది. ఈ పరిణామాన్ని పాకిస్థాన్ యుద్ధ చర్యగా అభివర్ణించింది.

**యుద్ధమొస్తే ప్రపంచం తట్టుకోలేదు: ఐరాస**

అణ్వస్త్రాలు కలిగివున్న భారత్‌పాకిస్థాన్ మధ్య యుద్ధం వస్తే ప్రపంచం తట్టుకోలేదని ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తం చేశారు. నియంత్రణ రేఖ (ఎల్‌ఓసీ)తో పాటు ఐబీ వెంబడి భారత సైనిక చర్యలతో సంయమం పాటించాలని పిలుపునిచ్చారు. శాంతియుతంగా దౌత్య మార్గంలో సమస్యలు పరిష్కరించుకోవాలని, యుద్ధంతో సమాధానం లభించబోదని హితవు పలికారు. ఈ మేరకు గుటెర్రస్‌కు అధికార ప్రతి



నిధి స్టెఫనీ దుజారిక్ వెల్లడించారు.

**శాంతించాలి...**

భారత్, పాకిస్థాన్‌కు ప్రత్యేకంగా ఇచ్చే సందేశమేమీ లేదు కానీ ఇదంతా త్వరగా ముగుస్తుందని ఆశిస్తున్నా అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఓవల్ కార్యాలయంలోకి ప్రవేశించేటప్పుడు విషయం తెలిసిందని చెప్పారు. ఈ పోరు ఇప్పటిది కాదు కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతోందని అన్నారు. ఈ పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. భారత్, పాకిస్థాన్ మధ్య పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నట్లు అమెరికా మంత్రి మార్కో రూబియో వెల్లడించారు. పాకిస్థాన్ మీద భారత్ ప్రతీకార దాడి... పోరు తీవ్రరూపం దాల్చుతుండటం ఆందోళన కలిగిస్తోందని రష్యా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మారియా జఖోరోవా అన్నారు. పరిస్థితి చేయిదాటకుండా చూసుకోవాలని హితవు పలికారు. ప్రాదేశిక ఘర్షణను నివారించేందుకు సంయమం పాటించాలని కోరారు. శాంతియుత, రాజకీయ, దౌత్య మార్గాల్లో భారత్, పాకిస్థాన్ మధ్య విభేదాలు పరిష్కారం కాగలవని ఆకాంక్షించారు. 1972 నాటి సిమ్లా ఒప్పందం, 1999 నాటి లాహోర్ డిక్లరేషన్ ప్రకారం ద్వైపాక్షిక మాధ్యమంగా సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని భారత్, పాక్‌కు రష్యా అధికారి సూచించారు. ప్రాదేశిక, అంతర్జాతీయ శాంతికి ముప్పు కలిగించే పరిస్థితి తేవద్దని, పరిస్థితి మరింత జఠిలం కాకుండా, ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చకుండా సంయమం పాటించాలని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఉప ప్రధాని అబ్దుల్లా బిన్ జాయేద్ అల్ నహ్యాన్ ఒక ప్రకటనలో కోరారు. చర్చలు, పరస్పర అవగాహనతో సైనిక ఘర్షణల నివారణకు పిలుపునిచ్చారు. దక్షిణాసియా సుస్థిరతకు, ప్రాదేశిక ఉద్రిక్తతల నివారణకు శాంతియుతంగా చర్చించుకోవాలని సూచించారు. శాంతి, సుస్థిరత, సౌభాగ్యతకు కట్టుబడాలన్నారు. శాంతియుతంగా చర్చలు జరుపుకోవాలని భావిస్తే తమ వంతు సహకారం అందించేందుకు యూఏఈ సిద్ధమన్నారు. భారత్, పాక్ మధ్య పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నట్లు పాన్ చీఫ్ కేబినెట్ సెక్రటరీ యోషిమాసా హయాషి తెలిపారు. ఈ పరిస్థితులు యుద్ధానికి దారి తీయొచ్చు... సంయమం పాటించండి అని రెండు దేశాలను కోరారు. దక్షిణాసియా శాంతి, సుస్థిరత కోసం చర్చల ద్వారా పరిస్థితిని నియంత్రించాలన్నారు. ఇదిలావుంటే, ప్రాదేశిక శాంతి, సుస్థిరత పరిరక్షణకు చైనా పిలుపునిచ్చింది. సంయమం పాటించాలని చైనా విదేశాంగ శాఖ ఒక ప్రకటన చేసింది. 'భారత్, పాకిస్థాన్ ఇరుగుపొరుగు దేశాలు, చైనాకు కూడా ఇవి పొరుగు దేశాలు. అన్ని రూపాల్లో ఉగ్రవాదాన్ని చైనా వ్యతిరేకిస్తుంది. అయితే శాంతి, సుస్థిరత దృష్ట్యా సంయమం పాటించాలని, పరిస్థితిని జఠిలం చేసే చర్యలు నివారించాలని సూచిస్తోంది' అని ప్రకటనలో చైనా విదేశాంగ శాఖ పేర్కొంది.

# వెనక్కు తగ్గిన పాక్!

### దౌత్యానికి సిద్ధమన్న రక్షణ మంత్రి
### దాడికి ప్రతిదాడి తప్పదని గాంభీర్యం



**ఇస్లామాబాద్:** భారత్ ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్ వెనక్కు తగ్గింది. రక్తం పారిస్తాం, దీటుగా బదులిస్తామని నిన్నటి వరకు హెచ్చరికలు చేసి... ఇప్పుడు దౌత్యానికి సిద్ధమంటోంది.అదే సమయంలో సరైన సమయంలో దాడులు చేస్తామంటూ గాంభీర్యాన్ని ప్రదర్శిస్తోంది. తాజా పరిణామాలపై పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ స్పందిస్తూ 'మేము ముందు దాడి చేయలేదు. అది భారత్ చేసింది. మాది ప్రతిస్పందన మాత్రమే' అని అన్నారు. న్యూఢిల్లీ ఉద్రిక్తతలను పెంచితే ఇస్లామాబాద్ తప్పక బదులిస్తుందన్నారు. అయితే భారత్ వెనక్కు తగ్గితే ఈ ఉద్రిక్తతలకు ముగింపు పలుకుతామని ఆసిఫ్ తెలిపారు. 'భారత్‌పై మేము ముందు దాడి చేయలేదు. అలా చేయమని పక్షం రోజులుగా చెబుతున్నాం. భారత్ ముందుగా దాడి చేసింది కాబట్టి ప్రతిఘటిస్తాం. భారత్ వెనక్కు తగ్గితే మాత్రం కచ్చితంగా ఉద్రిక్తతలకు ముగింపు పలుకుతాం' అని చెప్పారు. రెండు దేశాల మధ్య చర్చలు జరిగే అవకాశంపై తనకు సమాచారం లేదని రక్షణ మంత్రి తెలిపారు. తమ భూభాగంలో అంగుళాన్ని ఆక్రమించే ప్రయత్నం చేసినాగానీ భారత్ మూల్యాన్ని చెల్లించుకోవాలని హెచ్చరించారు. భారత్ వైఖరిని బట్టి పాకిస్థాన్ స్పందన ఉంటుందన్నారు. ఇస్లామాబాద్ చర్యలకు ఎంతో సమయం పట్టదన్నారు. అవసరాన్ని బట్టి దాడులు చేయడమా లేక దౌత్యాన్ని అనుసరించడమా అన్నది నిర్ణయిస్తామని ఆసిఫ్ వెల్లడించారు. ఇదిలావుంటే, భారత్ దాడులను పాకిస్థాన్ విదేశాంగ కార్యాలయం ఖండించింది. కాగా, తాము ఎంపిక చేసుకునే సమయంలో ప్రతీకారం తీర్చుకుంటామని పాకిస్థాన్ సైన్యం హెచ్చరించింది.

# సైన్యానికి సర్వాధికారాలు

### పాకిస్థాన్ జాతీయ భద్రతా మండలి



**ఇస్లామాబాద్:** ఆపరేషన్ సిందూర్ పేరిట తమ దేశంపై భారత్ మెరుపు దాడులను యుద్ధ చర్యగా పాకిస్థాన్ పేర్కొంది. తగు విధంగా బదులిస్తామని భారత్‌ను హెచ్చరించింది. ఇందుకోసం అన్ని బాధ్యతలను తమ సైన్యానికి అప్పగించినట్లు పాకిస్థాన్ జాతీయ భద్రతా మండలి ఒక ప్రకటనలో తెలిపింది. భారత్‌పై ప్రతీకార చర్యలకుగాను సర్వాధికారాలు సాయుధ దళాలకు అప్పగించినట్లు వెల్లడించింది. ప్రధాని షెహబాజ్ షరీఫ్ అధ్యక్షతన జాతీయ భద్రతా మండలి (ఎన్ఎస్‌సీ) బుధవారం కేబినెట్ మంత్రులు, ముఖ్యమంత్రులు, త్రివిధ దళాధిపతులు, సీనియర్ అధికారులు సమావేశమైంది. తాజా పరిస్థితులను సమీక్షించి... ఐరాస చార్టర్‌లోని ఆర్టికల్ 51 ప్రకారం ఆత్మరక్షణకు కల్పించిన హక్కుకు కట్టుబడి భారత్‌కు బదులిస్తావ్వాలని నిర్ణయించింది. ఇందుకు సమయం, స్థలం, దాడుల తీరుపై నిర్ణయాన్ని సైన్యానికే వదిలివేసింది. 'అమాయక మహిళలు, పిల్లలను ఉద్దేశపూర్వకంగా లక్ష్యం చేసుకోవడం హేయం. మానవ, అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధంగా హేయమైన నేరానికి భారత సైన్యం పాల్పడింది. కల్పిత ఉగ్రవాదుల శిబిరాల నెపంతో దాడులు చేసి, అమాయక పౌరులను హతమార్చింది. నివాసాలు, మసీదులను ధ్వంసం చేసింది' అని పాక్ భద్రతా మండలి మండిపడింది. వేలాది మంది ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు కల్పించేలా గల్ఫ్ దేశాల వాణిజ్య విమానాలను ప్రమాదంలో పడేవేసేలా భారత్ దాడులు చేసిందని పేర్కొంది. నీలంఝీలం జలవిద్యుత్ ప్రాజెక్టును భారత్ క్ష్యం చేసుకుందని పేర్కొంది. తమ భూభాగంలో ఉగ్రవాదులు లేరంటూ భారత్ ఆరోపణలను తోసిపుచ్చింది. ఏప్రిల్ 22 దాడులు ఆక్షేపణీయమని, వాటిపై తటస్థ, పారదర్శక విచారణను కోరినట్లు గుర్తుచేసింది. అమాయకుల ప్రాణాలు తీయడాన్ని పాకిస్థాన్ ఆమోదించదని, భారత్ ఉద్దేశపూర్వకంగా ఉద్రిక్తతలు సృష్టిస్తోందని, తదుపరి చర్యలకు ఆ దేశానిదే బాధ్యత అని భద్రతా మండలి పేర్కొంది.

**పంజాబ్ ప్రావిన్స్‌లో ఎమర్జెన్సీ:** భారత్ క్షిపణి దాడులతో అన్ని విద్యా వ్యవస్థలను మూసివేస్తూ పాకిస్థాన్, పంజాబ్ ప్రావిన్స్‌లో అత్యవసర పరిస్థితిని సీఎం మరియం నవాజ్ ప్రకటించారు. పంజాబ్‌లో హై అలర్ట్ విధించారు. పంజాబ్ పోలీసులు, భద్రతా సిబ్బందిని మోహరించారు. ప్రావిన్స్‌లోని అన్ని ఆసుపత్రుల్లో వైద్యులు, వైద్య సిబ్బంది సెలవులు రద్దు చేశారు. అన్ని జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు కూడా విధులకు హాజరు కావాలని ఆదేశాలిచ్చారు.

**48 గంటలు ఎయిర్‌స్పేస్ బంద్:** పాకిస్థాన్, పీఓకేలో భారత్ మెరుపు దాడులతో 48 గంటల పాటు గగనతలాన్ని మూసివేస్తూ పాకిస్థాన్ ఆదేశాలిచ్చింది. ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా ఇస్లామాబాద్, లాహోర్ మీదగా వెళ్లే విమానాలను కరాచీకి దారి మళ్లించినట్లు ఏవియేషన్ అధికారులు తెలిపారు. అంతర్జాతీయ, దేశీయ విమాన సేవలకు ఆటంకం కలిగింది. అయితే కొద్ది సేపటి కోసం తెరిచి... కొన్ని విమానాలను అనుమతించిన తర్వాత 24 గంటల కోసం లాహోర్ విమానాశ్రయాన్ని మూసివేశారు. ఈ పరిణామాలతో కరాచీలోని జిన్నా విమానాశ్రయం కిటకిటలాడింది. అంతర్జాతీయ, దేశీయ విమానాలన్నీ అక్కడ నుంచే రాకపోకలు సాగించాయి.

# 'సైబర్ జాగృక్త దివాస్'

### నిర్వహించిన టిజిసిఎస్‌బి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం 325 ప్రాంతాల్లో 'సైబర్ జాగృక్త దివాస్' కార్యక్రమం నిర్వహించినట్లు టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖాగోయల్ ఒక ప్రకటనలో తెలిపారు. రోజు రోజుకు పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేసేందుకు సైబర్ అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు శిఖాగోయల్ వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కళాశాలలు, వైద్య సంస్థలు, ప్రైవేట్ కార్యాలయాలు, ప్రజా సమావేశ కేంద్రాలు, బస్ స్టాండ్లలో ఈ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. తెలంగాణ గేమింగ్ చట్టం, 2017 ప్రకారం తెలంగాణలో ఆన్లైన్ బెట్టింగ్ యాప్‌లు చట్టవిరుద్ధం అని అన్నారు. బాధితులు 8712672222 వాట్సాప్ నెంబర్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

## భారీ ఎన్‌కౌంటర్

(మొదటి పేజీ తరువాయి)

అతిపెద్ద ఆపరేషన్‌లో డిఆర్‌జి, బస్తర్ ఫైటర్స్, స్పెషల్ టాస్క్ ఫోర్స్, రాష్ట్ర పోలీస్ అన్ని విభాగాలు, సెంట్రల్ ఫోర్స్, కోబ్రా బలగాలు సుమారు 24000 మంది పాల్గొంటున్నారు. మావోయిస్టు అగ్రనేతలు కర్రెగుట్టల్లో మకాం వేసి ఉన్నారనే పక్క సమాచారం మేరకు ఈ ఆపరేషన్‌ను కేంద్రప్రభుత్వం సవాల్‌గా తీసుకుని ప్రారంభించి ంది. ఏప్రిల్ 24వ తేదిన పిఎల్‌జిఏ బెటాలియన్ 1కి చెందిన ముగ్గులు మహిళా మావోయిస్టులు కర్రెగుట్టల్లో జరిగిన కాల్పుల్లో మృతి చెందారు. వారి ఒక్కొక్కరి తలపై రూ.8 లక్షల రివార్డు ఉంది. దీని ఆధారంగా సుమారు తెలంగాణఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో విస్తరించి ఉన్న 90 కి.మీ కర్రెగుట్టల్లో బలగాలు క్యాంపులు ప్రారంభించాయి. ప్రధానంగా ఛత్తీస్‌గఢ్ ప్రాంతం పూర్తి సేఫ్ జోన్‌గా ఉండటంతో దళాలు ఆ దిశగా దృష్టి సారించి ఫలితాలు సాధిస్తున్నాయి. గత కొద్దిరోజుల క్రితం అత్యంత కీలకమైన బంకర్లను గుర్తించి ధ్వంసం చేసి మందుగుండు సామాగ్రిని స్వాదీనం చేసుకున్నారు. ఇదే ప్రాంతంలో మే 5న భద్రతా బలగాలు జరిపిన కాల్పుల్లో ఒక మహిళా మావోయిస్టు కూడా మృతి చెందిన విషయం విధితమే. దట్టమైన అడవులు, ఎత్తైన కొండలతో ములుగు జిల్లా వెంకటాపురం సరిహద్దు కేంద్రంగా చేసుకుని ఛత్తీస్‌గఢ్‌లోని కొత్తపల్లి మొదలుకుని భీమారంపాడు, కస్తూరిపాడు, చిన్నఊట్లపల్లి, పెద్ద ఊట్లపల్లి, పూజారి కాంకేర్, గుంజపర్ల, నచ్చిఎలిమిడి, నడిపల్లి, గల్లమ్ ప్రాంతాలను విస్తరించి ఉండి మావోయిస్టుల అత్యంత రహస్యస్థావరంగా ఉంది. జరిగిన ఎదురు కాల్పుల్లో చాలా మంది మావోయిస్టు నాయకులు మృతి చెంది ఉండవచ్చని, లేదంటే గాయపడి ఉండవచ్చని, వారిని వారి సహచర మావోయిస్టులు అడవుల్లోనికి తీసుకెళ్లిపోయి ఉంటారని పోలీస్ అధికారులు అనుమానిస్తున్నారు. ఆపరేషన్ కగార్‌లో భాగంగా కర్రెగుట్టల్లో ఇప్పటి వరకు అత్యంత కీలకమైన బంకర్లను, రహస్య స్థావరాలను భద్రతా బలగాలు ధ్వంసం చేశాయి. పేలుడు పదార్థాలు, మందుగుండు సామాగ్రి, డిటోనేటర్లు, ఇతర నిల్వలను భారీగానే స్వాదీనం చేసుకున్నారు. కర్రెగుట్టల్లో కూంబింగ్ నిర్వహంచే సమయంలో అడగడుగునా అవాంతరంగా మారిన ఐఇడి బాంబుల మూలంగా సుమారు ఆరుగురు జావన్ల వరకు తీవ్ర గాయాల పాలు కాగా ప్రస్తుతానికి వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉంది. కర్రెగుట్టల్లో ఎదురుకాల్పులు కొనసాగుతున్నాయి. కాల్పుల మోతతో గుట్టలు దద్దరిల్లుతున్నాయి. కొండలను చుట్టుమిట్టిన భద్రతా బలగాలు క్షుణ్ణంగా గాలింపుచర్యలు చేపట్టాయి. ఇదిలా ఉండగా తాజాగా ఈ ఏడాది చోటు చేసుకున్న ఎన్‌కౌంటర్‌తో పాటు పలు ఎదురు కాల్పుల్లో 168 మంది మావోయిస్టులు హతమయ్యారు. వారిలో 151 మంది బీజాపూర్‌తో సహా ఏడు జిల్లాల్లో విస్తరించి ఉన్న బస్తర్ డివిజన్‌లో హతమార్చబడ్డారు.

## 26 మంది మృతి

(మొదటి పేజీ తరువాయి)

దాడులు జరిపిందని, శతృవుతో ఎలా వ్యవహరించాలో తమ బలగాలకు తెలుసునని అన్నారు. పాకిస్తాన్ రక్షణ శాఖ మంత్రి ఖ్వావాజా ఆసిఫ్ మాట్లాడుతూ న్యూఢిల్లీ ఉద్రిక్తతలను తగ్గిస్తే గనుకతో, వారితో ఉద్రిక్తతలను తగ్గించుకునేందుకు పాకిస్తాన్ సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ''కవ్వింపు లేకుండా''నే భారత్ దాడులకు పాల్పడిందని, భారతీయ సైన్యం దీర్ఘశ్రేణి ఆయుధాలతో పాకిస్తాన్ సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించినట్లు పాకిస్తాన్ విదేశీ మంత్రిత్వ శాఖ వ్యాఖ్యానించింది. గత అర్థరాత్రి భారత్ ఆరు ప్రాంతాలలో దాడులు చేసిందని, అందులో పాకిస్తాన్ 26 మంది హతమయ్యారని, 46 మంది గాయపడ్డారని పాకిస్తాన్ ఆర్మీ అధికార ప్రతినిధి లెఫ్టినెంట్ జనరల్ అహ్మెద్ షరీఫ్ చౌధ్రీ తెలిపారు. బహవల్ పూర్ ప్రాంతంలోనే 13 మంది మరణించారని, 37 మంది గాయపడ్డారని చెప్పారు. మురిద్కేలో ముగ్గురు మరణించగా, ఒకరు గాయపడ్డారని, సియాల్‌కోట్, షకర్‌ఘర్ ప్రాంతంలో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని మీడియాకు వివరించారు. ఎల్ఒసి వెంబడి భారత్ జరిపిన కాల్పుల్లో ఐదుగురు పౌరులు మరణించారని అన్నారు. ఏ సందర్భంలోనూ భారతీయ విమానాలు పాకిస్తాన్‌లోకి అనుమతించలేదేని, అలాగే పాకిస్తాన్ విమానాలు భారత్‌లోకి ప్రవేశించలేదని అన్నారు. పాకిస్తాన్ ఎయిర్‌ఫోర్స్ ఆస్తులన్నీ సురక్షితంగా ఉన్నాయని తెలిపారు.బహవల్ పూర్‌లోని తమ ప్రధాన కేంద్రంపై జరిగిన భారత క్షిపణుల దాడులలో తమ కుటుంబంలోని పది మంది, నలుగురు సన్నిహిత సహచరులు మరణించినట్లు జైష్‌-ఎ-మొహమ్మద్ ఛీఫ్ మౌలానా మసూద్ అజహర్ ధృవీకరించారు.

## పాక్ కాల్పులు

(మొదటి పేజీ తరువాయి)

విచక్షణారహితంగా కాల్పులు జరిపింది. పాక్‌లో అనేక పోస్టులు ధ్వంసమైన తర్వాత భారత సైన్యం తగిన విధంగా షెల్లింగ్‌కు ప్రతిస్పందిస్తోందని, శత్రు దేశం వైపు పెద్ద ఎత్తున ప్రాణనష్టం జరిగిందని అధికారులు తెలిపారు. పాకిస్తాన్ షెల్లింగ్‌ల దాడుల్లో పూంచ్ జిల్లా విధ్వంసానికి గురైంది. అక్కడ ఉన్న పౌరులందరూ మరణించారని, 42 మంది గాయపడ్డారని, వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. పాకిస్తాన్ జరిపిన విచక్షణారహిత కాల్పులు సరిహద్దు నివాసితులలో భయాందోళనలను సృష్టించాయి. వారు భూగర్భ బంకర్లలో లేదా వారి గ్రామాల లోపల లేదా వెలుపల సురక్షిత ప్రదేశాలకు వెళ్లాల్సి వచ్చిందని అధికారులు తెలిపారు. బాలాకోట్, మెంధార్, మంకోట్, కృష్ణ ఘాటి, గుల్పూర్, కెర్నీ, పూంచ్ జిల్లా ప్రధాన కార్యాలయాలతో సహా పూంచ్‌లోని ఎల్‌ఓసి వెంబడి కాల్పులు జరిగాయని, ఫలితంగా డజన్ల కొద్దీ ఇళ్ళు, వాహనాలు దెబ్బతిన్నాయని వారు తెలిపారు. మృతులను బల్వీందర్ కౌర్ అలియాస్ రూబీ (33), మొహమ్మద్ జైన్ ఖాన్ (10), అతని అక్క జోయా ఖాన్ (12), మొహమ్మద్ అక్రమ్ (40), అమ్రిక్ సింగ్ (55), మొహమ్మద్ ఇక్బాల్ (45), రంజీత్ సింగ్ (48), షకీలా , మొహమ్మద్ రఫీ (40) గా అధికారులు గుర్తించారు. బారాముల్లా జిల్లాలోని ఉరి సెక్టార్‌లో జరిగిన సరిహద్దు కాల్పుల్లో ఐదుగురు మైనర్ పిల్లలు సహా పది మంది గాయపడగా, రాజౌరి జిల్లాలో మరో ముగ్గురు గాయపడ్డారని అధికారులు తెలిపారు. కుప్వారా జిల్లాలోని కర్నా సెక్టార్‌లో జరిగిన కాల్పుల్లో అనేక ఇళ్లు కూడా అగ్నికి ఆహుతయ్యాయని అధికారులు తెలిపారు. సరిహద్దు అవతల నుండి కాల్పులు మధ్యాహ్నం వరకు తీవ్రంగా కొనసాగాయి, తరువాత అడపాదడపా జరిగాయి. ఎక్కువగా పూంచ్ సెక్టార్‌లో చోటు చేసుకున్నాయి. పూంచ్ బస్టాండ్‌పై పెద్ద ఎత్తున షెల్లింగ్‌లతో కాల్పులు జరపడంతో అనేక వాహనాలు దగ్ధమయ్యాయి. ఈ నేపథ్యంలో బాధితులను ఆసుత్రులకు తరలించండలో స్థానికులు ఇబ్బంది పడినట్లు అధికారులు తెలిపారు. 6, 7 తేదీల మధ్య రాత్రి సమయంలో, పాకిస్తాన్ సైన్యం ఎల్ఓసి, జమ్ముకశ్మీర్ ఎదురుగా ఉన్న అంతర్జాతీయ సరిహద్దు పోస్టుల నుండి ఫిరంగి దాడులతో ఏకపక్ష కాల్పులకు దిగిందని రక్షణ ప్రతినిధి ఒకరు తెలిపారు. భారత సైన్యం కూడా దీటుగా స్పందిస్తోందని ఆయన అన్నారు. భారత దళాలు ప్రతీకార చర్యలో పాక్ దళాలకు చెందిన అనేక పోస్టులను ధ్వంసం చేసి ప్రాణనష్టం కలిగించాయని ఆర్మీ వర్గాలు తెలిపాయి. జమ్ము ప్రాంతంలోని ఐదు సరిహద్దు జిల్లాల్లో ఉన్న విద్యాసంస్థలు బుధవారం మూసివేయాలని అధికారులు ఆదేశించారు. ప్రస్తుత పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, జమ్ము, సాంబా, కథువా, రాజౌరి, పూంచ్‌లోని అన్ని మూసివేయాలని డివిజనల్ కమిషనర్ రమేష్ కుమార్ ఎక్స్‌లో తెలిపారు. పహల్గామ్ దాడి తర్వాత తీవ్ర ఉద్రిక్తతల మధ్య, జమ్ము కశ్మీర్‌లోని సరిహద్దుల వెంట పాక్ కవ్వింపు చర్యలకు పాల్పడడం వరుసగా ఇది 13వ రాత్రి.

## వామపక్షాల మద్దతు

(మొదటి పేజీ తరువాయి)

పౌరులను తీవ్రంగా రెచ్చగొట్టి అమాయకుల ప్రాణాలను పొట్టనబెట్టుకున్నారని, అలాంటి సమయంలో ఉగ్రవాదుల మూలాలపై దృఢంగా స్పందించడం తప్ప భారతదేశానికి వేరే మార్గం లేదని సిపిఐ విశ్వసిస్తున్నదని పేర్కొన్నారు. భారత ప్రభుత్వం దేశ ప్రజలను, సమగ్రతను రక్షించేలా చూడాలని, పూర్తి స్థాయి సంఘర్షణను ఆహ్వానించకుండా జవాబుదారీతనానికి ప్రాధాన్యతనిస్తూ క్రమబద్ధీకరించబడిన తీవ్రతరం కాని విధానాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రదర్శిస్తున్నదని సిపిఐ తెలియజేసింది. అయితే ఇదే సమయంలో భారత ప్రభుత్వం జాతీయ ఏకాభిప్రాయాన్ని బలోపేతం చేయడానికి, ఉగ్రవాదంపై జరిగే పోరాటంలో సమిష్టి సంకల్పంతో ఉగ్రవాదాన్ని తుదముట్టించడానికి తక్షణమే అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం ఒకటి ఏర్పాటుచేయాలని సిపిఐ కోరింది. ఆసియా ప్రాంతంలో మరింత ఉద్రిక్తతలను తగ్గించి ఈ ప్రాంతంలో శాంతిని పరిరక్షించడానికి, ఒప్పంద పరిష్కారాలను కనుగొనేందుకు దౌత్యమార్గాలను అనుసరించాల్సిన ఆవశ్యకతను సిపిఐ పునరుద్ఘాటించింది.ఉగ్రవాద దెబ్బకు గురైన పాకిస్థాన్ కూడా తన గడ్డపై నుండి పనిచేస్తున్న అన్ని నెట్‌వర్క్‌లను సమూలంగా నిర్మూలించాలని సిపిఐ విజ్ఞప్తి చేస్తోంది. ఈ సమయంలో భారత ప్రజల ఐక్యత, బలం, న్యాయం పట్ల అచంచల నిబద్ధత, లౌకికవిలువల పరిరక్షణకు కృషిచేయాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని సిపిఐ పిలుపునిచ్చింది. ఉమ్మడి ప్రాంతీయ సంకల్పం మాత్రమే హింసా చక్రాన్ని అంతం చేయగలదని, మన ప్రజలకు దీర్ఘకాలిక శాంతిని, భద్రతను ప్రసాదిస్తుందన్న విశ్వాసాన్ని సిపిఐ వ్యక్తం చేసింది.లక్ష్యంగా చేసుకున్న దాడుల స్వభావం..పాకిస్థాన్ సైనిక ఆస్తులను నివారించడం, ఉగ్రవాదుల మౌలిక వసతులపై మాత్రమే దృష్టి సారించడం, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో (పిఒకె), పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాల మౌలికవసతులను నాశనం చేయాలనే ధ్యేయంతో భారత సాయుధ బలగాలు 'ఆపరేషన్ సిందూర్'ను నిర్వహించాయని, సాయుధ బలగాల ప్రకారం ఈ దాడులు నిశితదృష్టి సారించి నిర్దేశిత కేంద్రీకృత ఉగ్రవాద స్థావరాలపై మాత్రమే జరిగాయని, తీవ్రతరం కాకుండా 9 స్థలాలలో విజయవంతంగా దాడులు చేయడం అభినందనీయమని సిపిఐ(ఎం) తెలిపింది. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో అన్ని రాజకీయ పార్టీలు కేంద్ర ప్రభుత్వం తీసుకునే అన్ని రకాల చర్యలకు మద్దతు ఇచ్చాయని, ఉగ్రవాదులు, వారి మద్దతుదారులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం చేపుడుతున్న చర్యలపై ఇప్పుడు ఆ మద్దతును ఇంకా కొనసాగిస్తున్నాయని సిపిఐ(ఎం) తెలియజేసింది. భారత ప్రభుత్వం దేశ ప్రజలను, సమగ్రతను రక్షించేలా చూడాలని సిపిఐ(ఎం) ప్రకటన కోరింది.ఇండోపాకిస్థాన్ యుద్ధాన్ని నివారించడానికి ఉద్రిక్తతలను తగ్గించాలని సిపిఐ(ఎం.ఎల్) లిబరేషన్ ఒక ప్రకటనలో కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

## ధ్వంసం

(మొదటి పేజీ తరువాయి)

అమలు చేసే విధానంలో భారతదేశం విశేష నిగ్రహాన్ని ప్రదర్శించింది,'' అని రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది.బహవల్‌పూర్, మురిద్కే సహా తొమ్మిది లక్ష్యాలపై దాడులు విజయవంతమయ్యాయని భారతీయ అధికారులు తెలిపారు. మీడియా సమావేశంలో మిస్రీ మాట్లాడుతూఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసేందుకు, భవిష్యత్తు ఉగ్ర దాడులను ''నిరోధించేందుకు, ముందే నిర్వీర్యం చేసేందుకు'' భారతీయ సైన్యం ''నిర్దేశిత, ఉద్రిక్తత పెంపు రహిత, తగిన, బాధ్యతాయుతమైన'' సైనిక చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ''పాకిస్తాన్ ఆధారిత ఉగ్రవాద కేంద్రాలను పర్యవేక్షిస్తున్న మన నిఘా వర్గాలు భారతదేశంపై మరిన్ని ఉగ్ర దాడులకు జరిగేందుకు అవకాశం ఉన్నట్లు సంకేతాలు ఇచ్చాయ''ని తెలిపారు. ''భారతదేశం తనకు ఉన్న ప్రతిస్పందించే హక్కును ఈరోజు ఉదయం వినియోగికొని, మరిన్ని సీమాంతర దాడులను ముందస్తుగా భగ్నం చేయడం, నియంత్రించడం జరిగింది'' అని అన్నారు. ''పహల్గాంలో దాడి అత్యంత ఆటవికమైనదని, బలైన వారిని వారి కుటుంబసభ్యుల ముందే నేరుగా తలపై గురిపెట్టి సమీపంగా కాల్చారని చెప్పారు. '' చంపిన తీరు ద్వారా కుటుంబసభ్యులను ఉద్దేశ్యపూర్వకంగా భీతావహులను చేశారని, ఇక్కడ నుంచి సందేశాన్ని పంపాలని చెప్పారని'' ఆయన అన్నారు. వింగ్ కమాండ్ ఓ్యమికా సింగ్ మాట్లాడుతూ పాకిస్తాన్ ఒకవేళ పరిస్థితులను ఉద్రిక్తంగా మార్చేందుకు ''దుస్సాహసానికి'' పాల్పడితే భారతీయ సాయుధ బలగాలు ప్రతిస్పందించేందుకు సిద్ధంగా ఉన్నాయని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మహిళా సైనికాధికారులు 'ఆపరేషన్ సిందూర్' గురించి విడియోలను ప్రదర్శిస్తూ వివరించారు.తొలుత పాకిస్తాన్ ప్రేరిత ఉగ్రవాద సంస్థలు చేసిన పాల్పడిన 2001 పార్లమెంట్‌పై దాడి, 2008 ముంబై దాడులు, 2019 పుల్వామా ఆత్మాహుతి దాడి వంటి దాడుల విడియోలను ప్రదర్శించారు. ఉగ్ర శిబిరాలపై సూక్ష్మ సామర్థ్యంతో , అత్యంత జాగ్రత్తగా వార్‌హెడ్‌లతో వినియోగించే ఆయుధాలను ఎంపిక చేసి, చుట్టుపక్కల ఎలాంటి నష్టం సంభవించకుండా చర్యలు తీసుకున్నట్లు వారు తెలిపారు. ప్రతి లక్ష్యం కూడా నిర్ధారిత భవనాన్ని లేదా భవనాల సమూహాలపైనే ప్రభావం ఉండేలా చూసినట్లు తెలిపారు.

## ఇదే మా వందనం

(మొదటి పేజీ తరువాయి)

వర్కింగ్ కమిటీ సమావేశం అనంతరం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశ భద్రతకు, ఐక్యత, సమగ్రతలకు పూర్తి భరోసా ఇచ్చే భారత సాయుధ బలగాలకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జునఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ ఇద్దరూ సమావేశంలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం గురువారంనాడు ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశంలో కూడా ఈ ఇద్దరు నాయకులూ పాల్గొంటారు. ''ఆపరేషన్ సిందూర్ గురించి, ప్రభుత్వ చర్యల గురించి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ అత్యవసర సమావేశం నిర్వహించింది, భారత సాయుధబలగాలు చేపట్టిన చర్యకు తామెంతో గర్విస్తున్నాం, పాకిస్థాన్‌లో, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీరులో తిష్ఠవేసి ఉన్న ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేయడం ద్వారా వారికి తగిన గుణపాఠం చెప్పాం, భారత సాయుధబలగాల ధైర్యసాహసాలకు ఇవే మా వందనాలు, వారి కృతనిశ్చయం, వారి దేశభక్తికి మా వందనాలు'' అని ఖర్గే సమావేశం అనంతరం పేర్కొన్నారు. ''పహల్గామ్‌లో లష్కరే తోయిబా ఉగ్రవాదులు దాడిచేసిన మొదటి రోజు నుండి భారత జాతీయ కాంగ్రెస్ చాలా స్పష్టమైన వైఖరితో భారత సాయుధ బలగాలకు తమ సంఘీభావాన్ని ప్రకటిస్తున్నది, ప్రభుత్వానికి కూడా స్థిరమైన మద్దతు ఇచ్చింది, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా వారు తీసుకునే ప్రతి నిర్ణయాత్మకమైన చర్యను సమర్థిస్తామని ప్రకటించాం'' అని మల్లిఖార్జున ఖర్గే పేర్కొన్నారు. ఈ వర్కింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న రాహుల్‌గాంధీ కూడా స్పందిస్తూ, భారత సాయుధ బలగాలు దేశ రక్షణకోసం తీసుకునే ప్రతి చర్యకూ కాంగ్రెస్‌పార్టీ మద్దతు ఇస్తుందన్నారు. ''వర్కింగ్ కమిటీ సమావేశంలో మేం చర్చించాం, మా కోరికా అదే, వారిపట్ల పూర్తి ప్రేమాభిమానాలు ప్రదర్శిస్తున్నాం'' అన్నారు. పాకిస్థాన్ నుండి, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీరు నుండి వచ్చే ఉగ్రవాదం భారత్‌కు పెద్ద సమస్యగా మారిందన్నారు. ''భారత్ వంటి గొప్ప దేశ జాతీయ ఐక్యతను, సమగ్రతను రక్షించుకోవడానికి అన్నిస్థాయిలలోనూ ఐఐక్యత ఎంతో అవసరం, భారత జాతీయ కాంగ్రెస్ భుజం భుజం కలిపి దేశ సైనికులతో ముందుకు నడుస్తుంది, దేశ చరిత్రలో భారత ఐక్యత, సమగ్రతకోసం మన సైనికులు ప్రాణత్యాగాలు చేశారు, జాతీయ ప్రయోజనాలను భారత్ ప్రధానాంశంగా భావిస్తుందని యావత్ ప్రపంచానికీ తెలుసు, మేం మన సాయుధ బలగాలకు పూర్తి మద్దతు ఇస్తున్నాం'' అని ఖర్గే తన ప్రకటనలో పేర్కొన్నారు. ''ఈ విషయంలో ఎలాంటి విభేదాలు లేవు, ప్రతిఒక్కరూ ఐక్యంగా ఉన్నారు. ''ఇండియాకూటమి'' భాగస్వామ్యపార్టీలు కూడా దేశ ఐక్యతకోసమే పాటుపడుతున్నాయి, ఇది నిర్ణయించిన విషయం, మేం మా మద్దతును పునరుద్ఘాటిస్తున్నాం'' అని ఖర్గే పేర్కొన్నారు. సీనియర్ పార్టీ నాయకులు ఎఐసిసి కోశాధికారి అజయ్ మకెన్, లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమార్, ప్రధాన కార్యదర్శులు కె.సి.వేణుగోపాల్, ప్రియాంకాగాంధీ వాద్రా, ముకుల్ వాస్నిక్, జైరామ్ రమేశ్, రణదీప్ సూర్జేవాలా, కేంద్రమాజీమంత్రి ఆనంద్ శర్మ, లోక్‌సభలో కాంగ్రెస్ ఉపనాయకుడు గౌరవ్ గొగోయ్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. భారత యుద్ధ విమానాలు పాకిస్థాన్ గగనతల ఆంక్షలను ఉల్లంఘించకుండా మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత జైషే మహ్మద్ కేంద్రకార్యాలయం, లష్కరే తోయిబా కేంద్ర కార్యాలయాలపై దాడులు చేశాయి. చాలా సంక్షిప్తస్థాయిలో ఈ దాడులు ఇరవైఐదు నిమిషాల వ్యవధిలో ముగిశాయి. పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీరులలో ఉన్న అత్యంత కీలకమైన మొత్తం తొమ్మిది స్థావరాలపై భారత యుద్ధ విమానాలు దాడులు చేశాయి. ఈ తొమ్మిది కీలక కేంద్రాలలో పెద్దసంఖ్యలో ఉగ్రవాదులు తలదాచుకుని ఉన్నారు. సుమారు 100 మంది ఉగ్రవాదులను భారత దళాలు మట్టుబెట్టాయని భారత మీడియా అంచనావేసింది.

**ప్రధానమంత్రి మోదీ కనీసం అఖిపక్షసమావేశానికి రావాలి**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ కనీసం అఖిలపక్ష సమావేశానికైనా హాజరుకావాలని కాంగ్రెస్‌పార్టీ కోరింది. దేశ సరిహద్దు ల్లో జరుగుతున్న పరిణామాలపై వివరించేందుకు కేంద్ర ప్రభుత్వం గురువారంనాడు (8వ తేదీ) అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసింది. ఈ అఖిలపక్ష సమావేశానికైనా ప్రధానమం త్రి హాజరుకావాలని, ఆయనే స్వయంగా పరిస్థితులను వివరించాలని రాజ్యసభలో ప్రతిప క్ష నాయకుడు మల్లికార్జునఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ విజ్ఞప్తి చే శారు. గతనెల 22వ తేదీన పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడికి ప్రతీకారంగా మే ఆరవతేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత భారత వాయుసేన పాకిస్థాన్‌లో, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీరులో ఉగ్రవాద శిబిరాలపై దాడులు చేసింది. ''ప్రధానమంత్రి గురువారంనాడు జరిగే అఖిలపక్ష సమావేశానికి హాజరవుతారని మేం అంచనావేస్తున్నాం,, ఆయన ఏప్రిల్ 24న జరిగిన స మావేశానికి కూడా హాజరుకాలేదు, ఈసారైనా వస్తారని అంచనావేస్తున్నాం, రేపు ఆయన రావాలి'' అని జైరామ్ రమేశ్ కోరారు. మల్లికార్జునఖర్గే, రాహుల్‌గాంధీ కూడా గురువారం అఖిలపక్ష సమావేశానికి హాజరవుతున్నారని చెప్పారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో 11న బొటానికల్ గార్డెన్‌లో 'బర్డ్ వాక్'

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ (టిజిఎఫ్‌డిసి) దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో ఈనెల 11న బొటానికల్ గార్డెన్‌లో 'బర్డ్ వాక్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎకో టూరిజం రంజిత్‌నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి పిల్లలు, పెద్దలు అందరూ ఆహ్వానితులేనని, పాల్గొనే వారు పక్షుల జాతులను గుర్తించడం, పక్షుల ఏరకమైన వాతావరణంలో మరియు ఏ రకమైన వృక్షాలలో గూళ్ళు కడతాయి అనేది తెలుసుకోవచ్చు, పక్షుల ఆహారపు అలవాట్ల గురించి, పక్షులు ఎలా కదులుతాయి, ఎగురుతాయి, మరియు వాటి సామాజిక ప్రవర్తన ఎలా ఉంటాయో మా యొక్క పక్షి నిపుణులు, నేచురలిస్టులు వచ్చిన వారికి పక్షులను చూపిస్తూ క్షుణ్ణంగా వివరిస్తారని రంజిత్ నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనాలనుకునే వారు మరిన్ని వివరాల కోసం 98852 98980, 73823 07476 నెంబర్‌లను సంప్రదించాలని వారు కోరారు.

# సమ్మె ఉద్యోగుల హక్కు

ఆర్‌టిసి కార్మికుల సమస్యలపై త్వరలో సిఎంను కలుస్తాం
రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టిందే బిఆర్‌ఎస్
సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే సాంబశివరావు



ప్రజాపక్షం/హైదరాబాద్ : సమ్మె అనేది ఉద్యోగుల హక్కు అని, పాలకులు వారి సమస్యలను పట్టించుకోనప్పుడు వాటిని సాధించుకునేందుకు అదే ఒక సాధనమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే సాంబశివరావు అన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూంభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలంగా తమ సమస్యలు పరిష్కారం కానప్పుడు ఉద్యోగులు ఆవేదనతో ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం సహజమని, అలాంటి సమయాల్లో వారితో చర్చించేందుకు పాలకులు ఎప్పుడూ సానుకూలంగా ఉండాలే తప్ప ఆవేశానికి, ఆక్రోశానికి గురికావడం సమస్యలను మరింత జఠిలం చేస్తుందన్నారు. ఉద్యోగ సంఘాల ప్రకటనపై రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవేశం, ఆవేదనతో ఓ ప్రకటన చేయడం తప్పు కాకపోయినప్పటికీ, ఈ సమస్యకు కారణమైన వారు ఎవరో ప్రజలకు ఓర్పుతో అర్థమయ్యే విధంగా చెప్పాలని సూచించారు. ఇందుకు ముందుగా ఉద్యోగ సంఘాలతో సిఎం చర్చలు జరపాలని, దీంతో సగం సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చే నాటికే అప్పులే కాకుండా రాష్ట్రంలో వివిధ వర్గాల వారికి దాదాపు రూ.70 వేల కోట్ల బకాయిలు ఉన్నాయని, వీటిని ఉద్యోగ సంఘాల నేతలకు సమస్యలను వివరించడంతో పాటు ఆర్థికయేతర సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, ఆర్థికపరమైన అంశాలను ఒకేసారి కాకపోయినా విడతల వారీగా చెల్లించడం ద్వారా వారికి న్యాయం చేయాలని ఆయన అన్నారు.

**ఆర్‌టిసి కార్మికుల సమస్యలపై త్వరలో సిఎంను కలుస్తాం**

టిజిఎస్ ఆర్‌టిసి కార్మికుల సమస్యల పరిష్కారానికి త్వరలోనే ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డితో సమావేశం కానున్నామని కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఆర్‌టిసి కార్మికులు ఈనెల 7వ తేదీ నుంచి సమ్మె తలపెట్టిన నేపథ్యంలో మంగళవారం రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో జరిగిన చర్చల్లో ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన వచ్చిందని, సిఎంతో చర్చించి సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారని, దీంతో సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేశారన్నారు. మంత్రితో జరిగిన చర్చల్లో ప్రధానంగా ప్రభుత్వంలో ఆర్‌టిసి విలీనం, కార్మిక సంఘాల పునరుద్ధరణతో పాటు వారికి రావాల్సిన బకాయిలకు సంబంధించిన అంశాలపై మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. యూనియన్లను నిర్వహించుకునే హక్కు బ్రిటీష్ కాలం నుంచే ఉందని, కానీ గత సిఎం కెసిఆర్‌ఓ నియంతలా వ్యవహరిస్తూ యూనియన్లను రద్దుచేయడమే కాకుండా కార్మిక హక్కులను కాలరాస్తూ ఆర్‌టిసిని ఈ దుస్థితికి తీసుకువచ్చారన్నారు. అయితే కాంగ్రెస్ ఆర్‌టిసి కార్మికులతోపాటు ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం అధికారులతో కమిటీ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆర్‌టిసి కార్మికుల సమస్యలను తక్షణమే పూర్తిస్థాయిలో పరిష్కరించే విధంగా త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సమావేశం కానున్నామని కూనంనేని సాంబశివరావు తెలిపారు.

**రాష్ట్రాన్ని అప్పులు ఊబిలోకి నెట్టిందే బిఆర్‌ఎస్**

ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న సమస్యలన్నిటికీ కారణం గత బిఆర్‌ఎస్ ప్రభుత్వమేనని, కాని తన తప్పులను దాచుకుని కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ ప్రజలను నమ్మించే ప్రయత్నం చేయడం దుర్మార్గమని కూనంనేని సాంబశివరావు విమర్శించారు. రాజకీయ దురుద్దేశంతో బిఆర్‌ఎస్ చేస్తున్న విమర్శలను తిప్పికొట్టేవిధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచించాలని, లేకపోతే ప్రభుత్వం అప్రతిష్టపాలయ్యే ప్రమాదం ఉందన్నారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వంతో పోల్చితే కాంగ్రెస్ పాలన కొంత ఫర్వాలేదని తెలిపారు.

**రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చేందుకు ఒక సలహా కమిటీని వేయాలి**

రాష్ట్రంలో నెలకొన్న ఆర్థిక పరిస్థితులను మెరుగుపర్చుకునేందుకు ఆర్థికవేత్తలు, మేధావులతో ఒక సలహా కమిటీని ఏర్పాటు చేయాలని కూనంనేని సాంబశివరావు ప్రభుత్వానికి సూచించారు. రేషన్ కార్డుల లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ, సన్న వరి ధాన్యం పండించిన రైతులకు బోనస్, రైతు భరోసా లాంటి పలు సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేయడం అభినందనీయమని, కాంగ్రెస్ ఇచ్చిన మిగితా హామీలను పూర్తిగా అమలు చేయాల్సిందేనని, ఆర్థిక లోటు పేరుతో తప్పించుకునే ప్రయత్నం చేయకుండా ఇందులో అతి ప్రాధాన్యత గల పథకాలపై లోతుగా విశ్లేషించి అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి గతంలో ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం 10 బస్తాల సిమెంట్ ఇచ్చిందనో, లేక రూ.15 వేల ఆర్థిక సహాయం అందించిందనో కుంటి సాకులతో ప్రస్తుత లబ్ధిదారుల జాబితా నుంచి వారిని తప్పిస్తున్నారని, దీని వల్ల దళితులు, ఆదివాసీలే అధికంగా నష్టపోతున్నారని, ఇది సరైందికాదన్నారు. గతంలో పూర్తిస్థాయిలో లబ్ధిపొందిన వారిని మినహాయించి అరకొర సహాయం పొందిన వారికి ప్రస్తుత జాబితాలో ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని కూనంనేని సాంబశివరావు కోరారు.

**కగార్ ఆపరేషన్ నిలిపివేయాలి**

ఈ దేశ పౌరులైన మావోయిస్టులను ఏరివేసేందుకు ఆపరేషన్ కగార్ చేపట్టడం సరైంది కాదని, తక్షణమే దీనిని నిలిపివేయాలని కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. మావోయిస్టు చర్చలకు వస్తామంటే చర్చలకు ఒప్పుకునేదిలేదని, లొంగిపోవాల్సిందేనని ఒక కేంద్ర మంత్రి నియంతలా మాట్లాడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ప్రజాస్వామిక దేశమని, వారు శాశ్వతంగా మంత్రులుగా ఉండరనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. మావోయిస్టులు తప్పు చేస్తే తప్పకుండా ఖండిస్తామని, అయితే దేశ పౌరులైన వారికి దేశంలోని అన్ని చట్టాలు వర్తిస్తాయని, వాటి ప్రకారం వారిని శిక్షించాలే తప్ప ఎన్‌కౌంటర్లు చేయడం తగదన్నారు. కూంబింగ్ పేరుతో కర్రెగుట్టలను చుట్టుముట్టి 22 మందిని ఎన్‌కౌంటర్ చేయడం దుర్మార్గమన్నారు. ఇంకా ఎంత మందిని చంపితే కేంద్ర పాలకుల రక్త దాహం తీరుతుందని, ఈ ఘటనల వల్ల వారు సంతోషంగా ఉంటారా ప్రశ్నించారు. ప్రజా సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే కేంద్రం ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు.



## నేడు ఉగ్రవాద వ్యతిరేక పోరాటానికి సంఘీభావ ర్యాలీ

ప్రజాపక్షం / హైదరాబాద్ : భారత సైనిక బలగాలకు సంఘీభావంగా, అండగా ఉన్నామని సందేశం ఇవ్వడానికి తెలంగాణ ప్రజల తరఫున గురువారం సాయంత్రం 6 గంటలకు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సచివాలయం నుంచి నెక్లెస్ రోడ్డు వరకు ర్యాలీ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 'ఉగ్రవాద వ్యతిరేక పోరాటాలకు సంఘీభావ ప్రకటన'గా ఈ ర్యాలీ కొనసాగుతుందని ప్రకటించింది. దేశ భద్రతా బలగాలు 'ఆపరేషన్ సింధూర్' చేపట్టిన నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి బుధవారం అత్యవసర సమీక్ష సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్‌లో జరిగిన ఆర్మీ, పోలీసు, డిజాస్టర్ మేనేజ్మెంట్, ఇతర అత్యవసర విభాగాలతో తాజా పరిణామాలను ముఖ్యమంత్రి సమీక్షించి ఇలాంటి సందర్భాల్లో తీసుకోవలసిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఇలాంటి సమయాల్లో రాజకీయాలకు, పార్టీలకు సంబంధించిన వివాదాలకు తావులేదని సిఎం అన్నారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనడానికి సర్వసన్నద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి వివిధ విభాగాలకు స్పష్టంగా పలు ఆదేశాలిచ్చారు. మంత్రులు, అధికారులు 24 గంటలు అందుబాటులో ఉండాలని, అత్యవసర సర్వీసులు అందించే విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సెలవులు రద్దు చేయాలన్నారు. ఉద్యోగులంతా అందుబాటులో ఉండాలని, విదేశీ పర్యటనలు రద్దు చేసుకోవాలన్నారు. వైద్యం, పౌరసరఫరాలు, విద్యుత్ వంటి అత్యవసర సేవల విభాగాలన్నీ 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండేలా టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలి. పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమాచారం కోసం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సిఎం చెప్పారు. పరిస్థితిని ఆసరా చేసుకుని సోషల్ మీడియాలో రెచ్చగొట్టే ప్రకటనలు చేసే వారి పట్ల పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా తప్పుడు సమాచారం వ్యాప్తి జరగకుండా ఫేక్ న్యూస్ ప్రచారం చేసే వారిపై కఠినంగా వ్యవహరించాలని, ఫేక్ న్యూస్‌ను, పుకార్ల వ్యాప్తిని అరికట్టడానికి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని చెప్పారు.

## సిఎం రేవంత్‌రెడ్డిని దిగిపొమ్మనడానికి కెటిఆర్‌కు ఉన్న అర్హత ఏమిటి?

మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్

ప్రజాపక్షం/హైదరాబాద్ : బిఆర్‌ఎస్ నాయకులు తెలంగాణ రాష్ట్రంపై కక్షగట్టి అభివృద్ధికి అడ్డుపడుతున్నారని తెలంగాణ రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్ అన్నారు. ప్రజల చేత ఎన్నుకోబడిన సిఎం రేవంత్‌రెడ్డిని దిగిపొమ్మనడానికి మాజీ మంత్రి కెటిఆర్‌కు ఏమి అర్హత ఉందని ఆయన ప్రశ్నించారు. గాంధీభవన్‌లో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను బిఆర్‌ఎస్ నేతలు జీర్ణించుకోలేక ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయాలనే ఉద్దేశ్యంతో బిజెపి, బిఆర్‌ఎస్ నేతలు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. తెలంగాణకు బిజెపి ఏంచేసిందో కేంద్ర మంత్రి బండిసంజయ్ సమాధానం చెప్పాలన్నారు. రాష్ట్రంలో 8మంది ఎంపిలు, 8 మంది ఎమ్మెల్యేలు ఉన్న బిజెపి రాష్ట్రానికి రావాల్సిన నిధుల గురించి మాట్లాడకపోవడం సిగ్గుచేటన్నారు. పదేళ్ల పరిపాలనలో తెలంగాణలో ఒక్క కార్పొరేషన్‌కు చైర్మన్‌ను నియమించిన పాపాన పోలేదన్నారు. ప్రతిపక్ష బిజెపి, బిఆర్‌ఎస్ నేతలు ఉద్యోగులను రెచ్చగొట్టి సమ్మెకు ఉసిగొల్పుతున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రం దివాలా తీయడంలో కెసిఆర్, కెటిఆర్‌తో పాటూ మాజీ మంత్రి, ప్రస్తుత ఎంపి ఈటల రాజేందర్ కూడా ఓ భాగస్వామి అన్నారు.

పేదల కలలను నెరవేర్చడమే...

# ప్రజా ప్రభుత్వ లక్ష్యం

అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేస్తాం
అప్పుల బాధతో ఉన్నప్పటికీ సంక్షేమ ఫలాలు అమలు
రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



ప్రజాపక్షం/వాజేడు : రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి బాగాలేనప్పటికీ చిత్తశుద్ధితో అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అమలు చేస్తున్నామని, పేదవాడి కలలను నిజం చేయడానికి ప్రజాప్రభుత్వం ముందుకు సాగుతున్నదని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ములుగు జిల్లా, వాజేడు మండలం గ్రామంలో బుధవారం ఇందిరమ్మ ఇండ్ల భూమి పూజ, నాగారం నుండి పాయబట్ల వరకు 40 లక్షలుతో బి.టి రోడ్డు నిర్మాణ పనులు, 150 లక్షల రూపాయల అంచనా విలువతో వాజేడు మండల ప్రజాపరిషత్ కార్యాలయ భవన నిర్మాణం, ఎడ్చర్లపల్లి నుండి ముత్తారం వరకు 30లక్షలతో బి.టి. రోడ్డు నిర్మాణం పనులకు శంకుస్థాపనలు, 14 లక్షలతో నిర్మించిన బేబీ బర్త్ వెయిటింగ్ భవనమును రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, భద్రాచలం శాసనసభ్యుడు డాక్టర్ తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, ఎస్పీ శబరిష్, ఐటిడిఎ పిఒ చిత్ర మిశ్రాలతో కలిసి ప్రారంభించారు. అనంతరం కొంగాల గ్రామం 57 మందికి, నాగారం గ్రామం 64 మందికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు మంత్రి అందచేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్రంలో 8 లక్షల 19వేల కోట్ల రూపాయల అప్పులు చేసి ప్రజలపై పెనుభారం మోపిందని, ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం గత పాలకులు చేసిన అప్పులు తీర్చడంతో పాటు సంక్షేమ ఫలాలను అమలు చేస్తున్నామని వివరించారు.

**ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం**
**భద్రాచలం శాసన సభ్యుడు తెల్లం వెంకట్రావు**

భద్రాచలం నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ కార్యక్రమాలను త్వరితగతిన పూర్తిచేయడానికి చర్యలు తీసుకుంటున్నామని భద్రాచలం శాసనసభ్యుడు తెల్లం వెంకట్రావు అన్నారు. ఐటిడిఎ పరిధిలోని గ్రామాల నిరుపేద ప్రజలకు అదనంగా ఇందిరమ్మ ఇండ్లను కేటాయించాలని మంత్రి శ్రీనివాస్ రెడ్డిని కోరారు. తన నియోజకవర్గం పరిధిలోని వాజేడు, వెంకటాపురం మండలాలలోని అన్ని గ్రామాలలో అన్ని వర్గాల నిరుపేద ప్రజలు ఉన్నారని, వారందరికీ దశలవారీగా ఇండ్లు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ మాట్లాడుతూ ఇండ్ల నిర్మాణ పనులను త్వరతగతిన పూర్తిచేయడానికి జిల్లా యంత్రాంగం ప్రత్యేక చొరవ తీసుకుంటున్నదని అన్నారు. వాజేడు మండలంలోని మండలంలోని గ్రామంలో 106 ఇళ్లు మంజూరు కాగా 62 ఇండ్లు గ్రౌండ్ లెవెల్‌లో ఉన్నాయని, 15 ఇండ్లు గ్రౌండ్ ఇండ్లు నిర్మాణం పూర్తి కావడంతో లబ్ధిదారులకు మొదటి విడత డబ్బులు చెల్లించడం జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమములలో జిల్లా ఎస్పీ శబరిష్, ఎఎస్‌పి శివం ఉపాధ్యాయ, డిఎఫ్ఒ రాహూల్ కిషన్ జాదవ్, ఆర్డీఓ వెంకటేష్, మండల తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపిడిఒ విజయ, బిసిఒ సర్దార్ సింగ్, ఎంపి ఒ.శ్రీకాంత్, ప్రజా ప్రతినిధులు మాజీ జడ్పిటిసి తల్లడి పుష్పలత, మాజీ ఎంపిపి శ్యామలశారద పాల్గొన్నారు.




## భారత సైన్యానికి ఎఐవైఎఫ్ సెల్యూట్

ఆపరేషన్ సిందూర్ విజయవంతాన్ని హర్షిస్తూ
ట్యాంక్‌బండ్ యుద్ధ ట్యాంక్ వద్ద మిఠాయిల పంపిణీ

ప్రజాపక్షం /హైదరాబాద్ : పాకిస్తాన్ ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసిన భారత సైన్యానికి అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) సెల్యూట్ చేసింది. దేశ ప్రజలంతా భారత సాయుధ దళాలకు అన్ని విధాలుగా అండగా నిలవాలని, భారత పౌరులంతా ఐక్యమత్యంగా ఉన్నామనే సందేశాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలని (ఎఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కె. ధర్మేంద్ర పిలుపునిచ్చారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత సాయుధ దళాలు విజయవంతాన్ని హర్షిస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) ఆధ్వర్యంలో బుధవారం ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న యుద్ధ ట్యాంక్ ముందు మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా వలి ఉల్లా ఖాద్రీ, ధర్మేంద్ర లు మాట్లాడుతూ పాకిస్తాన్ ఆక్రమిత జమ్మూ, కశ్మీర్లలో ఉన్న ఉగ్రవాద మౌలిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని భారత సాయుధ దళాలు ఆపరేషన్ సిందూర్ ప్రారంభించడాన్ని ఎఐవైఎఫ్ స్వాగతిస్తుందన్నారు. ఇటీవల పహల్గాంలో పాక్ ప్రేరేపిత ఉగ్రవాదుల దాడుల్లో 25 మంది భారతీయ పౌరులు, ఒక నేపాలీ జాతీయుడు ప్రాణాలను కోల్పోయారని, ఈ చర్యకు ప్రతిచర్యగా భారత సాయుధ దళాలు ధీటైన జవాబు ఇచ్చారని ప్రశంసించారు . ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్య ప్రసాద్, రాష్ట్ర సమితి సభ్యులు కళ్యాణ్, హేమంత్, శ్రీనివాస్, రమేష్,రమ్య, కీర్తన, ఫాతిమా, రాము తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఆర్మీ, పోలీసు, ఇతర అత్యవసర విభాగాలకు చెందిన ఉన్నతస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## పెండింగ్‌లో ఉన్న జీతాలు విడుదల

సీతక్కకు కృతజ్ఞతలు తెలిపిన ఫీల్డ్ అసిస్టెంట్స్

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఫీల్డ్ అసిస్టెంట్‌లు, ఉపాధి హామీ సిబ్బంది సంఘాలు ప్రతినిధులతో త్వరలో సమావేశ నిర్వహించి, సమస్యలు పరిష్కరిస్తామని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి ధనసరి అనసూయ సీతక్క హామీనిచ్చారు. ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్‌అసిస్టెంట్లు, సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న జీతాలకు రూ. 62 కోట్లను ప్రభుత్వం విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ, ఫీల్డ్ అసిస్టెంట్‌లు బుధవారం హైదరాబాద్ సచివాలయంలో మంత్రి సీతక్కను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు సిఎం దృష్టికి తమ సమస్యను తీసుకువెళ్లి జీతాలు విడుదల చేయించిన సీతక్కను సన్మానించారు. ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న వారిని వివిధ కేటగిరీలుగా విభజించడం వల్ల తాము నష్టపోతున్నామని, అందరినీ ఒకే కేటగిరిగా పరిగణించి సమాన పనికి సమానవేతనం చెల్లించాలని మంత్రిని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో అనుసరిస్తున్నట్లుగా తెలంగాణలో కూడా అందరిని ఒకే కేటగిరిగా పరిగణించాలని కోరారు.

అలాగే జీతాల్లో కోత విధించేందుకు తెచ్చిన 4779 సర్క్యూలర్‌ను రద్దు చేయాలన్నారు. తక్షణం స్పందించిన మంత్రి సీతక్క సంబంధిత అధికారులకు ఆంధ్రప్రదేశ్ విధానాన్ని అధ్యయనం చేసి పరిష్కరించాలని ఆదేశించారు. జీతాల్లో ఎలాంటి కోతలు లేకుండా, వారితో చేయించుకున్న పనికి వేతనం దక్కేలా చర్యలు తీసుకోవాలన్నారు. బడ్జెట్‌తో సంబంధం లేని పాలనాపరమైన సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారుకు సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఐఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి ఎరగాని నాగన్న గౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్‌ల రాష్ట్ర కార్యవర్గం బొలుగురి రవి, చల్లా వెంకటేశ్వర్లు, సిద్దిరాజు, ఆంజనేయులు, గోల్కొండ సురేషు, లక్ష్మి కాంత్, నరేష్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఇందిరా ప్రియదర్శిని అంగన్‌వాడి టీచర్స్ యూనియన్ ఐఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షురాలు అన్నపూర్ణ, శ్రీదేవి పాల్గొన్నారు.



## 13 న చార్మినార్ వద్ద మిస్ వరల్డ్ పోటీదారుల 'హెరిటేజ్ వాక్'

ప్రజాపక్షం/హైదరాబాద్ : మిస్ వరల్డ్ 2025 పోటీలను విజయవంతంగా జరిగే విధంగా ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా ఘనంగా ఏర్పాట్లు జరుగుతున్నట్లు పర్యాటకశాఖ సంచాలకులు జెడ్ హనుమంతు కొండిబా, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. ఈ క్రమంలోనే ఈనెల 13 న మిస్ వరల్డ్ పోటీదారులు హైదరాబాద్ పాతబస్తిని సందర్శించి చార్మినార్ వద్ద హెరిటేజ్ వాక్, లాడ్ బజారు సందర్శన, చౌమహల్ల సందర్శించనున్నారని తెలిపారు. ఏర్పాట్లపై బుధవారం హైదరాబాద్ ఓల్డ్ సిటీలోని చార్మినార్, లాడ్ బజారు, చౌమహల్లా ప్యాలెస్‌ను పర్యాటక శాఖ డైరెక్టర్ జెడ్.హనుమంత్ కొండిబా, సౌత్ జోన్ డిసిపి స్నేహమెహ్రా, ఇతర శాఖల అధికారులతో కలసి చేపట్టబోయే ఏర్పాట్లపై అన్ని ప్రాంతాలను సందర్శించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 10వ తేదీ నుంచి 31వ తేదీ వరకు మిస్ వరల్డ్ పోటీలు తెలంగాణ హైదరాబాద్‌లో జరుగనున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ వెంకటరమణ, పర్యాటక శాఖ, పోలీస్ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు సిఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తా

పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

ప్రజాపక్షం/హైదరాబాద్ : కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్స్(సిఆర్‌టి) సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి సీతక్క అన్నారు. సిఆర్‌టి సంఘాల ప్రతినిధులతో బుధవారం సచివాలయంలో ఆమె సమావేశమయ్యారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్, అదనపు డైరెక్టర్ సర్వేశ్వర్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు. 21 రోజుల సమ్మె వేతనం, అంత్యక్రియల ఖర్చుల కోసం రూ.30వేలు మంజూరు చేయించిన మంత్రి సీతక్కకు నేతలు కృతజ్ఞతలు తెలిపారు. పెండింగ్ సమస్యలను మంత్రి సీతక్క దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని మంత్రి సీతక్క వారికి హామీనిచ్చారు. అణగారిన వర్గాల పట్ల ప్రభుత్వం ప్రేమతో ఉందని మంత్రి సీతక్క అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల పట్ల తమ ప్రభుత్వానికి ప్రేమ ఉందని, అందుకే మొదటి తేదీనే జీతాలు ఇస్తున్నామన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల పని ఒత్తిడి తగ్గించేందుకు ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేస్తున్నామని తెలిపారు. ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా అటు ఉద్యోగులు, ఇటు ప్రజల పెండింగ్ సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. సంక్షేమ పథకాలకు ఏ లోటు లేకుండా చూసుకుంటున్నామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు సమస్యలు ఏమైనా ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకరావాలన్నారు. చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకుందామన్నారు. పట్టువిడుపులు ఉండాలని, తెగేదాకా లాగవద్దు అన్నారు. మంత్రులు ఉద్యోగులు వేర్వేరు కాదని, ఇద్దరు సమన్వయంతో పనికిస్తేనే సంక్షేమం, అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. కొంత ఆలస్యమైనా ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుంటున్నామన్నారు. పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సిఆర్‌టి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సమస్యలు పరిష్కారమైనా, ఇక్కడ బిఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యం వల్ల వారి సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలు వెంటనే పరిష్కరిస్తున్నామని తెలిపారు. పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో మంచి ఫలితాల సాధనలో కృషి చేసిన ఎస్‌టి సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్, అదనపు డైరెక్టర్ సర్వేశ్వర్ రెడ్డిలను మంత్రి సీతక్క సన్మానించారు.

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**

NIT No.02/SE(H)/GHMC/2025-26 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీసు తేది: 06.05.2025

**పని పేరు:** మరమ్మతు పనులు (01) పని. **అంచనా విలువ :** రూ.98.50లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** ప్రారంభ తేది: 07.05.2025న సా.4.00గం.ల నుండి, బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 14.05.2025న మ.03.30గం.ల వరకు. **అధికారి పేరు & చిరునామా:** ఒ/ఒ సూపరింటెండింగ్ ఇంజనీర్ (హౌసింగ్), జిహెచ్‌ఎంసి, 2వ అంతస్తు, మున్సిపల్ బిల్డింగ్, హరిహర కళా భవన్, సికింద్రాబాద్ - 500003. ఏవైనా సందేహాలకు, సంప్రదించండి : శ్రీ ఆర్.శ్రవణ్ కుమార్, డిప్యూటీ ఇఇ (హెచ్), జిహెచ్‌ఎంసి. సెల్ నెం. 9000115395, ఇ-మెయిల్ ఐడి: se12bhkhousing@gmail.com; మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.telangana.gov.in లో చూడవచ్చు.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ (హౌసింగ్), జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 1474-PP/CL/ADVT/1/2025-26, Date: 07-05-2025

**తెలంగాణ ప్రభుత్వం, రోడ్లు మరియు భవనాల శాఖ**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B), సౌత్ బిల్డింగ్స్ డివిజన్, ఖైరతాబాద్, హైదరాబాద్.

NIT No: 06/25-26/EE/PAtoEE/D3/DB/SBD/710 ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు తేది: 06.05.2025

**పని పేరు:** హైదరాబాద్, హైకోర్టు ఆవరణలో బ్లాక్-బి నందు మొదటి అంతస్తులో మొదటి అంతస్తులో కోర్టు మాస్టర్లు / అదనపు కార్యదర్శి కోసం చాంబర్ నెం. 19 కి ఆనుకుని ఉన్న చిన్న గదిని అందించడం., ఇసివి: రూ.45,180/-, **డౌన్‌లోడ్ ప్రారంభ తేది:** 06.05.2025న సా.04.30గం.లకు, **బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం:** 09.05.2025న సా.04.30గం.ల వరకు, **బిడ్ ప్రారంభ తేది:** 09.05.2025న సా.04.45గం.ల నుండి, **ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B) పేరు మరియు చిరునామా:** శ్రీ ఎ.వి. విశ్వకుమార్, బి.టెక్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B), సౌత్ బిల్డింగ్స్ డివిజన్, హైదరాబాద్. మరిన్ని వివరాల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా https://tender.eprocurement.gov.in తెలంగాణలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B), సౌత్ బిల్డింగ్స్ డివిజన్, హైదరాబాద్.

DIPR R.O. No. : 1507-PP/CL/ADVT/1/2025-26, Date: 07-05-2025

**నగర పాలక సంస్థ కార్యాలయము : మంచిర్యాల, జిల్లా: మంచిర్యాల**

ఫైలు నెం.109/ఎ1/2025-26 వేలము కొరకు ప్రకటన - 3 తేది: 06.05.2025

మంచిర్యాల పట్టణ ప్రజలకు తెలియజేయునది ఏమనగా మంచిర్యాల నగర పాలక సంస్థ యొక్క మేకల మండి (మంచిర్యాల), మేకలమండి (నస్పూర్), ఫై బజార్, స్లాటర్ హౌజ్, మటన్ మార్కెట్, కూరగాయల మార్కెట్ లోని ప్లాటు ఫారములు గల వాటికి సం. 2025-26 అనగా 01.06.2025 నుండి 31.03.2026 వరకు (10 నెలలకు మాత్రమే) మరియు IDSMT SHOPS: 03,05,11,12,13, (17 -Reserve for ST), 18, 20, 21, 22, 23, (28-Reserved for SC), 30, First Floor 1158.25 చ.గ ఏరియా 12000 చ. ఫీట్లు మరియు Market Arena Shops (A Type Shop No. 6,7,9,10) ( IB Type Shop No 9,10,11), (D-Type Shop No.04, 06, 08, 09, 10,11, 13 and (Reserved for SC Shop No. D-07) (SR-Type Shop No 10 and Reserved for SC Shop No. 06) కిరాయికి ఇచ్చుటకు తేది: 16.05.2025 రోజున మున్సిపల్ ఆఫీసులో బహిరంగ వేలము వేయుటకు నిర్ణయించనైనది. వేలములో పాల్గొనుటకు ఆసక్తి గలవారు తేది: 15.05.2025 సా. 5:00 గంటల లోపు ధరావత్తు మొత్తము కమీషనర్ మంచిర్యాల కార్పోరేషన్ గారి పేరున చెల్లించి సాల్వెన్సీ సర్టిఫికేట్ జతపరిచి ఈ కార్యాలయములో అందచేయవలెను మరియు ఎవరు అయితే ఎక్కువ పాట పాడినవారు అట్టి మొత్తము వేలము రూపాయలు చెల్లించి దానిపై 18 % సర్వీస్ టాక్స్ (షాపులకు మాత్రమే) (G.S.T) అదనంగా చెల్లించవలసి ఉంటుంది. ఈ క్రింద తెలిపిన నిబంధనలు పాటించవలెను.

| క్ర. సం. | వేలము యొక్క స్వభావము | వేలము వేయు సమయము | ధరావత్తు | సాల్వెన్సీ సర్టిఫికేట్ |
|---|---|---|---|---|
| 1) | మేకలమండి (మంచిర్యాల) (టెండరు పొందినవారు వేలం మొత్తం డబ్బును మే 2025 లోపు చెల్లించవలెను) | ఉ.10.30 గం., | రూ.2,50,000/- | - |
| 2) | మేకలమండి (నస్పూర్) (టెండరు పొందినవారు వేలం మొత్తం డబ్బును మే - 2025 లోపు చెల్లించవలెను) | ఉ.11.15 గం., | రూ.2,50,000/- | - |
| 3) | తై బజారు (మార్కెట్ లోపల గల ప్లాటు ఫారములు మినహాయించి) (టెండరు పొందినవారు వేలం మొత్తం డబ్బును మే - 2025 లోపు చెల్లించవలెను) | ఉ.11.45 గం., | రూ.1,50,000/- | 5,00,000 |
| 4) | మటన్ మార్కెట్ (28 ప్లాటు ఫారములు) (సంజీవయ్య కాలని) (టెండరు పొందినవారు వేలం మొత్తం డబ్బును మే - 2025 లోపు చెల్లించవలెను) | మ.12.00 గం., | రూ.50,000/- | 1,00,000/- |
| 5) | IDSMT Shops (Near Municipal Office) (Shop No. 03,05,11,12,13,(17-Reserved for ST), 18, 20,21,22,23, (28-Reserved for SC), 30 First Floor 1158.25 చ.గ ఏరియా (Open Auction on Rent basis) | మ.12.30 గం., | రూ.10,000/- | 1,00,000/- |
| 6) | Market Area A Type Shops (Shop No. 6,7,9,10) (Open Auction on Rent basis) | మ.03.00 గం., | రూ.10,000/- | 1,00,000/- |
| 7) | Market Area B Type Shops (Shop No.9,10,11) (Open Auction on Rent basis) | మ.03.30 గం., | రూ.10,000/- | 1,00,000/- |
| 8) | Market Area D-type (Shop No. 04,06,08,09,10,11,13) (Open Auction on Rent basis) | సా.04.00 గం., | రూ.1,00,000/- | 1,00,000/- |
| | (Reserve for SC Shop No.07 ) | సా.05.00 గం., | రూ.50,000/- | 1,00,000/- |
| 9) | NearWater Tank Area SR Type Shops (Shop No. 10) (Open Auction on Rent basis) (Reserve for SC Shop No.06) | సా.05.15 గం., | రూ.10,000/- | 1,00,000/- |
| 10) | కూరగాయల మార్కెట్ లోపల ప్లాటు ఫారములు (టెండరు పొందినవారు వేలం మొత్తం డబ్బును మే-2025 లోపు చెల్లించవలెను) | సా.05.30 గం., | రూ.50,000/- | 1,00,000/- |
| 11) | స్లాటర్ హౌజ్ (టెండరు పొందినవారు వేలం మొత్తం డబ్బును మే - 2025 లోపు చెల్లించవలెను) | సా.05.45 గం., | రూ.50,000/- | 2,00,000/- |

సం/- కమీషనర్
నగర పాలక సంస్థ, మంచిర్యాల.

**నోట్:** వేలము యొక్క నియమ నిబంధనల కొరకు మరియు అప్లికేషన్ ఫాం కొరకు ఆఫీసు పని వేళలలో సంప్రదించగలరు.

DIPR R.O. No. : 1472-PP/CL/ADVT/1/2025-26, Date: 07-05-2025

ప్రజాపక్షం
గురువారం, మే 08

# సరైన సమయంలో సరైన చర్య

జమ్మూ–కశ్మీర్‌లోని పహల్గాంలో ఏప్రిల్ 22న పాకిస్థాన్ ప్రేరేపిత టెర్రరిస్టులు టూరిస్టులపై ఒడిగట్టిన ముష్కరదాడికి ప్రతీకారంగా భారత సైనిక దళాలు బుధవారం తొలి ఘడియల్లో (రాత్రి గం.1.05 నుంచి 1.30వరకు) పాకిస్థాన్‌లోని, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని 9 టెర్రరిస్టు మౌలిక వసతులపై జరిపిన మిస్సైల్ దాడులు సరైన సమయంలో తీసుకున్న సరైన సైనిక చర్య. టెర్రరిస్టు లు టూరిస్టుల తలలకు గురిపెట్టి వారి కుటుంబ సభ్యుల సమక్షంలోనే హత్యచేసిన కిరాతక చర్య అత్యంత హేయమైందిగా భద్రతామండలి సహా ప్రపంచ దేశాలన్నీ ఖండించాయి. ఆ హత్యోదంతంలో 25మంది భారతీయులు, 1నేపాలీ మృతి చెందటం భారత ప్రజలకు తీవ్రమైన కలత కలిగించింది. ప్రతీకారం తప్పదని ప్రతి హృదయం బాధతో ఘోషించింది. ప్రభుత్వం ప్రతీకారేచ్ఛతో రగిలిపోయినా సీమాంతర టెర్రరిజాన్ని పెంచి పోషించటంలో పాకిస్థాన్ పాత్రను ప్రధానమైన ప్రపంచ దేశాలకు వివరించి, టెర్రరిజంపై పోరాటానికి వారి మద్దతు సమీకరించేందుకు దౌత్యమార్గాల్లో గట్టి కృషి చేసింది. టెర్రరిజంపై పోరాటంలో భారత్‌కు సంఘీభావం తెలియజేసిన దేశాలు, ఈ ఉద్రిక్తత భారత్–పాకిస్థాన్ మధ్య యుద్ధంగా మారకుండా రెండు దేశాలు సంయమనం పాటించాలని సలహా ఇచ్చాయి. ప్రధాని నరేంద్రమోదీ ఏప్రిల్ 29న సైనిక దళాల అధిపతులతో జరిపిన సమావేశంలో, పహల్గాం టెర్రర్ దాడికి ప్రతిస్పందన తీరు, దాడికి ఎంచుకోవలసిన లక్ష్యాలు, సమయం నిర్ణయించే పూర్తి కార్యనిర్వాహక స్వేచ్ఛను రక్షణ దళాలకు అప్పగించారు. అవసరమైతే ఏ క్షణంలోనైనా పాకిస్థాన్‌ను ఎదుర్కొనేందుకు త్రివిధ దళాలను ముఖ్యంగా వాయుసేన, నావికా దళాలను సర్వసన్నద్ధం చేసిన రక్షణ దళాల ఉన్నతాధికారులు పాకిస్థాన్ భూభాగంలోని, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని జైష్–ఎ–మొహమ్మద్, లస్కర్–ఎ–తోయిబా ఉగ్రవాద శిక్షణా కేంద్రాలు తొమ్మిదింటిపై గురిపెట్టి కచ్చితమైన లక్ష్యాలను విజయవంతంగా ధ్వంసం చేశారు. మన యుద్ధ విమానాలు మన గగనతలం నుండే మిస్సిలీలు ప్రయోగించటం, పాకిస్థాన్ సైనిక, పౌర ప్రాంతాలకు ఎటువంటి ఆస్తి నష్టం, ప్రాణహాని లేకుండా ఈ దాడి నిర్వహించటం మన సైనిక పాటవ నైపుణ్యానికి దర్పణం పట్టింది. ఈ దాడుల్లో వందలసంఖ్యలోనే టెర్రరిస్టులు, వారి మద్దతుదారులు మరణించి ఉంటారు. కనీసం 26మంది మరణించారని 46మంది గాయపడ్డారని పాకిస్థాన్ సైన్యం ప్రకటించింది. కాగా 10మంది తమ తమ కుటుంబ సభ్యులు, నలుగురు అనుయాయులు చనిపోయారని జైష్ ఎ మొహమ్మద్ చీఫ్ మౌలానా మసూద్ అజార్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ సైనిక మెరుపుదాడికి 'ఆపరేషన్ సిందూర్' అని ప్రతీకాత్మకంగా నామకరణం చేశారు. పహల్గాంలో టెర్రరిస్టు ముష్కరులు కబళించిన భారత మహిళల నుదుటి బొట్టుకు ప్రతీకగా ఈ పేరు పెట్టారు. తాజా చర్య ద్వారా భారత్ తనకున్న ''ప్రతిస్పందన హక్కును, మరిన్ని సీమాంతర ఉగ్రవాద దాడులను ముందుగా దెబ్బతీసే, నిరోధించే హక్కును'' వినియోగించుకుందని విదేశాంగ కార్యదర్శి విక్రం మిశ్రీ బుధవారం ఢిల్లీలో పత్రికాగోష్టిలో చెప్పారు. మిశ్రీతోపాటు ఇరువురు మహిళా ఆర్మీ ఆఫీసర్స్ భారత్‌లో సీమాంతర ఉగ్రవాదులు పాల్పడిన పలు టెర్రరిస్టు దాడులతో – 2001 పార్లమెంటుపై దాడి, 2008 ముంబయిపై దాడి, 2019 పుల్వామా ఆత్మాహుతి బాంబుదాడి వగైరా – చిత్రించిన వీడియోను ప్రదర్శించారు. 2008 నవంబర్ 26న ముంబయిపై టెర్రరిస్టు దాడిలో మృతుల సంఖ్య కన్నా పహల్గాంలో మృతుల సంఖ్య ఎక్కువ.

ప్రతిపక్షాలు గత అఖిలపక్ష సమావేశంలోనే భారత ప్రభుత్వం తీసుకునే ఏ చర్యకైనా సంపూర్ణ మద్దతు, భారత సైన్యానికి అండదండలు తెలియజేశారు. కేంద్రప్రభుత్వం ఈ రోజు (గురువారం) ఉదయం మరోసారి అఖిలపక్ష సమావేశం పిలిచింది.

పాకిస్థాన్ అనవసర ప్రేలాపనలతో ఆవేశపడకుండా మిగిలివున్న టెర్రరిస్టు స్థావరాల ధ్వంసానికి, తమ భూభాగాన్ని టెర్రరిస్టు కార్యకలాపాలకు వినియోగించటాన్ని అనుమతించబోమని లోగడ ఇచ్చిన హామీ అమలుకు దృఢమైన చర్యలు తీసుకున్నప్పుడే భారత్‌తో ఉద్రిక్తతలు సడలుతాయి. ద్వైపాక్షిక చర్చల ద్వారా సమస్యల పరిష్కార సాధ్యం. లేక సైనిక దుస్సాహసానికి ఒడిగడితే మరోసారి గుణపాఠం చెప్పటానికి భారత్ సైన్యం సదా సన్నద్ధంగా ఉంటుంది. లోగడ నిర్వహించిన సర్జికల్ స్ట్రయిక్, తాజా ఆపరేషన్ సిందూర్ నుంచి పాకిస్థాన్ గుణపాఠాలు తీసుకుంటే ఇరుదేశాల మధ్య, భారత ఉపఖండంలో శాంతి, సామరస్యం సాధ్యం.

# ఆదర్శవంతమైన వియత్నాం అద్భుత అభివృద్ధి



కె.రామకృష్ణ
సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి

వియత్నాం పేరు వినగానే, ఒక గొప్ప పోరాట చరిత్ర మన కళ్లముందు మెదులుతుంది. ఎన్నో యుద్ధాలు అనుభవించిన, ఎంతో సహనాన్ని, త్యాగాన్ని నిలబెట్టుకున్న దేశం వియత్నాం మాత్రమే. ఇటీవలే హోచిమిన్ సిటీలో జరిగిన వియత్నాం పునరేకీకరణ 50వ వార్షికోత్సవ కార్యక్రమానికి వియత్నాం ప్రభుత్వ ఆహ్వానంపై హాజరై వచ్చాను. అక్కడి అనుభవాలు, చరిత్ర, ప్రజల చైతన్యం నన్ను ఎంతో ప్రభావితం చేశాయి. వియత్నాం కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి టూ లామ్‌ను మన భారతీయ సంప్రదాయం ప్రకారం సత్కరించే అవకాశం కలిగింది. వియత్నాం ఆగ్నేయ ఆసియాలోని ఒక దేశం. 2016 జనాభా లెక్కల ప్రకారం ఈ దేశ జనాభా సుమారు 9 కోట్ల 46 లక్షలు. జనసంఖ్యలో ప్రపంచంలో 15వ స్థానంలో, ఆసియాలో 9వ స్థానంలో ఉంది. 1976లో ఉత్తర, దక్షిణ వియత్నాంలు కలిసిపోయినప్పటి నుంచి హనోయ్ నగరం రాజధాని గా ఉంది. హోచిమిన్ నగరం అత్యధిక జనాభా గల నగరం. యుద్ధంతో సర్వం కోల్పోయి తాగేందుకు మంచినీరు లేని వియత్నాం...ప్రస్తుతం ఎంతో అభివృద్ధి చెందింది. నేటి వియత్నాంను చూస్తుంటే అక్కడ యుద్ధం జరిగిందా? అనే సందేహం కలుగుతోంది. అమెరికాలోని లాస్‌ఏంజిల్స్, చికాగో తదితర నగరాలకు దీటుగా వియత్నాం రాజధాని హోచిమిన్ నగరం అభివృద్ధి చెందింది. అమెరికా సామ్రాజ్యవాదులపై సుదీర్ఘకాలం పోరాడిన అద్భుతమైన విప్లవగాథ వియత్నాంది. అమెరికాతో యుద్ధం ముగిసి... ఉత్తర వియత్నాం, దక్షిణ వియత్నాం ఏకీకరణ జరిగి 1925 ఏప్రిల్ 30వ తేదీకి 50 ఏళ్లు అయిన సందర్భంగా ఉత్సాహపూరిత వాతావరణంలో వేడుకలు జరిగాయి. చారిత్రక హోచిమిన్ నగరం ఎరుపెక్కింది. నగర వీధులన్నీ జనంతో కోలాహలంగా మారాయి. జాతీయ పతాకాలతో ప్రజలు వేడుక ల్లో పాల్గొని, తమ అభిమానాన్ని చాటుకున్నారు. వియత్నాం విప్లవ యోధుడు హోచిమిన్ చిత్రప టం, వియత్నాం చిహ్నం 'ల్యాక్ బర్డ్'తో సైన్యం కదం తొక్కారు. హోచిమిన్ నగర వీధుల్లో పరేడ్ ముందుకు సాగగా, వేలాదిమంది ప్రజలు వీక్షించారు. ఈ సందర్భంగా శాంతిపై దృష్టితో ముందుకెళుతున్నట్లు నాయకులు సందేశమిచ్చారు. ఒకప్పుడు సైగాన్‌గా పేరున్న హో చిమిన్ నగర వీధులన్నీ జనంతో కిటకిటలాడాయి.

యుద్ధానికి ముగింపు పలికిన చోటు 'ఇండిపెండెన్స్ ప్యాలెస్' వద్ద యుద్ధ విమానాల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ వేడుకలలో వివిధ దేశాల ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. భారతదేశం నుంచి భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)కి మాత్రమే అధికారికంగా ఆహ్వానం అందింది. సిపిఐ ప్రతినిధిగా నేను హాజరుకావడం నాకు ఎంతో గర్వకారణం. ఈ వేడుకల్లో శాంతి, ఐక్యత, జాతీయ అభివృద్ధి అంశాలు ప్రధానంగా ప్రతిధ్వనించాయి. ప్రతినిధులలో విదేశీ సైనిక బృందాలు, యుద్ధంలో పాల్గొన్న యోధులు ఉన్నారు. వియత్నాం కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి టూ లామ్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం జరిగిన 30ఏళ్ల పోరాటం ముగింపునకు, వలసవాదం అంతానికి ప్రతీకగా ఏప్రిల్ 30వ తేదీ చరిత్రలో నిలిచిందన్నారు. భావి తరానికి మెరుగైన ప్రపంచాన్ని అందించడం ప్రతి ఒక్కరి బాధ్యతని, అందుకోసం తమ వంతు కృషి చేస్తున్నట్లు టూ లామ్ వెల్లడించారు. వియత్నాంతో సరితూగగల పోరాటం ప్రపంచంలో ఎక్కడా జరగలేదని చెప్పవచ్చు. ఆ యుద్ధంలో ఏకంగా కోటి 43 లక్షల టన్నుల బాంబులను అమెరికా ఉపయోగించాల్సి వచ్చింది. 17 ఏళ్ల 2 నెలలపాటు వియత్నాం వీరోచితంగా పోరాడి అమెరికా సామ్రాజ్యవాదుల మెడలు వంచింది. ఈ యుద్ధం కోసం 676 బిలియన్ డాలర్లను అమెరికా ఖర్చుచేసింది.

**టన్నెల్స్:** హోచిమిన్ సిటీలోని కుచ్ జిల్లాలో సుమారు 250 కిలోమీటర్లకు పైగా విస్తరించిన భూగర్భ టన్నెల్స్ మానవ శక్తి ఎంత దృఢంగా ఉండగలదో చూపిస్తున్నాయి. వీటిని గెరిల్లా యుద్ధ కేంద్రాలుగా, ఆయుధ నిల్వ కేంద్రాలుగా, ఆసుపత్రులుగా, వంట గదులుగా, రాజకీయ సమావేశం గది లాగా యుద్ధకాలంలో ఉపయోగించేవారు. 1940లో మొదట ఫ్రెంచ్ వలస పాలనకు ప్రతిఘటనగా తవ్విన టన్నెల్స్, అమెరికాతో యుద్ధంలో మరింతగా పెంచి ఉపయోగించారు.

యన్ డాలర్లుగా నమోదైంది, ఇది 2023లోని 5.05శాతం వృద్ధితో పోలిస్తే 7.09శాతం వద్ధిని సూచిస్తోంది. ఎగుమతులు 14.3శాతం పెరిగి 405.53 బిలియన్ డాలర్లకు చేరాయి, దేశ ఆర్థిక వృద్ధికి ఇది ముఖ్య కారణం. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 9.4శాతం పెరిగి 25.35 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇది దేశ ఆర్థిక స్థిరత్వాన్ని బలోపేతం చేసింది. ఇదంతా కమ్యూనిస్టు పాలనలో వియత్నాం సాధించిన అభివృద్ధి.

వియత్నాంలో సైన్యానికి, యువతకు, మహిళలకు ప్రాధ్యాన్యత ఇస్తున్నట్లు కనబడింది. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరిగిన సౌత్, నార్త్ వియత్నాంల ఏకీకరణ 50వ వార్షికోత్సవంలో వియత్నాం కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి టూ లామ్, ఆర్మీ మేజర్ జనరల్ చాన్ నాక్ థు తో పాటు యువత తరఫున ఒక యువతి మాట్లాడడం చూస్తే





దేశ వీరోచిత ఉద్యమం స్ఫూర్తిదాయకం. విద్య, సాంస్కతిక, రాజకీయ రంగాల్లో వియ త్నాం ఎంతో విశిష్టత సాధించింది. ప్రపంచంలో సంపద గల, పేద, పెద్ద దేశాలున్నప్పటికీ వియత్నాం అంతటి అసమాన త్యాగంచేసిన దేశం మరొకటి లేదు. అమెరికా వినియోగించిన రసాయనిక ఆయుధాల ఫొటోలతో కూడిన వార్ మ్యూజియం అమెరికా నాటి దుశ్చర్యలను కళ్లకు కట్టినట్టు చూపింది.

**వలసల నుంచి విజయవంతమైన ప్రజా పాలన దిశగా:** వియత్నాం చరిత్ర అనేది వలస పాలనలపై తిరుగుబాటు, స్వాతంత్ర్య ఉద్యమాల విజయం, ప్రజా కేంద్రిత పాలన వికాసాన్ని చూపిస్తుంది. ఫ్రెంచ్ వలస పాలన నుంచి విముక్తి పొందిన తర్వాత కొరియా, అమెరికాలతో మానవ చరిత్రలో అత్యంత ఘోరమైన యుద్ధాలను వియత్నాం ఎదుర్కొంది. అమెరికాతో జరిగిన యుద్ధంలో 30 లక్షల మంది చనిపోయారు. 20 లక్షల మంది గాయపడ్డారు. 3 లక్షల మంది కనిపించకుండా పోయారు. అధునాతన యుద్ధ సామాగ్రి వున్న అమెరికాతో తలపడి 59 వేలమంది అమెరికన్ సైనికులను హతమార్చింది. ఇది వారి పోరాట శక్తి కి నిదర్శనం. ప్రపంచ యుద్ధంలో అమెరికా 50 లక్షల టన్నులు, కొరియా యుద్ధంలో 26 లక్షల టన్నుల బాంబులు వినియోగించగా... ఒక్క వియత్నాం

**రసాయనాల పీడ :** యుద్ధంలో అమెరికా 'ఏజెంట్ ఆరంజి' లాంటి రసాయనాలు వాడి వియత్నాంను గెలవాలనుకుంది. అయినా వియత్నాం వీరులు వాటిని ఎదుర్కొన్నారు. వీటివల్ల 3 మిలియన్ల మంది ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడింది. కేన్సర్, జనన లోపాలు, శారీరక వైకల్యాలు యుద్ధం ముగిసిన తర్వాత పుట్టిన తరాలపైన కూడా ప్రభావం చూపించాయి.

**''డోయ్ మోయ్''తో పునర్నిర్మాణం:** 1975 యుద్ధం తర్వాత వియత్నాం తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంది. ఈ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు 1986లో ప్రారంభించిన ''డోయ్ మోయ్'' ఆర్థిక సంస్కరణల ద్వారా, వియత్నాం కేంద్ర ప్రణాళిక విధానాల నుంచి మార్కెట్ ఆధారిత విధానాలవైపు సాగింది. అయితే, ప్రజల అవసరాలే కేంద్రబిందువుగా కొనసాగాయి. ఫలితంగా పేదరికం 70శాతం నుంచి 1.9శాతానికి తగ్గింది. విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంలో వియత్నాం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం కొత్త పుంతలు తొక్కి విజయవంతం కాగలిగింది. విదేశీ పెట్టుబడులకు అవకాశాలు ఇచ్చినప్పటికీ ప్రజల ప్రయోజనాలే కేంద్రంగా ఉంటున్నాయి. 1990 తర్వాత వియత్నాం జిడిపి 6శాతానికి పైగా పెరుగుతూనే ఉంది. 2024లో వియత్నాం జిడిపి 476.3 బిలి

ఆ దేశంలో యువతకు ఎంత ప్రాధాన్యత ఇస్తారో అర్థమవుతోంది. వియత్నాంలో కమ్యూనిస్టుపార్టీ తప్ప వేరే పార్టీ లేదు. వియత్నాం ప్రభుత్వ విధానాలు కమ్యూనిస్టులే కాకుండా కమ్యూనిస్టేతరులనూ అకట్టుకుంటున్నాయి. వియత్నాం విజయం సైనికమైనదేగాక, సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా విజయవంతమైన ప్రయోగం. ప్రజల చిత్తశుద్ధి, నాయకత్వ నిబద్ధత, గణనీయమైన యువత పాత్ర, భాగస్వామ్య పాలన వంటి అంశాలు, భారత్ వంటి దేశాలు నేర్చుకోవాల్సిన అంశాలు. పారదర్శకతతో కూడిన కమ్యూనిజం ఎలా ప్రజల మద్దతుతో విజయవంతమవుతుందో అన్న దానికి వియత్నాం ఉదాహరణ. అంతిమంగా చెప్పాల్సిందేమంటే విజయం అనేది సాధన కాదు, అది ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోవడమే. ఈ ఉత్సవాలకు స్పెయిన్ నుంచి వచ్చిన మహిళా ప్రతినిధి నా పక్కనే కూర్చుని వున్నప్పుడు ''ఇక్కడ ప్రతిపక్షం లేకుండా ప్రజల అసంతృప్తి వంటివి ఉండవా?'' అన్న చర్చ వచ్చింది. దానికి ఆమె సమాధానమిస్తూ, ''ప్రజలను పాలనలో భాగస్వాములుగా చేసి వారికి అవసరమైనవి సమకూర్చగలిగితే వారిలో అసంతృప్తికి చోటుండదు. బహుళ పార్టీ వ్యవస్థతో వాళ్లకు పనీ లేదు'' అని పేర్కొన్నారు. ఇది వియత్నాం విజయ రహస్యానికి అద్భుతమైన వ్యాఖ్యానం.

# సంకల్పబలమే జయం...



కొండేటి ప్రకాష్
7981781086

సమాజంలో నీవు జీవించాలంటే దేహీ అని పైసలు అడుక్కుని బ్రతకాలని స్వంతవాళ్లే చెప్పినప్పటికీ నేను నా మనస్సాక్షిని చంపుకొని సాటి మానవుల దగ్గర దీనంగా యాచించి బ్రతకలేనంటూ పట్టుదలతో కష్టపడి పనిచేసి ఎవరి మీద ఆధార పడకుండా జీవిస్తున్న వ్యక్తి జీవితం ప్రస్తుత పరిస్థితుల్లో మనందరికీ మంచి ప్రేరణనిస్తుంది.

తెలంగాణ రాష్ట్రం హన్మకొండ జిల్లా భీమదేవర పల్లి మండలంలోని మాణిక్య పూర్ అనే మారుమూల గ్రామానికి చెందిన చింతం రాజయ్య నిరుపేద కుటుంబంలో జన్మించాడు. అతనికి నాలుగు సంవత్సరాల ప్రాయంలో రెండు కళ్ల నిండా కురుపులు రావడం ద్వారా వాటిని నయం చేయించడం కోసం వారి తండ్రి దగ్గరలో ఉన్న నాటు వైద్యుణ్ణి వద్దకు తీసుకెళ్లారు. ఆ కురుపులకు చికిత్సలో భాగంగా వైద్యుడు కాకర చెట్టు ఆకు పసరు రెండు కళ్లలో పోయడం జరిగింది. ఫలితంగా చింతం రాజయ్య కళ్లలో కురుపులు నయం కాలేదు కానీ రెండుకళ్లు కాయలు కాసి కంటిచూపు పూర్తిగా పోయింది.

రాజయ్యపడే బాధ తట్టుకోలేక అతని పెద్ద అన్న మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని శివారెడ్డి కంటి ఆసుపత్రికి తీసుకెళ్లి అక్కడ వైద్యులకు చూపించాడు. డాక్టర్ శివారెడ్డి అధునాతన యంత్రాలపైన కళ్లకు సంబంధించిన అన్ని రకాల పరీక్షలు నిర్వహించారు. ఆ కంటి పరీక్షలలో వచ్చిన రిపోర్ట్‌ల ఆధారంగా రాజయ్యకు ఇక మీదట కంటి చూపు రాదని అతని కంటికి సంబంధించిన సున్నితమైన అన్ని నరాలు తెగిపోయాయని చెప్పడం జరిగింది. ఒకవేళ కన్ను తీసి వేరు కన్ను పెట్టిన కూడా కంటి నరాలు పనిచేయవని కంటి వైద్యుడు చెప్పారు.

ఇక రాజయ్యకు శాశ్వతంగా చూపు రాదని అతడు అంధుడిగా జీవించాల్సిందేనని కంటి వైద్యుడు శివారెడ్డి చెప్పిన మాట లు విన్న రాజయ్య పెద్దన్న ఒక్కసారిగా విభ్రాంతి చెందినా డు. తమ్ముడు రాజయ్య భవిష్యత్ యాది చేసుకుని దుఃఖప్రాప్తుడై రాజయ్యను తీసుకొని హైదరాబాద్ నుండి బయలుదేరి ఇంటికి చేరుకున్నారు. ఇక తమ్మునికి చూపు రాదన్న చేదు వార్తను వాళ్ళ తండ్రికి రాజయ్య పెద్ద అన్న చెప్పిండు. అప్పడప్పుడే రాజయ్య వయస్సు ఆరేళ్లు నిండి ఏడోయేడు ప్రారంభమైనది. దిన దినము గడుస్తున్న కొలది ఎదుగుతున్న కొడుకును పోషించే స్థోమతలేని తండ్రి రాజయ్యతో కొడుకా ఏదైనా రైల్వే స్టేషన్ లేదా బస్టాండ్ చూసుకోమని, అక్కడికెళ్లి ప్రతిరోజు అడుక్కుని బ్రతకాలని రాజయ్యకు చెప్పిండు.



తండ్రి నోట అడుక్కుని బ్రతకాలని చెప్పిన మాట విన్నప్పు డే రాజయ్య భవిష్యత్ శ్మశానంలో కాలుతున్న దేహం అయిం ది. తన కడుపున పుట్టిన నన్ను చాలా గారాబంగా పెంచిన తండ్రి ఇలా చెప్పడం జీర్ణించుకోలేకపోయిన రాజయ్య ఎలాగైనా నేను మానవీయ విలువలు కలిగి జీవించాలని గట్టి ప్రయత్నం చేశాడు. తమ ఇంటి దగ్గర ఉన్న మోటార్ మెకానిక్ దగ్గరకు వెళ్ళిన రాజయ్య తనకు ఏదైనా పని ఉంటే చెప్పమని వేడుకున్నాడు. రాజయ్యకు కళ్ళు లేవని తెలుసుకున్న ఆ మోటార్ మెకానిక్ కళ్ళు లేని వారు ఏ పని చేయాలన్న కుదరదని చెప్పాడు. ఆ మోటార్ మెకానిక్ చెప్పిన మాటకు కృంగిపోకుండా రాజయ్య నాకు మీరు ఏదైనా పని చెప్పండి నేను చేస్తానని చెప్పడంతో ఆ మోటా ర్ మెకానిక్ రాజయ్యకు మోటార్ మెకానిక్ పని నేర్పించాడు.

సుమారు పదిహేనేళ్లు వచ్చేవరకు రాజయ్య ఆ ఊరిలో ఒక మోతాదు మోటార్ మెకానిక్‌గా గుర్తింపు పొందినాడు. ఇదే తరహాలో సాగుతున్న జీవితంలో సంజీవరెడ్డి అనే వ్యక్తి మిత్రుడుగా పరిచయం అయ్యాడు. ఆ సంజీవరెడ్డికి కూడా మోటార్ మెకానిక్‌గా మంచి గుర్తింపు ఉన్నది. రాజయ్యకు సంజీవరెడ్డి ఇంకా కాస్త ఎక్కువ మోటార్ మెకానిక్ పనులు అప్పగిస్తాడు.

ఇంతింతై వటుడింతై అన్నట్లుగా రాజయ్య మాణిక్యపూర్‌లో వ్యవసాయానికి సంబంధించిన అన్ని రకాల మోటార్ మెకానిక్ పనులు చేస్తున్నాడు. రాజయ్య మోటార్ మెకానిక్ పనులు చేసుకుంటూ రోజుకు మూడు వందల నుండి ఐదు వందల రూపాయల వరకు సంపాదిస్తూ ఒంటరిగా జీవనం కొనసాగిస్తున్నాడు. రెండు కళ్ళు కోల్పోయిన రాజయ్యకు పని నిమిత్తం బావుల దగ్గరికి వెళ్ళే క్రమంలో తోవ తప్పిపోతే గ్రామ ప్రజలు సహాయం చేస్తారు. ఇంత గొప్ప సంకల్పం కలిగిన రాజయ్యకు మాణిక్య పూర్ ఊరు ప్రజలందరూ తోడుగా నిలబడ్డారు. మానవ జాతికే ఆదర్శవంతుడుగా నిలిచిన చింతం రాజయ్య జీవితం మనందరికీ ఉత్తేజప్రాయం.

# దిశ కోల్పోయిన దక్కన్ డెవలప్మెంట్ సొసైటీ



డా. ముచ్చుకోట సురేష్ బాబు

సుస్థిర అభివృద్ధి, మహిళా సాధికారత, సాధికారత వారసత్వం కోసం నలభై వసంతాల కిందట బాసట వేసిన దక్కన్ డెవలప్మెంట్ సొసైటీ ఇప్పుడు అపనమ్మకంతో మునిగిపోయింది. నాలుగు దశాబ్దాలకు పైగా, దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ తెలంగాణలోని జహీరాబాద్ లో అట్టడుగు స్థాయి సమాజ పరివర్తనకు మార్గదర్శిగా నిలిచింది. దళిత మహిళలను శక్తివంతం చేయడానికి మిల్లెట్ వ్యవసాయాన్ని పునరుద్ధరించడం, బంజరు భూములను తిరిగి పొందడం, ఆర్థిక స్వాతంత్ర్యాన్ని పెంపొందించడం ఒక ఉద్యమంగా ప్రారంభమైంది. ఇప్పుడు నమ్మక ద్రోహానికి, అపనమ్మకాన్ని కేర్ అఫ్ అడ్రస్ గా మారింది. డిడిఎస్‌ను నిర్మించిన మహిళలే ఇప్పుడు తమ ప్రశ్నలకు సమాధానాలు కోరుతున్నారు. మా పొదుపు సొమ్ము ఎక్కడ ఉంది? మన భూములను ఎవరు అమ్మారు? ఆర్థిక స్వాలంబన, సాధికారత, మన కాళ్లపై మనం నిలబడదాం వంటి గొప్ప మాటలు చెప్పినవారు చివరికి మమ్మల్ని చీకటి ప్రపంచంలో వదిలేశారు అంటున్నారు.

దివంగత పి.వి. సతీష్ నాయకత్వంలో, డిడిఎస్ స్థిరమైన వ్యవసాయం, విత్తన సార్వభౌమాధికారం, మహిళల నేతృత్వంలోని సంఘాల (స్వయం సహాయక బృందాలు) వినూత్న నమూనాకు అంతర్జాతీయ గుర్తిం పు పొందింది. జర్మనీకి చెందిన బ్రోట్ ఫర్ డై వెల్ట్, కెనడాకు చెందిన ఇంటర్ పరేస్ వంటి ప్రపంచ దాతలు నిధులు సమకూర్చిన డెవలప్మెంట్ సొసైటీ దళిత సాధికారత, మహిళా స్వాలంబన, ఆహార భద్రత, ఆహార న్యాయం అనే వాటికి పర్యాయ పదంగా మారింది. అయినప్పటికీ, నేడు, ఆ వారసత్వం పరిశీలనలో ఉంది. పొదుపులు లేకపోవడం, అనధికారిక భూమి అమ్మకాలు, ఆర్థిక అస్పష్టత వంటి ఆరోపణలు ఒకప్పుడు ఉద్యమానికి వెన్నెముకగా ఉన్న మహిళలను నమ్మకద్రోహం చేసి నిట్ట నిలువునా ముంచేశారు. 'మేము డిడిఎస్‌ని నమ్మి వారానికి ₹1 ఆదా చేసాము. ఇప్పుడు, నా పేరు వారి రికార్డులలో కూడా లేదని హోతి గ్రామంకు చెందిన రంగమ్మ (60) వాపోతున్నారు.

గతంలో మేము గౌరవం కోసం పోరాడాము, కానీ ఇప్పుడు మా బకాయిల కోసం పోరాడుతున్నాము అని దన్నవరం గ్రామస్తురాలు నాగమ్మ ఎంతో నిరాశతో చెబుతోంది. దళితుల కోసం ఉద్దేశించిన భూమి బయట వ్యక్తులకు అమ్మబడింది, అలాగే రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు బ్రోకర్ల పాలయిందని మాజీ డిడిఎస్ ఉద్యోగి జగన్నాథ్ రెడ్డి తెలిపారు. దక్కన్ డెవలప్మెంట్ సొసైటీలో ప్రశ్నలు ఎప్పుడూ అనుమతించబడలేదని పనిచేసిన సొసైటీ సభ్యులు తెలిపారు. సొసైటీ అధినేత సతీష్ దివంగతులైన తరువాత కీలక ఆరోపణలు వెల్లువెత్తాయి. పొదుపులు లేకపోవడం, రుణాలు, జీవనోపాధి కోసం ఉద్దేశించిన దశాబ్దాల నాటి డిపాజిట్లు తిరిగి ఇవ్వబడలేదని మహిళలు క్లెయిమ్ చేస్తున్నారు. కుప్పానగర్, మన్నూర్ ఇతర గ్రామాల్లో ఎకరాల సంఘం భూమిని సభ్యుల అనుమతి లేకుండా విక్రయించారని ఆరోపణలు వచ్చాయి. కొన్ని మార్కెట్ విలువ కంటే చాలా తక్కువ ధరలకు అమ్మేశారు. ఒకప్పుడు 28 అంతర్జాతీయ ఏజెన్సీల మద్దతుతో విరాజిల్లింది, ఇప్పుడు కేవలం నలుగురు దాతలపై మాత్రమే ఆధారపడుతుంది. బ్రోట్ ఫర్ డై వెల్ట్ వంటి ప్రధాన మద్దతుదారులు 2022 నాటికి నిధులను ఉపసంహరించుకున్నారు. ఫిబ్రవరి 2025లో వేలాది మంది మహిళలు, డిడిఎస్ పూర్వ సంఘ సభ్యులు, సానుభూతిపరుల పస్తాపూర్ గుండా ప్లకార్డులు పట్టుకుని ప్రదర్శనగా నినదిస్తూ డిడిఎస్ ప్రధాన కార్యాలయం వద్ద ధర్నా చేశారు. పేద అట్టడుగు వర్గాలకు ద్రోహం చేసిన డిడిఎస్ వల్ల ఉపయోగం ఏమిటిని పలువురు ప్రజా సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. పొదుపులు ధృవీకరించి తిరిగి ఇస్తున్నట్లు డిడిఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దివ్య వేలుగురి పేర్కొన్నప్పటికీ, పొదుపు సంఘాలు మహిళా సంఘాలలో నమ్మకం లేదు. 30 గ్రామాల్లో నోటీసులు జారీ చేయబడ్డాయి, కానీ డబ్బు ఎక్కడ?' అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. దక్కన్ డెవలప్మెంట్ సొసైటీ విజయాలు కాదనలేనివి. జహీరాబాద్ గ్రామాల్లో కుల అడ్డంకులను బద్దలు కొట్టింది. మిల్లెట్ వ్యవసాయం ఆహార సార్వభౌమత్వాన్ని పునరుద్ధరించింది. అలాగే ఇళ్ళు, విత్తన బ్యాంకు లు ప్రత్యామ్నాయ పౌర సరఫరా వ్యవస్థను నిర్మించిం ది. అయినప్పటికీ, దాని క్షీణత ఒక బాధాకరమైన సత్యాన్ని నొక్కి చెబుతుంది, పారదర్శకత క్షీణించినప్పుడు అత్యంత ప్రసిద్ధి చెందిన అట్టడుగు ఉద్యమాలు కూడా కూలిపోతాయి.

సతీష్ వెళ్ళిపోయి విశ్వాసం విచ్చిన్నం కావడంతో, డిడిఎస్ అస్తిత్వ ప్రశ్నను ఎదుర్కొంటుంది. అది తన నైతిక అధికారాన్ని తిరిగి పొందగలదా, లేదా అనేది ప్రశ్నార్థకం. ప్రస్తుతానికి, జహీరాబాద్ మహిళలు మాత్రం సానుభూతి కోసం ఎదురుచూడడం లేదు, జవాబుదారీతనం కోసం వేచి ఉన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సహకార సంస్థలు తక్షణమే జోక్యం చేసుకుని మహిళలకు న్యాయం చేయాలి. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాలని సంస్థ వ్యవస్థాపక సభ్యులు కొమండూరి సంతాన గోపాల్, పౌర ప్రజా సంఘాలు కోరుతున్నాయి.

# గాడిదలకూ ఒక రోజుందోచ్!

అడ్డగాడిదలా పెరిగావ్, గాడిద చాకిరీ చేయిస్తున్నారు అంటూ పలు సందర్భాల్లో గాడిదతో పోలుస్తూ తిడుతుంటారు. ఏం?గాడిదలంటే అంత అలుసా? గాడిదలకు ప్రాణం లేదా? వాటికి మనస్సు లేదనుకుంటున్నారా? అందుకే గాడిదల దుస్థితిని తెలియపరచటానికి, గాడిదకు సరైన ఆరోగ్యం, చికిత్సపై అవగాహన కల్పించడానికి మే8న ప్రపంచ గాడిదల దినోత్సవంగా పాటిస్తున్నారు.

గాడిద అనేది గుర్రం లాంటి ఒక జంతువు. ఇవి కూడా గుర్రం కుటుంబానికి చెందినవిగానే చెప్తారు. అయితే గాడిదకు ఎక్కువ గౌరవం గానీ, ప్రాముఖ్యతను గానీ ఇవ్వరు. వాస్తవానికి గాడిద ఎంతో కష్టజీవి. మనుషులు ఎన్నో రకాలుగా ఈ జంతువును వాడుకుంటారు. కానీ, కొన్ని సందర్భాల్లో మనుషుల్ని గాడిదతో పోలుస్తూ తిడతారు. తెలుగులో 'అడ్డగాడిదలా తిరుగుతున్నావ్', 'కూసే గాడిద వచ్చి మేసే గాడిదని చెడగొట్టిందట', 'గాడిద గుడ్డేం కాదు' అనేవి చాలా పాపులర్ తిట్లు. అలాగే 'వసుదేవుడంతటివాడు గాడిద కాళ్ళు పట్టుకొన్నాడట' అని కూడా తెలుగు సంభాషణల్లో విరివిగా ఉపయోగిస్తారు. గాడిదలు గుర్రం కంటే చాలా శక్తివంతమైనవి. అందుకే వీటిని బరువులు మోయడానికి ఉపయోగిస్తారు. గతంలో చాకలివారు తాము ఉతికిన బట్టలను గాడిదలతో మోయించేవారు. కొన్నిచోట్ల వ్యవసాయ పనులకు, కూలి పనులకు కూడా గాడిదలను ఉపయోగిస్తారు. మేకలు, గొర్రెల మందలో వాటికి రక్షణగా గాడిదను ఉంచుతారు. ఇలా మనుషులకు ఎంతో సహాయకారిగా ఉండే ఈ జీవిని వాడుకొని వదిలేస్తారు గానీ వీటి ఆరోగ్యాన్ని పట్టించుకునేవారు లేరు.

గాడిదలు మొదటిసారిగా సుమారు 3000 BC నుండి మానవులు పెంచుకుంటున్నారు. ఇంచుమించు ఇదే కాలం నుండి గుర్రాల పెంపకం మొదలైనది. తరువాత ఇవి ప్రపంచమంతా వ్యాపించాయి. పెంచుకొనే గాడిదలు విస్తరించగా, అడవి గాడిదలు నెమ్మదిగా అంతరించిపోతున్నాయి. ఇవి తమ ఆత్మరక్షణ కోసం ఎక్కువగా వెనుక కాళ్ళను వాడతాయి. గాడిదలు చాలా బలమైనవి, తెలివైనవి. గాడిదలకు అపురూపమైన జ్ఞాపకశక్తి ఉంది. ఇవి తిరిగిన ప్రాంతాలను, ఇతర గాడిదలను సుమారు 25 సంవత్సరాల వరకు గుర్తుపెట్టుకోగలవు.


గాడిదలు కొన్నిసార్లు మొండిగా ప్రవర్తిస్తాయి. అయితే ఇందుకు ఒక కారణం కూడా ఉంది. ఎప్పుడైతే అది ప్రమాదం అని పసిగడుతుందో దాని స్వీయరక్షణ కోసం ఎటూ కదలకుండా అలాగే నిల్చుండిపోతుంది. అప్పుడు ఎవరు ఎంత లాగినా, బెదరగొట్టినా గాడిద అది ఉన్నస్థానం నుంచి అస్సలు కదలదు గాక కదలదు. మగ గాడిద, ఆడ గుర్రం మధ్య సంకరం ద్వారా పుట్టిన జంతువు కంచర గాడిదలు. అవి బలానికి,



ఓర్పుకు, తెలివితేటలకు బాగా ప్రసిద్ధి చెందాయి. ఇది చాలా మొండి జంతువు. ఎంతటి కష్టాన్నైనా మొండిగా సహిస్తుంది. అధిక బరువులను ఓపిగ్గా మోస్తూ ఎక్కువ దూరాలు ప్రయాణించగలదు. మగ గుర్రం, ఆడ గాడిద యొక్క హైబ్రిడ్‌ను హిన్నీ అంటారు. గాడిదలు మరియు గుర్రాల ద్వారా ఉత్పత్తి చేయబడిన సంతానం (హైబ్రిడ్ సంతానం) రెండూ సంతానం లేనివి, శుభ్రమైనవి, వాటి స్వంత సంతానం కలిగి ఉండవు. గాడిదలో ఉన్న మరో ప్రత్యేకమైన అంశం దాని అరుపు. ఎలాంటి అవరోధాలులేని ఒక ఎడారి లాంటి ప్రాంతంలో ఏదైనా ఒక గాడిద అరిస్తే సుమారు 96 కిలోమీటర్ల దూరంలో ఉన్న మరో గాడిద ఆ పిలుపును వింటుంది. అంత గొప్ప గొంతు దానిది. గాడిద గుర్రం లాగా అనవసరంగా బెదరదు, ఆశ్చర్యపోదు. గాడిద తదేకంగా గమనిస్తుంది. దాని ఆలోచన మేరకే నడుచుకుంటుంది. ఎవరైనా గాడిదకు ట్రైనింగ్ ఇవ్వాలంటే అతడి ద్వారా తనకు రక్షణ ఉంటుంది అని అది నమ్మినపుడే అతడి మాట వింటుంది. గంగిగోవు పాలు గరిటెడు చాలు, కడవనైతేనేమి ఖరము పాలు అని పద్యం ఉంది. కానీ ప్రపంచంలోనే గాడిద పాలు ఎంతో ఖరీదైనవి. ఇండియాలోనే గాడిదపాలు లీటరుకు రూ. 10వేలకు చొప్పున అమ్ముడయిన సందర్భాలు ఉన్నాయి. అంటే కడవ పాలుంటే లక్షధికారి కావొచ్చు. కొన్నిచోట్ల గాడిద పాలను ఆయుర్వేద ఔషధాలలో వినియోగిస్తా రు. గాడిద సంఘజీవి. దీని శాస్త్రీయనామం ఈక్విస్ అసినస్. గాడిదలు 27 నుండి 40 సంవత్సరాలకు పైగా జీవించగలవు. గర్భధారణకాలం 11–14 నెలలు. ఇది గాడిద ఘనకీర్తి. కాబట్టి ఏ జీవిని చిన్నచూపు చూడొద్దు. ప్రకృతిలో ప్రతి జీవికి సమాన హక్కులు, స్వేచ్ఛగా జీవించే హక్కులు ఉంటాయి అని చెప్పటం ఈ రోజుకు ఉన్న ముఖ్య ఉద్దేశ్యం.

*(మే 8 ప్రపంచ గాడిదల దినోత్సవం)*

సుధాకర్.ఏ.వి, 9000674747



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## 200 విమానాల రద్దు
### 18 విమానాశ్రయాలు తాత్కాలిక మూసివేత

**న్యూఢిల్లీ / ముంబై :** 'ఆపరేషన్ సిందు' జరిగిన నేపథ్యంలో బుధవారం ఉదయం దేశంలో శ్రీనగర్ సహా 18 విమానాశ్రమాలను తాత్కాలికంగా మూసివేయగా, 200 విమాన సర్వీసులను రద్దు చేశారు. ఎయిర్ ఇండియా, ఇండిగో, స్పైస్‌జెట్, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, అకాశ ఎయిర్, పలు విదేశీ విమాన సంస్థలు తమ విమానాలను రద్దు చేశాయి. దేశంలో ఉత్తర, దక్షిణ ప్రాంతాలలో 18 విమానాశ్రయాలను తాత్కాలికంగా మూసివేశారు. వాటిలో శ్రీనగర్, లేహ్, సిమ్లా, ధర్మశాల, జమ్మూ, అమృత్‌సర్, పఠాన్‌కోట్, చండీగఢ్, జోధ్‌పూర్, జైసల్మేర్, జామనగర్‌లు విమానాశ్రయాలు ఉన్నాయి.







## సినిమా ఇంకా ఉంది
### ఆర్మీ మాజీ చీఫ్‌ల వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ:** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై భారత సైన్యం విరుచుకుపడటంపై భారత ఆర్మీ మాజీ చీఫ్ మనోజ్ నరవణే స్పందించారు. ఉగ్ర స్థావరాలపై దాడిని ఉద్దేశిస్తూ 'సినిమా అప్పుడే అయిపోలేదు.. ఇంకా ఉంది' అంటూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. మాజీ చీఫ్‌ఆఫ్ ఆర్మీ స్టాఫ్ జనరల్ శంకర్ రాయ్ చౌదరి స్పందిస్తూ ఉగ్రస్థావరాలపై భారత బలగాలు చేసిన దాడిని అద్భుతమైన ప్రణాళికతో కూడిన గొప్ప ఆపరేషన్‌గా ప్రశంసించారు. ఈ దాడులను భారత్ ఆపకూడదని, కొనసాగించాలని సూచించా రు. ఇది యుద్ధం లాంటి పరిస్థితి కాదని, ఇప్పటికే రెండు దేశాల మధ్య అప్రకటిత యుద్ధం కొనసాగుతోందని అన్నారు. దా డుల సమయంలో మాజీ ఆర్మీ చీఫ్‌ల నుంచి ఇలాంటి స్పందన రావడం గమనార్హం.

## విభిన్నం... 'ఆపరేషన్ సిందూర్'




**న్యూఢిల్లీ:** భారత్ గతంలో జరిపిన మెరుపు దాడుల కంటే తాజాగా నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్' పూర్తిగా భిన్నమైనది. 2016లో ఉరి ఉదంతం తరువాత నిర్వహించిన మెరుపుదాడులు, 2019లో బాలాకోట్ దాడులు సహా గతంలో ఎన్నడూ ఇటువంటి దాడులు చేపట్టలేదు. సాంకేతికపరంగా ఈ ఆపరేషన్ అత్యంత బలమైంది.. ఖర్చుతో కూడుకున్నది. అంతేకాకుండా ఉగ్రవాదం విషయంలో గతంలో అనుసరించిన వైఖరి పూర్తిగా మారిపోయిందనే బలమైన సంకేతం పాక్‌కు వెళ్లింది. 'భారీ సంఖ్యలో ఉగ్రవాదులను మట్టుబెట్టడంతో టెర్రరిస్ట్ నెట్‌వర్క్‌లు, వాటి హ్యాండిలర్లకు తీవ్ర హెచ్చరికలు వెళ్లినట్లు అయింది. దీంతోపాటు అవసరమైతే భారత్ ముందస్తుగా దాడి చేయగలదని, పాక్‌లోని ఏ లక్ష్యం తమకు దూరం కాదని స్పష్టంచేసింది. ఉగ్రదాడులకు ప్రతిస్పందించడమంటే కేవలం శక్తిని చూపడం మాత్రమే కాదని, టెర్రరిస్టుల కార్యకలాపాలు, ఇతర వనరుల పునాదులు పెకలించేస్తామని ఈ దాడులతో పేర్కొంది. అత్యంత కచ్చితత్వంతో లక్ష్యాలు ఛేదించే 24 ఆయుధాలను భారత్ వినియోగించింది. వీటిల్లో క్షిపణులు, బాంబులు, ఆత్మాహుతి డ్రోన్లు ఉన్నాయి.

## సరిహద్దు సిఎంలతో అమిత్ షా అత్యవసర వీడియో కాన్ఫరెన్స్

**న్యూఢిల్లీ :** ఉగ్రశిబిరాల ధ్వంసం నేపథ్యంలో పాకిస్తాన్, నేపాల్ సరిహద్దు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రభుత్వ ప్రధానకార్యదర్శులు, డిజిపిలతో కేంద్ర హోం మంత్రి అమిత్ షా బుధవారం అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. విడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన ఈ సమావేశంలో జమ్మూ కశ్మీర్, పంజాబ్, రాజస్తాన్, గుజరాత్, ఉత్తరాఖండ్, ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, సిక్కిం, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రులు, సిఎస్, డిజిపిలు, లద్దాఖ్ కేంద్ర పాలిత ప్రాంత లెఫ్టినెంట్ గవర్నర్ హాజరయ్యారు. సెలవుల్లో ఉన్న సిబ్బందిని వెంటనే వెనక్కి పిలిపించాలని కేంద్ర సాయుధ పోలీస్ బలగాలకు అమిత్‌షా ఇప్పటికే సూచించారు. దేశ ఆంతరంగిక భద్రత పరిస్థితిపై ఆయన సమీక్ష నిర్వహించి, ఉన్నత భద్రత అధికారులు అత్యంత అప్రమత్తతతో ఉండాలని, గట్టి నిఘా ఉంచాలని ఆదేశించారు. పహల్గామ్‌లోని అమాయక ప్రజల దారుణ హత్యలకు స్పందనగానే భారత్ 'ఆపరేషన్ సిందూర్' చేపట్టిందని హోం మంత్రి తెలిపారు. భారతదేశం, దేశ ప్రజలపై జరిగే ఎలాంటి దాడిపైన అయినా గట్టి జవాబు ఇచ్చేందుకు మోదీ ప్రభుత్వం కంకణబద్ధురాలై ఉందని, ఉగ్రవాదాన్ని వేళ్ళ నుంచి పెకలించి వేసేందుకు నిబద్ధతో ఉన్నామని అమిత్ షా అన్నారు.

## లష్కరే నుంచి జైషే మహ్మద్ వరకు...
# 'ఉగ్ర'శిబిరాల వివరాలు ఇవే



**న్యూఢిల్లీ:** పహల్గాం ఉగ్రదాడితో భారత్‌కు ఓపిక, సహనం నశించాయి. ముష్కరులు అమాయకుల ప్రాణాలు తీయడమే కాకుండా... మీ ప్రధానికి వెళ్లి చెప్పండనడంతో వారిని ఏమాత్రం ఉపేక్షించకూడదని నిర్ణయించుకొంది. పఠాన్ కోట్ నుంచి రియాసీ దాడి వంటి పెద్ద కుట్రలకు కేంద్రాలుగా నిలిచిన శిక్షణ శిబిరాలను నేలమట్టం చేసింది. జైషే మహ్మద్, లష్కరే తోయిబా, ఉగ్రవాదుల భారీ సొరంగాలను ధ్వంసం చేసింది. సరిహద్దుకు 100 కిలోమీటర్ల దూరంలో గల బహవల్పూర్‌లోని మర్కజ్ సుబాన్ జైషే మహ్మద్‌కు ఆపరేషనల్ హెడ్ క్వార్టర్‌గా ఉంది. పుల్వామా దాడి సహా భారత్‌పై చాలా కుట్రలు ఇక్కడే పురుడు పోసుకున్నాయి. మసూద్ అజార్ సన్నిహితులు ఈ కేంద్రం నుంచి ఆత్మాహుతి దాడులకు శిక్షణ ఇవ్వడం, ప్లానింగ్ వంటివి చేశారు. దీనిని జైషే చీఫ్ మసూద్ ఇంటిగా వినియోగిస్తాడు. జైషే నెంబర్2గా ఉన్న ముఫ్తీ అబ్దుల్ రవూఫ్ అస్గర్, మౌలానా అమర్ ఇతరుల కుటుంబసభ్యులు కూడా దీనిలో ఉంటున్నారు.

### లష్కరే కార్యాలయం ఉగ్ర యూనివర్సిటీ

మురిద్కేలోని మర్కాజ్ తోయిబా లష్కరే తోయిబా ప్రధాన కార్యాలయం. సరిహద్దుకు 30 కిలోమీటర్ల దూరంలోని లష్కరే క్యాంపు కార్యాలయం ఇది. దాదాపు 82 ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఉగ్ర క్యాంపస్ ఇది. ఇందులో మదర్సా, మార్కెట్ వంటివి ఉన్నాయి. ఉగ్రవాదాన్ని వ్యాప్తి చేయడంలో ఈ క్యాంపస్‌దే కీలక పాత్ర. ఇది లష్కరే ప్రధాన కార్యాలయంగా పనిచేస్తోంది. దాదాపు 1000 మంది వరకు ఇక్కడ ఉగ్ర శిక్షణ పొందుతున్నారు. దీని నిర్మాణానికి 2000లో అల్‌ఖైదా అధినేత ఒసామా బిన్ లాడెన్ 10 మిలియన్ డాలర్లు విరాళం ఇచ్చాడు. 26/11 ఉగ్రదాడికి పాల్పడిన దుర్మార్గుల్లో ఒకడైన అజ్మల్ కసబ్‌కు ఇక్కడే ఇంటెలిజెన్స్ శిక్షణ ఇచ్చారు. ఈ దాడి కుట్రదారులు డేవిడ్ హెడ్లీ, తహవ్వూర్ రాణా ఈ కేంద్రాన్ని సందర్శించారు. లష్కరే సిద్ధాంతకర్తలు అమిర్ హమ్జా, అబ్దుల్ రెహ్మాన్ అబ్ది, జాఫర్ ఇక్బాల్ ఈ ప్రాంగణంలోనే నివాసం ఉంటున్నారు. లష్కరే చీఫ్ హాఫీజ్ సయీద్, జకీర్ రహ్మాన్ లఖ్వీకి ఇక్కడ ఇళ్లు ఉన్నాయి.

తెహ్రా కలాన్‌లోని సర్జల్ క్యాంప్. జైషే మహ్మద్ ఉగ్ర స్థావరం ఇది. దీన్ని కూడా జమ్మూకశ్మీర్‌లోకి ఉగ్రవాదులను పంపించేందుకు ఉపయోగిస్తున్నారు. భారత్‌లోని సాంబా సెక్టర్‌కు కేవలం ఆరు కిలోమీటర్ల దూరంలో ఉంది. భారత్‌లోకి రహస్య సొరంగాలు తవ్వేందుకు ఇది కేంద్రంగా ఉంది. షకర్‌గర్ ప్రాంతాన్ని లష్కరే, జైషేలు సొరంగాల నెట్‌వర్క్‌గా మార్చేశాయి. భారత్‌లోకి ఆయుధాలు, మత్తు పదార్థాలు రవాణా చేసేందుకు ఇది ప్రధాన లాంచ్‌ప్యాడ్. ఇక్కడ కంట్రోల్ రూమ్ ఉంది. వీటిల్లో హిజ్బుల్ ముజాహిదీన్ రేడియో రిసీవర్లు, కమ్యూనికేషన్ సెంటర్లు ఉన్నాయి. జైషే కమాండర్లు ఇక్కడికి వచ్చి వెళుతుంటారు. ఖాలిస్థాన్ టైగర్ ఫోర్స్‌కు ఇక్కడ పారా గ్లైడింగ్‌లో శిక్షణ ఇచ్చారు. పఠాన్‌కోట్ ఎయిర్ బేస్‌పై దాడి చేసిన ఉగ్రవాదులకు జైషే కమాండర్ షాహిద్ లతీఫ్ ఇక్కడే బ్రెయిన్ వాష్ చేశాడు. కాగా, హిజ్బుల్ కీలక కేంద్రం సియల్‌కోట్‌లోని మెహ్మూనా జోయా క్యాంప్. అంతర్జాతీయ సరిహద్దుకు 15 కి.మీ. దూరంలో ఉన్న హిజ్బుల్ ముజాహిదీన్ శిబిరం ఇది. దీనికి చుట్టూ నివాస భవనాలు ఉన్నాయి. దీనికి మోహద్ ఇర్ఫాన్ ఖాన్ కమాండర్‌గా వ్యవహరిస్తున్నాడు. ఇతడు 1995లో జమ్మూలోని మౌలానా ఆజాద్ స్టేడియంలో వరుస పేలుళ్లకు పాల్పడ్డాడు. నాడు గవర్నర్ కేవీ కష్ణారావు త్రుటిలో ఈ దాడుల నుంచి బయటపడ్డారు. ఈ ఉగ్ర స్థావరంలో దాదాపు 50 మంది ఉండేందుకు వీలుగా ఏర్పాట్లు ఉన్నాయి. నిత్యం ఇక్కడ 2025 మంది ఉంటారు. బర్నాలలోని మర్కాజ్ అహ్లే హదిత్ ఉగ్ర స్థావరం. ఇది లష్కరే తోయిబా ఉగ్ర క్యాంప్. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని భింబెర్ జిల్లాలో ఉంది. ఇక్కడ 150 మందికి శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు ఉన్నాయి. నిత్యం 40 మంది ఇక్కడ ఉంటారు. ఈ కేంద్రాన్ని లష్కరే కమాండర్ ఖాసీం గుజ్జర్, అనాస్‌జరార్ నిర్వహిస్తున్నారు. పూంఛ్‌రాజౌరిరియాసీ సెక్టార్‌లోకి లష్కరే ఉగ్రవాదులు, ఆయుధాలు పంపించేందుకు దీన్ని వినియోగిస్తున్నట్లు సమాచారం.

కోట్లిలోని మర్కాజ్ అబ్బాస్ ఉగ్ర స్థావరం జైషే ఆయుధాగారం. నియంత్రణ రేఖకు 35 కి.మీ. దూరంలో ఈ క్యాంప్ ఉంది. కోట్లీ మిలిటరీ క్యాంప్‌నకు కేవలం రెండు కిలోమీటర్ల దూరంలో దీనిని నిర్వహించడం గమనార్హం. ఇక్కడ 125 మంది శిక్షణ ఇచ్చేలా ఏర్పాట్లు ఉన్నాయి. ఏ సమయంలోనైనా కనీసం 50 మంది ఉంటారు. హాఫీజ్ అబ్దుల్ షకూర్ అలియాస్ ఖారీజరార్ ఈ కేంద్రానికి నాయకుడు. జైషే వ్యవస్థాపక సభ్యుల్లో ఒకడు. గతంలో హర్కత్ ఉల్ ముజాహిదీన్‌లో పనిచేశాడు. 2016న గ్రోటాలోని బాలెనీ ఆర్మీ క్యాంప్‌పై దాడిలో ఇతడి హస్తం ఉన్నట్లు ఎన్ఐఏ వెల్లడించింది. పఠాన్‌కోట్ ఉగ్రదాడి తర్వాత జైషే తన ఆయుధాలు, మందుగుండును దశాకా మర్కజ్ నుంచి తరలించి ఇక్కడ నిల్వ చేయడం



మొదలుపెట్టింది. అవసరమైనప్పుడు షకూర్ స్వయంగా ఆయుధాలను తన వాహనంలో సియాల్‌కోట్‌కు తరలిస్తాడు. 2023 ఏప్రిల్ 20న పూంఛ్‌లో జరిగిన దాడులకు, జూన్ 24న బస్సులో ప్రయాణిస్తున్న అమాయక యాత్రికులపై దాడికి ఇక్కడి ఉగ్రవాదులే కారణమని సమాచారం. ఉగ్రవాదులకు పర్వత యుద్ధతంత్రంలో శిక్షణ ఇస్తారు. ఇది కోట్లిలోని మస్కర్ రహీల్ షహీద్. పీఓకేలో హిజ్బుల్ ముజాహిదీన్‌కు చెందిన స్థావరం ఇది. దాదాపు 200 మందికి ఉగ్ర శిక్షణ ఇచ్చేలా దీనిని నిర్మించారు. ప్రస్తుతం అక్కడ 30 మంది వరకు ఉండొచ్చని అంచనా. తుపాకీల వినియోగం, శారీరక దఢత్వంపై శిక్షణ ఇస్తారు. హిజ్బుల్ చీఫ్ సయ్యద్ సలాహుద్దీన్ దీనికి అధిపతి. కొండల ప్రాంతంలో ఉండే ఈ క్యాంప్‌లో నాలుగు గదులు, బ్యారక్‌లు ఉన్నాయి. వీటిలో పెద్దఎత్తున ఆయుధాలు, మందుగుండు సామగ్రి ఉన్నట్లు సమాచారం. వీటితోపాటు ఉగ్రవాదులకు బ్రెయిన్ వాష్ చేసేందుకు అవసరమైన ప్రచార సామగ్రి పెద్దఎత్తున ఇక్కడ నిల్వ చేస్తారు. లష్కరే శిక్షణ కేంద్రం ముజఫరాబాద్‌లోని షవాయ్ నాలా. ఇది 2000 సంవత్సరం నుంచి పనిచేస్తోంది. దీనికి హుజైఫా బిన్ యెమెన్, బైత్ ఉల్ ముజాహిద్దీన్ అనే పేర్లు కూడా ఉన్నాయి. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని తంగ్ధర్ సెక్టార్‌లో సరిహద్దుకు 30 కిలోమీటర్ల పరిధిలో షవాయ్ లష్కరే క్యాంప్ ఉంది. ఈ ముఠాకు కీలకమైన క్యాంప్ ఇది. లష్కరే కమాండర్ అబు దుజానా దీనికి ఇన్‌ఛార్జి. పెద్దఎత్తున లష్కరే కేడర్ ఇక్కడ నివాసం ఉంటోంది. వీరిలో కమాండర్లు, శిక్షకులు ఉన్నారు.

### పాక్ ఎస్ఎస్‌జి కమాండోలతో శిక్షణ

ముజఫరాబాద్‌లోని సైద్నా బిలాల్ ఉగ్ర స్థావరం. పీఓకేలోని జైషే ప్రధాన కేంద్రాల్లో ఇది ఒకటి. ముఫ్తీ అస్గర్ ఖాన్ కశ్మీరీ దీనికి అధిపతి. భారత్ నుంచి పారిపోయిన... ఆసిక్ నెంగ్రూ, జైషే కమాండర్ అబ్దుల్ జిహాదీ కూడా ఈ క్యాంప్‌ను వాడుకొన్నారు. ముజఫరాబాద్ రెడ్‌ఫోర్ట్‌కు ఎదురుగా ఉంటుంది. ఇక్కడికి వచ్చేవారికి పాక్ ఎస్ఎస్‌జీ కమాండోలు శిక్షణ ఇస్తారు. జమ్మూకశ్మీర్‌లోకి ఉగ్రవాదులను తరలించేందుకు వీలుగా దీన్ని రవాణా క్యాంప్‌గా నిర్వహిస్తున్నారు. ఇక్కడ నిత్యం 50100 మంది ఉగ్రవాదులు ఉంటారని తెలుస్తోంది.





## అందరినీ ఆకర్షించిన
# సోఫియా ఖురేషి, వ్యోమికా సింగ్



న్యూఢిల్లీ : పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా పాక్, పిఓకెలోని తొమ్మిది ఉగ్ర స్థావరాలపై భారత్ విజయవంతంగా దాడులు నిర్వహించింది. ఈ మెరుపు దాడులకు సంబంధించిన వివరాలను కేంద్ర రక్షణ, విదేశాంగ శాఖ బ్రీఫింగ్ ఇచ్చింది. భద్రతా బలగాలకు చెందిన ఇద్దరు మహిళలు దాడుల వివరాలు వెల్లడించడం అందరి దృష్టినీ ఆకర్షించింది. ఇంత క్లిష్టమైన ఆపరేషన్ గురించి దేశ ప్రజలకు వెల్లడించిన వారిద్దరే.. కల్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్.

### ఎవరీ కర్నల్ సోఫియా ఖురేషి..?

గుజరాత్‌కు చెందిన సోఫియా... బయోకెమిస్ట్రీలో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. ఆమెకు పీస్‌కీపర్‌గా అపార అనుభవం ఉంది. ఐరాసకు చెందిన పీస్‌మిషన్‌లో భాగంగా 2006లో కాంగోలో విధులు నిర్వర్తించారు. 2016లో పుణెలో జరిగిన ఎక్సర్‌సైజ్ 18 పేరిట భారత ఆర్మీకి చెందిన బృందానికి నాయకత్వం వహించి చరిత్ర సృష్టించారు. అది మల్టీ నేషనల్ మిలిటరీ ఎక్సర్‌సైజ్. దానిలో 18 దేశాలు పాల్గొన్నాయి. అన్ని దేశాలు ఉన్నప్పటికీ.. ఒక్క భారత్ బృందానికి మాత్రమే మహిళ నాయకత్వం వహించడం గమనార్హం. అప్పుడు బలగాలు శాంతి పరిరక్షక కార్యకలాపాలు, మందుపాతర తొలగింపుపై దృష్టిసారించాయి. 1990ల్లో సోఫియా సైన్యంలో చేరారు. ఆర్మీ సిగ్నల్ కోర్‌కు చెందిన అనుభవజ్ఞురాలైన ఆఫీసర్. మూడు దశాబ్దాల ప్రయాణంలో ఆమె రాజీలేని వైఖరి ప్రదర్శించారు. తొలి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ బిపిన్ రావత్ ఆమె పనితీరును ప్రశంసించారు.

### వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్..

వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ చిన్నప్పుడే పైలట్ కావాలని కలలు కన్నారు. చదువుకునే రోజుల్లో ఎన్‌సిసిలో చేరారు. ఇంజినీరింగ్ విద్యను పూర్తిచేసిన ఆమె.. తన కలకు తగ్గట్టుగా భారత వైమానిక దళంలోని హెలికాప్టర్ పైలట్‌గా వృత్తి జీవితాన్ని ప్రారంభించారు. 2019,డిసెంబర్ 18న ఫ్లయింగ్ బ్రాంచ్‌లో శాశ్వత కమిషన్ హోదా పొందారు. తన కుటుంబం నుంచి భారత భద్రతా బలగాల్లో చేరిన తొలి వ్యక్తి ఆమే కావడం విశేషం. జమ్ముకశ్మీర్, ఈశాన్య భారతంలోని ఎత్తైన ప్రాంతాలతో పాటు అత్యంత సవాలుతో కూడిన ప్రాంతాల్లో చేతక్, చీతా హెలికాప్టర్లను నడిపారు. పలు రెస్క్యూ ఆపరేషన్లలో పాలుపంచుకొన్నారు. బుధవారం జరిగిన మిలిటరీ బ్రీఫింగ్‌లో కేంద్రం అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్నట్లు కనిపిస్తోంది. దాడి ఎంతా పక్కాగా చేసిందో.. ఈ బ్రీఫింగ్ విషయంలోనూ అంతే పక్కాగా వ్యవహరించింది. ఇందులో పాల్గొన్న భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రి.. కశ్మీరీ పండిట్. ఈ ఆపరేషన్‌ను వ్యూహాత్మక విజయంగా చూడటమే కాకుండా కలిసికట్టుగా చేసిన కృషిగా కేంద్రం చూపాలనుకున్నట్లు వెల్లడవుతోంది. మహిళలు నాయకత్వం వహిస్తారు.. ప్రతీకారం తీర్చుకుంటారని వెల్లడి చేయాలనుకుందని తెలుస్తోంది. పలువురు పర్యాటకులను వారి భార్యల ముందు చంపినదానికి కౌంటర్‌గా ఈ ఇద్దరు మహిళలను ముందు వరుసలో నిలబెట్టారని పలువురు అభివర్ణిస్తున్నారు.

## ఇంతటితో ఆపొద్దు..
### ఆపరేషన్ సిందూర్‌పై ఉగ్రదాడిలో మరణించిన నేవీ ఆఫీసర్ భార్య హిమాన్షి నర్వాల్



**న్యూఢిల్లీ :** పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేయడమే లక్ష్యంగా బుధవారం తెల్లవారుజామున భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌పై పహల్గామ్‌ఉగ్ర దాడి మృతుడు, నేవీ అధికారి లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్ భార్య హిమాన్షి నర్వాల్ స్పందించారు. ఉగ్రవాదుల ఏరివేత చర్యను ఇంతటితో ఆపొద్దని అన్నారు. ఆపరేషన్ సిందూర్ ఉగ్రవాదులను తుదముట్టించడంలో ఆరంభం మాత్రమే కావాలని వ్యాఖ్యానించారు. నా భర్త రక్షణ బలగాల్లో పనిచేసేవాడు, శాంతిని కాపాడాలని, అమాయకుల జీవితాలకు రక్షణ కల్పించాలని భావించేవాడు. దేశంలో విధ్వంసం, ఉగ్రవాదం అంతం కావాలని కోరుకునే వాడు. ఇవాళ ఆపరేషన్ సిందూర్ నిర్వహించిన భారత సైనికులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అయితే నా అభ్యర్థన ఏమంటే ఉగ్రవాదులపై పోరాటాన్ని ఇంతటితో ఆపొద్దు. ఆపరేషన్ సిందూర్ దేశంలో ఉగ్రవాదాన్ని తదముట్టించడానికి ఆరంభం మాత్రమే కావాలి.' అని హిమాన్షి వ్యాఖ్యానించారు. ఉగ్రదాడికి కొద్ది రోజుల ముందే ఏప్రిల్ 16న వినయ్ నర్వాల్, హిమాన్షి నర్వాల్‌ల వివాహం జరిగింది. ఏప్రిల్ 19న రిసెప్షన్ నిర్వహించారు. ఏప్రిల్ 21న హనీమూన్ కోసం పహల్గాంకు వెళ్లారు. ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రదాడిలో వినయ్ నర్వాల్ మృతిచెందాడు. తన భర్తను పేరు అడిగి మరీ కాల్చిచంపారని హిమాన్షి నర్వాల్ చెప్పారు. కాగా పహల్గాం ఉగ్రదాడిలో వినయ్ నర్వాల్‌తో పాటు మరో 25 మంది మరణించారు. వారిలో ఒక నేపాలీ ఉన్నారు.

## ఆపరేషన్ సిందూర్‌తో 'భారతదేశం దూకుడుగా ఉంది'
### ఎన్‌సిపి (ఎస్‌పి) చీఫ్ శరద్ పవార్ ప్రశంస



న్యూఢిల్లీ : 'ఆపరేషన్ సిందూర్'ను ఎన్‌సిపి (ఎస్‌పి) చీఫ్ శరద్ పవార్ ప్రశంసించారు. ఉగ్రవాద దాడి తర్వాత ఏ దేశం కూడా మౌన ప్రేక్షకుడిగా ఉండకూడదని, ఆపరేషన్ సిందూర్‌తో 'భారతదేశం దూకుడుగా ఉంది' అనే సందేశం వ్యాపించినట్లయిందన్నారు. ఈ మేరకు పవార్ బుధవారం సామాజిక మాధ్యమంలో పోస్టు చేశారు. ఆపరేషన్ గురించి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో మాట్లాడానని, పరీక్షా సమయాల్లో ప్రభుత్వానికి పూర్తి మద్దతు ఇస్తానని హామీ ఇచ్చానని చెప్పారు. పహల్గామ్ ఉగ్రవాద దాడికి ప్రతీకారం తీర్చుకుంటూ, బుధవారం తెల్లవారుజామున భారత సాయుధ దళాలు పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లోని తొమ్మిది ఉగ్రవాద లక్ష్యాలపై క్షిపణి దాడులు చేశాయి. వాటిలో జైషే మొహమ్మద్ బలమైన బహవల్పూర్, మురిడ్కేలోని లష్కరే తోయిబా స్థావరం ఉన్నాయి. 'గత నెలలో జమ్ముకశ్మీర్‌లో ఏమి జరిగిందో అని దేశ ప్రజలలో ఆందోళన నెలకొంది. ఉగ్రవాదుల చేతిలో అమాయకులు మరణించారు. అటువంటి పరిస్థితిలో, ఏ దేశం కూడా కేవలం ప్రేక్షకుడిగా ఉండకూడదు' అని మాజీ రక్షణ మంత్రి పవార్ పుణెలో విలేకరులతో అన్నారు. ఈ ఉగ్రవాద దాడులకు ప్రతిస్పందించేటప్పుడు జాగ్రత్తగా చర్యలు తీసుకోవడం అవసరం. ఈ దాడులన్నీ పాకిస్తాన్ మద్దతు ఉన్న పిఓకెలోని ఉగ్రవాద శిబిరాలపై జరిగాయి అని పవార్ అన్నారు. ఈ శిబిరాల్లో మందుగుండు సామగ్రి, ఆయుధాలను కూడా నిల్వ చేశాయన్నారు. పాకిస్తాన్‌పై ఆర్థిక ఒత్తిడిని పెంచడానికి సింధు జల ఒప్పందాన్ని నిలిపివేయడం వంటి ఇటీవలి నిర్ణయాలను సమర్థిస్తూ, పహల్గామ్‌లో జరిగిన దాడి తర్వాత ఏ దేశం మౌనంగా ఉండకూడదని, ప్రధానమంత్రి, సాయుధ దళాలు తీసుకున్న చర్యలు సమర్థనీయం, సముచితమైనవన్నారు. పహల్గామ్ దాడిలో చాలా మంది మహిళలు తమ భర్తలను కోల్పోయినందున 'ఆపరేషన్ సిందూర్' అనేది సముచితమైన పేరు పెట్టారని ప్రశంసించారు. పహల్గామ్ దాడి తర్వాత దేశంలోని కొంత మంది కశ్మీరీ ప్రజలపై అనుమానంతో ఉన్నారని, అయితే కశ్మీరీలు స్వయంగా దేశానికి మద్దతుగా నిలిచి ఉగ్రవాద దాడిని తీవ్రంగా ఖండించారని కూడా ఆయన పేర్కొన్నారు.

## 2040 నాటికి చంద్రుడిపై
# భారతీయ వ్యోమగ్యామి
### ప్రధానమంత్రి నరేంద్రమోదీ దృఢవిశ్వాసం
### గ్లోబల్ స్పేస్ ఎక్స్‌ప్లోరేషన్ కాన్ఫరెన్స్-2025లో ప్రధాని వీడియో సందేశం



**న్యూఢిల్లీ :** అంతరిక్షంలో భారత్ అద్భుత విజయాలను సాధిస్తున్నదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు. 2040 నాటికి చంద్రుడిపై భారతీయ వ్యోమగామి అడుగుపెడతాడన్న దృఢవిశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. అంతరిక్ష పరిశోధనా రంగంలో భారతదేశం నూతన విశ్వాసంతో ముందుకు సాగుతోందన్నారు. దాని వ్యోమగాముల పాదముద్రలు చంద్రుడిపై ఉంటాయని, అంగారక గ్రహం, శుక్రగ్రహం కూడా దేశ రాడార్ అన్వేషణ మిషన్లలో ఉన్నాయని ప్రధాని తెలిపారు. ఆయన బుధవారం ఇక్కడ జరిగిన గ్లోబల్ స్పేస్ ఎక్స్‌ప్లోరేషన్ కాన్ఫరెన్స్ (జిఎల్ఇఎక్స్2025)కు ముందస్తు వీడియో రికార్డ్ ద్వారా పంపించిన తన సందేశంలో ఈ విషయాలను నొక్కిచెప్పారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారతదేశం గురించి చెబుతూ అన్వేషణతో పాటు సాధికారత సాధన లక్ష్యంగా పురోగమిస్తున్నదన్నారు. 2035నాటికి భారత అంతరిక్ష స్టేషన్‌ను ఏర్పాటు చేయడమే కాకుండా 2040నాటికి భారతీయ వ్యోమగామి చంద్రుడిపై అడుగుపెట్టడానికి ప్రణాళికల జాబితాను రూపొందించామని చెప్పారు. భారతదేశ అంతరిక్ష ప్రయాణం ఇతరులతో పోటీపడేందుకు పరుగెత్తడం కోసం కాదు. అది ఉన్నత స్థానానికి, మరింత ఉన్నత స్థానానికి కలిసికట్టుగా చేరుకోవాలన్నదే లక్ష్యం. మానవత్వంతో కూడిన మంచి రికార్డు కోసం మేము ఉమ్మడి లక్ష్యాన్ని పంచుకుంటాం' అని ప్రధానమంత్రి మోదీ మంగళవారం రికార్డు చేసిన తన సందేశంలో స్పష్టం చేశారు. భారత్ మంగళ్‌యాన్, చంద్రయాన్ లాంటి ప్రయోగాలను విజయవంతంగానిర్వహించిందని తెలియజేశారు. చంద్రుడిపై నీటి జాడ ఉన్నదని చంద్రయాన్ ద్వారా గుర్తించామన్నారు. దక్షిణాసియా కోసం జి20 ఉపగ్రహాన్ని ప్రయోగించామని గుర్తుచేశారు. భారతీయ వ్యోమగామి త్వరలోనే రోదసీలో పర్యటిస్తాడని ప్రధాని నరేంద్రమోదీ చెప్పారు. భారతదేశ అంతరిక్ష ప్రయాణం గురించి ఆయన మాట్లాడుతూ 1963లో ఒక చిన్న రాకెట్ ప్రయోగంతో భారత్ అంతరిక్ష ప్రయాణం ప్రారంభమైందన్నారు. చంద్రుడి దక్షిణ ధృవం వద్ద అడుగుపెట్టిన తొలిదేశంగా భారత్ అవతరించిందని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. 'మన అంతరిక్ష ప్రయాణం అద్భుతంగా ఉంది. మన రాకెట్లు అత్యంత శక్తితో కూడిన భారాన్ని మోస్తాయి. అవి 1.4 బిలియన్ల మంది భారతీయుల కలలను మోస్తాయి.భారతదేశం ఎన్నో మైలురాళ్లను అధిగమించి విజయాలను సొంతం చేసుకుంది. మానవ స్ఫూర్తి గురుత్వాకర్షణను ధిక్కరించగలదని అవి రుజువుచేశాయి' అని మోదీ చెప్పారు.



# జనరల్

STATE & REGIONAL NEWS



మిసవరల్డ్ పోటీల నేపథ్యంలో రంగు రంగుల లైట్లతో హైదరాబాద్‌ను ముస్తాబు చేసిన అధికారులు



## రైల్వే ఉద్యోగుల్లో జవాబుదారీతనం పెంచాలి

ద.మ రైల్వే జిఎం అరుణ్‌కుమార్ జైన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రైల్వే ఉద్యోగుల్లో క్రమశిణతో పాటు జవాబుదారీతనం పెంచాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ పేర్కొన్నారు. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం ఆడిటోరియంలో దక్షిణ మధ్య రైల్వే,విజిలెన్స్ విభాగం ఆధ్వర్యంలో రైల్వేలలో డి.ఎ.ఆర్ (క్రమశిక్షణ మరియు అప్పీల్ రూల్స్) పై ఏర్పాటు చేసిన సెమినార్‌లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు.డి.ఎ.ఆర్ కేసులను ప్రాసెస్ చేసేటప్పుడు, విచారణ నిర్వహించేటప్పుడు అనుసరించాల్సిన సరైన విధానాలపై అవగాహన చాలా ముఖ్యమైనదన్నారు. తరచుగా, క్రమశిక్షణా చర్యల సమయంలో జరిగే విధానపరమైన లోపాల వలన అడ్మినిస్ట్రేషన్ ఎటువంటి ముగింపు చర్య తీసుకోలేకపోతాయని తెలిపారు.ప్రధానంగా దోషరహిత క్రమశిక్షణా చర్యలను చేపట్టడంపై అవగాహన కల్పించడం లక్ష్యంగా పెట్టుకుంది. దోషరహిత ఛార్జ్ షీట్లను తయారు చేయడం, ప్రస్తుతం ఉన్న నియమాలను పాటించడం, విచారణలు నిర్వహించడానికి సరైన విధానాలు మరియు జరిమానాలు విధించడం వంటి అంశాలపై చర్చించారు. దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ జనరల్ మేనేజర్ కోఆర్డినేట్ , జనరల్ మేనేజర్ కార్యదర్శి మల్లాది శ్రీనివాస్ మాట్లాడుతూ డిఎఆర్ కేసు లోపాలు లేని నిర్వహణ అనే అంశంపై వివరించారు.


## ఉద్యోగుల పట్ల బెదిరింపు ధోరణి సరికాదు

మాజీమంత్రి, బిఆర్ఎస్ నేత వి.శ్రీనివాస్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉద్యోగుల పట్ల బెదిరింపు దోరణి సరికాదని మాజీమంత్రి, బిఆర్ఎస్ నేత వి.శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన మంత్రుల కమిటీ ఉండగా అధికారుల కమిటీ ఎందుకు అని ప్రశ్నించారు. మంత్రుల కమిటీ ఉండగా, అధికారులతో మరో కమిటీ ఏర్పాటు చేయడమంటే మంత్రులను అవమానపరిచినట్టే అవుతుందన్నారు. హైదరాబాద్ తెలంగాణ భవన్ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఉద్యోగ సంఘాల మాజీ నాయకులతో కలిసి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడారు. 2 శాతమే ఉన్నారని ఉద్యోగులను అవమానిస్తున్నారన్నారు. కెసిఆర్ హయాంలో ఉద్యోగుల సమస్యలు సత్వరమే పరిష్కారమయ్యేలా చూశామన్నారు. వంద రోజుల్లో పిఆర్‌సి ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందన్నారు. డిఏలు వెంటనే విడుదల చేస్తామని ఇప్పటి వరకు చేయలేదన్నారు. అనేక హామీలు నెరవేరనందుకే ఉద్యోగులు ఆందోళన కార్యాచరణ ప్రకటించారన్నారు. కచ్చితంగా ఉద్యోగుల డిమాండ్ల సాధనకు వారి వెంట ఉంటామన్నారు. సిఎం స్వయంగా జోక్యం చేసుకుని ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఉద్యోగుల డిమాండ్ల సాధన కోసం ఉమ్మడి కార్యాచరణ రూపొందిస్తామన్నారు. శాసన మండలి మాజీ ఛైర్మన్ స్వామి గౌడ్ మాట్లాడుతూ ఉద్యోగులు ప్రజలు వేర్వేరు కాదని, ఉద్యోగులను తిడితే తమకు భాధ కలుగుతోందన్నారు. ఉద్యోగులు 2 శాతమే ఉన్నా రాష్ట్రానికి ఆదాయ వనరులు సమకూర్చడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఉద్యోగుల బోనస్ అడగటం లేదని, రావాల్సిన డిఏలు, ప్రయోజనాల కోసం పోరాడుతున్నారన్నారు. ఉద్యోగుల 54 డిమాండ్‌లలో 36 డబ్బులతో సంబంధం లేనివే అన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ఉద్యోగుల డిమాండ్‌ల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. మాజీ ఎంఎల్‌సి పాతూరి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులతో చర్చలు జరపకుండా సిఎంకు అంత ఉక్రోషం ఎందుకని, రిటైర్డ్ అయిన ఉద్యోగులకు కూడా బెనిఫిట్స్ రాకుంటే ఉద్యోగ సంఘాలు ఏం చేస్తున్నాయన్నారు. ఉద్యోగుల జెఎసి మాజీ ఛైర్మన్ జి. దేవీప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగులపై సిఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. అధికారులతో కమిటీ కాలయాపన కోసమే అన్నారు. ఉద్యోగుల డిమాండ్‌ల సాధనకు తమతో కలిసి వచ్చేవారితో ఉద్యమిస్తామన్నారు. ఈ సమావేశంలో సుమిత్ర ఆనంద్, విష్ణువర్ధన్ రావు, కళ్యాణ్ కుమార్, భుజంగ రావు, హామీద్ పాల్గొన్నారు.

## ఏజెన్సీలో మంత్రి సుడిగాలి పర్యటన

* పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు
* సన్నబియ్యం లబ్ధిదారుని ఇంట్లో మధ్యాహ్న భోజనం
* ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం
* అర్హుల చెంతకే ప్రభుత్వ పథకాలు మంత్రి పొంగులేటి



**ప్రజాపక్షం/భద్రాచలం:** రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఏజెన్సీ ప్రాతంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులు ప్రారంభించడంతో పాటు శంఖుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ముందుగా చర్ల మండల పరిధిలోని సుబ్బంపేటలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామపంచాయితీ కార్యాలయాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం సన్నబియ్యం లబ్ధిదారుడు వాసం ముసలయ్య ఇంట్లో ఆయనతో పాటు పలువురు ప్రభుత్వం అందిస్తున్న సన్నబియ్యంతో మధ్యాహ్నభోజనం చేశారు. అనంతరం చర్ల లక్ష్మీ కాలనీలో రూ.1కోటి 16 లక్షలతో వ్యయంతో నిర్మించిన నూతన గ్రంథాలయ భవనాన్ని మంత్రి రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. అదే విధంగా తేగడలో ఇందిరమ్మ ఇళ్లకు శంకు స్థాపన చేశారు. దుమ్ముగూడెం మండల పరిధిలోని చిన్నబండిరేవు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేసి సిసి రోడ్డును ప్రారంభించారు. దుమ్ముగూడెం మండల పరిధిలోని సింగవరంలో హై లెవల్ వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదే విధంగా భద్రాచలం మండల పరిధిలోని చర్లరోడ్‌లో సిసి రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి తాతగుడి సెంటర్‌లోని గ్రంథాలయ భవన సముదాయంలో ఐటిడిఎ నిధులతో నిర్మించిన రీడింగ్ హాల్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యేయమని, ప్రజలకు ఇచ్చిన మాటలను తూచతప్పకుండా నిలబెట్టుకుంటుందని అన్నారు. కల్లబొల్లి మాటలతో ప్రజలను మాయ చేసేందుకు కొందరు ఎదురు చూస్తున్నారని, అలాంటి వారి మాటలు నమ్మొద్దన్నారు. అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నామని మంత్రి పొంగులేటి చెప్పారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న నిరుపేదలందరికీ ఆహార భద్రత కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు.

## ఐటిఐ స్థాయి పెంచేందుకు

# రూ.60వేల కోట్లతో జాతీయ పథకం

కేంద్రమంత్రివర్గం ఆమోదం

**న్యూఢిల్లీ :** భారత పారిశ్రామిక శిక్షణాసంస్థ (ఐటిఐ) స్థాయిని అభివృద్ధి చేసేందుకు వీలుగా రూ.60,000 కోట్లతో ఒక జాతీయ పథకానికి కేంద్రమంత్రివర్గం బుధవారంనాడు ఆమోదం తెలియజేసింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం దేశంలోని ఐదు జాతీయ నైపుణ్య కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు సమ్మతించింది. దేశ పారిశ్రామిక శిక్షణాసంస్థల స్థాయిని పెంచేందుకు వీలుగా ఈ నైపుణ్య కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. వృత్తివిద్యలో కాలానుగుణంగా సరికొత్త మార్పులు తీసుకువచ్చి ఐటిఐ విద్యప్రమాణాలను, స్థాయిని పెంచేందుకు వీలుగా ఈ కేంద్రాలు పనిచేస్తాయి. దేశవ్యాప్తంగా 1000 ప్రభుత్వ ఐటిఐ కేంద్రాలలో ఈ పథకం కింద విద్యాప్రమాణాలస్థాయి పెంచుతారు. వాణిజ్యానికి సంబంధించిన కోర్సులలో పునఃసమీక్ష చేసి కాలానుగుణమైన మార్పులు ప్రవేశపెడతారు. ఈ సంస్థలలో ఐదు జాతీయ నైపుణ్య శిక్షణా సంస్థలతో పాటు ఐదు జాతీయ నైపుణ్య కేంద్రాలను కూడా ఏర్పాటు చేస్తారు. 2024–25 బడ్జెట్‌లో కేంద్రం ప్రకటించిన పథకం కింద 2025–26 బడ్జెట్‌లో రూ.60,000 కోట్ల ప్రణాళికతో దీనిని అమలు చేస్తారు. ఇందులో కేంద్రం వాటా రూ.30,000 కోట్లు, రాష్ట్రం వాటా రూ.20,000 కోట్లు, సహభాగస్వామ్యపెట్టుబడి కింద రూ.10,000 కోట్లు ఉంటాయి. ఆసియా అభివృద్ధి బ్యాంకు, ప్రపంచ బ్యాంకు వాటా కింద 50 శాతం ఉంటుంది. ప్రభుత్వ అధీనంలో ఉన్న ఐటిఐలకు ఈ పథకం వర్తిస్తుంది. ఐదేళ్ళకాలానికిగాను 20 లక్షల మంది యువకులకు ఈ కోర్సులద్వారా శిక్షణలు ఇస్తారు. మానవ వనరుల సామర్థ్యాలను పెంపొందిస్తారు. ఈ పథకం కింద మౌలిక సదుపాయాలను గణనీయంగా అభివృద్ధి చేస్తారు. శిక్షణా సదుపాయాలు పెంచుతారు. 50,000 మంది ట్రైనర్స్‌ను ఏర్పాటు చేస్తారు. దీర్ఘకాలంలో ఎదురయ్యే సవాళ్ళను పరిష్కరించేందుకు వీలైన మౌలిక సదుపాయాలను కూడా సకూరుస్తారు. మానవవనరుల స్థాయిని, వాని పనిసామర్థ్యాన్ని పెంచుతారు. చాలా ఎక్కువ డిమాండ్‌తో వృద్ధి చెందుతున్న రంగాలలో నైపుణ్యం కొరత ఏర్పడుతోంది. ఈ నైపుణ్యం కొరత తీర్చేందుకు చర్యలు తీసుకుంటారు. వికసిత్ భారత్ దార్శనిక దృక్పథంకింద 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేందుకు వీలుగా ఈ పథకం దోహదపడుతుంది.



**తిరుపతిసహా ఐదుచోట్ల అత్యాధునిక ఐఐటి రీసెర్చ్‌పార్కులు**

దేశవ్యాప్తంగా ఉన్న ఐదు కొత్త ఐఐటిలలో మౌలిక సదుపాయాల సామర్థ్యాన్ని పెంపొందించడంతోపాటు వాటిని విస్తరించాలని కేంద్రమంత్రివర్గం తీర్మానించింది. దేశంలో రాబోయేకాలో నైపుణ్యాన్ని విస్తరించేందుకు, నవీన ఆవిష్కరణలకు వీలుగా కొత్త తరాన్ని తయారు చేసేందుకు మంత్రివర్గం నైపుణ్యాన్ని పెంపొందించేందుకు తీర్మానం చేసింది. ఈ ఐఐటిలలో కొత్తగా 130 ఫ్యాకల్టీ పోస్టులు కూడా కొత్తగా ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

భారతపారిశ్రామికరంగాన్ని మరింత శక్తిమంతంగా తీర్చిదిద్దేందుకు వీలుగా వాటికి అనుసంధానంగా ఉండే మరో ఐదు కొత్త రీసెర్చ్ పార్కులను కూడా ఏర్పాటు చేయాలని మంత్రివర్గం తీర్మానించింది. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి, కేరళలోని పాలక్కాడ్, చత్తీస్‌గఢ్‌లోని భిలాయ్, కేంద్రపాలిత ప్రాంతం జమ్మూకశ్మీరులోని జమ్మూలో, కర్ణాటకలోని ధార్వాడ్‌లో ఈ కొత్త అత్యాధునిక రీసెర్చ్ పార్కులు ఏర్పాటు చేస్తారు. ఈ ఐఐటిలలో విద్యార్థుల సంఖ్యను రాబోయే నాలుగు సంవత్సరాలలో 6,500కు పైగా పెంచుతారు. మొదటి సంవత్సరంలో 1,364 మంది విద్యార్థులను, రెండో సంవత్సరంలో 1,738 మంది విద్యార్థులను, మూడోసంవత్సరంలో 1,767 మంది విద్యార్థులను, నాలుగో సంవత్సరంలో 1,707 విద్యార్థులను పెంచుతారు. అండర్‌గ్రాడ్యుయేట్, పోస్టుగ్రాడ్యుయేట్, పిహెచ్‌డి కార్యక్రమాల కింద వీటిని విస్తరిస్తారు. ఈ ఐదు ఐఐటిలు నిర్మాణాలు పూర్తయి విద్యావిధానం పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే మొత్తం 13,687 మంది విద్యార్థులకు ఇందులో చదువుకునే అవకాశాలు వస్తాయి. ప్రస్తుతం ఈ ఐఐటిలలో 7,111 మంది విద్యార్థులు ఉన్నారు. దీని వల్ల ప్రత్యక్ష ఉపాధి పెరుగుతుంది. ఫ్యాకల్టీ, పాలనావిభాగం సిబ్బంది, పరిశోధకులు, మద్దతుగా ఉండే సిబ్బంది సంఖ్య,విద్యార్థులు గణనీయంగా పెరుగుతారు. ఐఐటి క్యాంపస్‌లు విస్తరించడంవల్ల బయటివారికి మరింత ఉపాధి లభిస్తుంది. ఐఐటిల విస్తరణవల్ల కొత్తగా ఇళ్ళకు డిమాండ్ పెరుగుతుంది, సేవలకు డిమాండ్ పెరుగుతుంది. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ కొత్త బడ్జెట్‌లో ఈ మేరకు కేటాయింపులు చేశారు.

**విద్యుత్ కేంద్రాలకు బొగ్గు కేటాయింపుల సవరణ**

విద్యుత్ రంగానికి దీర్ఘకాలిక, స్వల్పకాలిక బొగ్గు అవసరాలు తీరేందుకు వీలుగా కేంద్రమంత్రివర్గం సవరించిన ''శక్తి'' (హార్నెసింగ్ అండ్ ఎలోకేటింగ్ కోయల ట్రాంస్పెరెంట్లీ ఇన్ ఇండియా) పథకాన్ని ఆమోదించింది. ఆర్థిక వ్యవహారాలపై ఏర్పాటుచేసిన కేంద్రకమిటీ (సిసిఇఎ) ప్రధానంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన సమావేశమై ఈ ఆమోదం తెలియజేసింది. విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు దీర్ఘకాలిక, స్వల్పకాలిక అవసరాలనిమిత్తం బొగ్గు కొరత లేకుండా ఉండటంకోసం ఈ శక్తి పథకంలో సంక్లిష్టతను తొలగించింది. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల అధీనంలో ఉండే ఉత్పత్తికేంద్రాలు, స్వతంత్ర విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు ఎలాంటి బొగ్గుసరఫరా సమస్యలు లేకుండా మంత్రివర్గం ఈ మార్పులు తీసుకువచ్చింది.

## లంచాలు అడుగుతాం.. తీసుకుంటాం

# ఎసిబికి పట్టిస్తే పనిచేయం

ఎక్సైజ్ శాఖలో వింత పోకడ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** లంచాలు అడుతాం..తీసుకుంటాం..ఎవరైనా అవినీతి నిరోధక శాఖ(ఎసిబి)కి ఫిర్యాదు చేసి పట్టిస్తే మాత్రం తాము విధులను బహిష్కరిస్తామంటున్నారు. ఈ వింత పోకడ ఎక్సైజ్ శాఖలోని మినిస్ట్రీయల్ అధికారులు, సిబ్బందిలో నెలకొనడం విడ్డూరంగా ఉంది. మూడు రోజుల క్రితం హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌కు చెందిన టికె, 18 నెలల జీతాల బిల్లులు చెల్లించేందుకు వికారాబాద్ జిల్లా ఎక్సైజ్ విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న వికెబి శ్రీధర్ లంచం డబ్బులు తీసుకుంటూ ఎసిబికి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడి జైలు పాలయ్యారు. ఈ చర్యను వ్యతిరేకిస్తూ శ్రీధర్‌కు మద్దతుగా ఎక్సైజ్ మనిస్ట్రీయల్ ఉద్యోగుల సంఘం నేతలు విధులు బహిష్కరిస్తున్నట్లుగా ఎక్సైజ్ కమిషనర్ హరి కిరణ్‌కు లేఖను అందజేశారు. శ్రీధర్ మంచివాడు..లంచం డబ్బులు అడగలేదని ఉద్యోగుల సంఘం నేతలు మీడియాకు వివరించారు. అయితే అసలు వాస్తవాల్లోకి వెళితే శ్రీధర్ లంచం డబ్బులు అడిగినట్లు స్పష్టమైన ఫోన్‌రికార్డింగ్‌లు ఎసిబి అధికారుల వద్ద ఉన్నాయి. హెడ్ కానిస్టేబుల్ నుంచి 11 శాతం లంచం డబ్బులు అంటే సుమారు రూ.90,000 లంచం డిమాండ్ చేసినట్లు శ్రీధర్ వాయిస్ రికార్డులు ఉన్నాయి. లంచం డబ్బుల కోసం హెడ్ కానిస్టేబుల్‌కు శ్రీధర్ కనీసం వందకుపైగా ఫోన్‌లు చేసినట్లు కూడా సాక్ష్యాధారాలు ఉన్నాయి. వికారాబాద్‌లో ఎక్సైజ్ విభాగంలో




పనిచేస్తున్న సుమారు 50 మంది కానిస్టేబుల్స్ కూడా గతంలో శ్రీధర్‌కు డబ్బులు ఇస్తేనే బిల్లులు పాస్ చేసేవాడని ఆరోపించారు. ఇంత అవినీతి చరిత్ర కలిగిన శ్రీధర్‌కు ఉద్యోగ సంఘాలు ఎందుకు మద్దతు తెలిపాయో విస్మయం వ్యక్తం అవుతుంది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.. ఎక్సైజ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ మహబూబ్‌నగర్ నుంచి వికారాబాద్‌కు 2022లో బదిలీ అయ్యాడు.

అప్పటి నుంచి వికారాబాద్ జిల్లాలో తాండూరు ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. అయితే అతనికి రావాల్సిన నెలసరి జీతాలు, టిఎ బిల్లులు మాత్రం రాలేదు. ఇలా 18 నెలల వరకు అతనికి రావాల్సి జీతభత్యాలు రాలేదు. ఇవీ మంజూరు చేయాలంటూ సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వికెబి శ్రీధర్ లంచం డబ్బులు డిమాండ్ చేశాడు. మంజూరు అయ్యే బిల్లులో 11 శాతం ఇవ్వమని పలుమార్లు బాధితుడు శ్రీనివాస్‌కు శ్రీధర్ ఫోన్ చేసి వేధించాడు. అతని వేధింపులు భరించలేని శ్రీనివాస్ ఎసిబికి ఫిర్యాదు చేశాడు. మూడు రోజుల క్రితం శ్రీనివాస్ నుంచి రూ.8000 లంచం తీసుకుంటుండగా శ్రీధర్‌ను ఎసిబి అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. తాను లంచం డబ్బులు అడిగిన మాట వాస్తవమే నని ఎసిబి అధికారులకు ఇచ్చిన వాంగ్మూలంలో కూడా శ్రీధర్ తన తప్పును ఒప్పుకున్నాడు. అంతకుముందు నాలుగు రోజుల క్రితమే శ్రీధర్ మాటలను ఎసిబి అధికారులు రికార్డు చేశారు. పూర్తి సాక్ష్యాధారాలు అందిన తరువాతనే శ్రీధర్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా ఎసిబి అధికారులు పట్టుకున్నారు. శ్రీధర్ లంచం అడిగినట్లు ఇంత స్పష్టంగా ఉంటే ఉద్యోగ సంఘా నేతలు మాత్రం అతనికి మద్దతుగా విధులను బహిష్కరిస్తున్నట్లు ఏకంగా ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్‌కు లేఖ ఇవ్వడం విడ్డూరంగా ఉంది. అయితే ఎక్సైజ్ శాఖలోని అన్ని జిల్లాలలో సిబ్బంది, అధికారుల బిల్లులు మంజూరు చేయాలంటే లంచం డబ్బులు ఇవ్వాల్సిందేనని పలువురు ఆరోపిస్తున్నారు. ఇది కొత్తేమికాదు. అయితే ఎసిబికి పట్టించడమే కొత్త అనే వాదన వినిపిస్తుంది. అందరు లంచాలు ఇచ్చినట్లు శ్రీనివాస్ కూడా లంచం ఇచ్చివుంటే ఇదంతా జరిగి ఉండేది కాదని అభిప్రాయపడుతున్నారు.

## నేటి నుంచి 14 వరకు రాష్ట్ర వ్యాప్తంగా డ్రగ్స్‌పై 'స్పెషల్ డ్రైవ్'

ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసిం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** యువత,ప్రజలకు ప్రాణాంతంగా మారిన గంజాయి, డ్రగ్స్‌ను పూర్తిస్థాయిలో అరికట్టడంలో ఎక్సైజ్ శాఖ కీలక భూమిక పోషించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసిం అన్నారు. నాంపల్లిలోని ఆబ్కారీ భవన్‌లో ఎస్‌టిఎఫ్ టీమ్లతో ఆయన ప్రత్యేకంగా సమావేశమాయ్యారు. గంజాయి, డ్రగ్స్‌ను పూర్తిగా నిర్మూలించేందుకు గురువారం నుంచి 14వ తేదీ వరకు తెలంగాణలోని అన్ని జిల్లాల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని షానవాజ్ ఖాసిం ఆదేశించారు. అలాగే ఎన్‌డిపిఎస్‌ను అరికట్టడానికి తలపెట్టిన ఈ స్పెషల్ డ్రైవ్‌లో ప్రతి ఒక్కరుశక్తి వంచనలేకుండా దాడుల్లో పాల్గొని నార్కోటిక్ డ్రగ్స్‌ను పట్టుకొవడంలో కృషీ చేయాలని ఆయన పిలుపునిచ్చారు. గంజాయి, డ్రగ్స్‌తోపాటు ఆల్ప్రోజోలం, డైజోపామ్ రవాణ, అమ్మకాలు, వినియోగం, దిగుమతుల పై నిఘా పెట్టి పట్టుకోవాలని డైరెక్టర్ సూచించారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో యంత్రాంగం పని తీరే ప్రమాణికంగా నిలుస్తుందని డైరెక్టర్ అభిప్రాయ పడ్డారు. గత సంవత్సరం ఎన్ఫొర్స్మెంట్ అధ్వర్యంలో జనవరి, జూన్, సెప్టెంబర్ నెలల్లో ఎన్‌డిపిఎస్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని అన్నారు. ఈ మూడు స్పెషల్ డ్రైవ్‌లో 383 కేసులు నమోదు అయ్యాయని, 644 నిందితులను అరెస్టు చేశామని, 2639 కేజీల గంజాయి, 99.23 గ్రాముల ఎండిఎంఎ, 6.33 కేజీల ఆల్ప్రోజోలంను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. ఈ స్పెషల్ డ్రైవ్ లో గతంలో కంటే మెరుగైన ఫలితాలను సాధిస్తామని అన్నారు.



## ఘనంగా దామోదరం సంజీవయ్య వర్ధంతి వేడుకలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మాజీ ఎంపి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వి.హనుమంతరావు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య53వ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా ఎల్‌బి స్టేడియం ముందు ఉన్న దామోదరం సంజీవయ్య విగ్రహానికి మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత విహెచ్ ,బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్ నివాళులు అర్పించారు. అనంతరం దామోదరం సంజీవయ్య ఘాట్ వద్ద కూడా నివాళులు అర్పించారు. హనుమంతరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా ఉండి ఉండడానికి సొంత ఇల్లు కూడా లేదని యువతకు ఆదర్శమని మహానీయుడని ఆయనని కొనియాడాడు. పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ సామాజిక న్యాయానికి కాంగ్రెస్ పార్టీ చాంపియన్ ఆనాడే ఒక నిరుపేద దళితుడిని కాంగ్రెస్ పార్టీ ఎఐసిసి అధ్యక్షుడిని చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ గల నాయకుడిగా దామోదరం సంజీవయ్య మా అందరికీ ఆదర్శం అని అన్నారు. వారి పేరు ను కర్నూలు జిల్లాకి పెట్టాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి లేఖ రాస్తాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మణ్ యాదవ్ కైలాష్ లక్ పతి గౌడ్ , గరుగంటి రమేష్ నాగభూషణం. శంభుల శ్రీకాంత్ గౌడ్ ఆది అవినాష్ ఎస్‌సి సెల్ రమేష్ మహేష్ రాజ్ కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎపిలో నాలుగు సైనిక్ స్కూళ్లు ఉంటే తెలంగాణకు ఒక్కటీ లేదా?

మాజీ ఎంపి బి.వినోద్‌కుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నాలుగు సైనిక్ స్కూళ్లు ఉంటే తెలంగాణకు ఒక్కటి లేకపోవడం ఎంత దుర్మార్గం అని మాజీ ఎంపి బి.వినోద్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాంగ్రెస్, బిజెపి ఎంపిలు ఉండి ఒక్క సైనిక్ స్కూల్‌ను సాధించలేక పోయారని అన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఎపిలో కోరుకొండ ,పులివెందుల ,కలికిరి లో సైనిక్ స్కూల్స్ ఉన్నాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన కొత్తలోనే సిఎం కేసీఆర్ సైనిక్ స్కూల్ కోసం కేంద్రం పై ఒత్తిడి తెచ్చారన్నారు.వరంగల్ కు సైనిక్ స్కూల్ మంజూరు చేసినా అనేక షరతులు పెట్టారని ఆరోపించారు.రాష్ట్ర ప్రభుత్వమే సైనిక్ స్కూల్ కు అన్నీ ఖర్చులు భరించాలంటే కెసిఆర్ నిరసన తెలిపారని,కేంద్రానికి సుదీర్ఘమైన ఉత్తరం రాశారన్నారు.సిఎంగా రేవంత్ రెడ్డి భాధ్యతలు చేపట్టిన వెంటనే సైనిక్ స్కూల్ గురించి తాను లేఖ రాస్తే హేళన చేస్తూ మాట్లాడారన్నారు. బొల్లారం లో సైనిక్ స్కూల్ వస్తుందని చెప్పారు ..ఇప్పటివరకు అతి లేదు .గతి లేదన్నారు. సైనిక్ స్కూళ్లలో తెలంగాణ విద్యార్థులకు రిజర్వేషన్లు పునరుద్ధరించకపోతే న్యాయ స్థానాలను ఆశ్రయిస్తామని అన్నారు.

## తెలుగు భాషను కాపాడుకుందాం

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్

చర్చాగోష్టిలో పలువురు కవులు, రచయితలు

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** శ్రీ రాజరాజ నరేంద్రాంధ్ర భాషానిలయంలో తెలుగు భాషా పరిరక్షణ సమితి, ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో తెలుగు భాషను సంరక్షించే దిశగా చర్చాగోష్టిని కవులు, రచయితలు, తెలుగు భాషాభి మానులతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ కవి, విమర్శకులు, విశ్రాంత ప్రధానాచార్యులు అచార్య బన్న అయిలయ్య అధ్యక్షత వహించి మాట్లాడారు. ఇటీవల ఇంటర్మీడియట్ విద్యలో రెండవ ఐచ్ఛికంగా సంస్కృతాన్ని తీసుకోవాలని బోర్డు జారీ చేసిన ఉత్తర్వు తెలుగు భాషను ఇంటర్మీడియట్ విద్యలో లేకు ండా చేసే కుట్రగా భావించాలన్నారు. తెలుగు భాషా స్థానంలో తెలుగేతర భాషలను ప్రవేశ పెట్టి తెలుగు భాషా వికాసాన్ని అడ్డుకోవడం సరికాదని పేర్కొన్నారు. కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహిత అంపశయ్య నవీన్ మాట్లాడుతూ దేశంలోని అనేక రాష్ట్రాలలో తెలుగు మాట్లాడేవారు చాలా మంది ఉన్నారని, దేశ భాషలందు తెలుగు లెస్స అని శ్రీకృష్ణ దేవరాయలు అన్నారని గుర్తు చేస్తూ ఇటువంటి భాషను పాలకులు నిర్లక్ష్యం చేయడం విచారకరమైన విషయమని పేర్కొన్నారు. ప్రముఖ కవి పొట్లపల్లి శ్రీనివాస రావు మాట్లాడుతూ మాతృ భాష మృత భాష కాకూడదని అది అమృత భాష అని, దీనిని కాపాడుకోవలిసిన బాధ్యత అందరిదని అన్నారు.

ప్రజా పాలనకు సంబంధించిన సంక్షేమపథకాలు ప్రజలలోకి చేరవేసే వాహిక సరళమైన సాహిత్యం, పాటల రూపంగా తెలుగులోనే ప్రజలవద్దకు చేరుతుందని, అట్లాంటి తెలుగు భాషను కాదని సంస్కృత భాషను ప్రవేశపెట్టడం సమంజసం కాదని పేర్కొన్నారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన కవులు, రచతలు, తెలుగు భాషాభిమానులతో చర్చాగోష్టి నిర్వహించి పలు ప్రతిపాదనలను ఏకగ్రీవంగా తీర్మానించారు.ఈ కార్యక్రమంలో గిరిజామనోహర్ బాబు, నాగిళ్ళ రామశాస్త్రీ, బిల్ల మహేందర్, పి. చందు, విఆర్ విద్యార్థి,దహగం సాంబ మూర్తి, డా. మంథని శంకర్. డా.లగడపాటి రాజ్‌కుమార్, తదితరులు పాల్గొని మాట్లాడారు.

## శంషాబాద్‌లో ఆపరేషన్ అబ్యాస్ మాక్ డ్రిల్

ప్రజాపక్షం/గండిపేట్: శంషాబాద్‌లో బుధవారం ఆపరేషన్ అబ్యాస్ మాక్ డ్రిల్ నిర్వహించారు. ఆర్‌జిఐ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఓల్డ్ పోలీస్ స్టేషన్, రాళ్లగూడ, బస్టాండ్ ప్రాంతాల్లో ఆపరేషన్ సిందూర్ విజయోత్సవం, మాక్ డ్రిల్స్ నిర్వహించడం జరిగిందని శంషాబాద్ డిసిపి రాజేష్ తెలిపారు. బుధవారం ఆపరేషన్ అబ్యాస్ మాక్ డ్రిల్‌లో భాగంగా రెవెన్యూ, మున్సిపల్,మండల పరిషత్, తదితర శాఖల సహకారంతో పోలీస్ డిపార్ట్మెంట్ సమన్వయ సమావేశం నిర్వహించడం జరిగిందని డిసిపి రాజేష్ వివరించారు. అందులో భాగంగా ఎయిర్ స్ట్రైక్ జరిగితే తీసుకోవలసిన జాగ్రత్తలు, సెల్లార్ లోకి వెళ్లడం, గ్యాస్, నెట్ కనెక్షన్ ఆఫ్ చేసుకోవడం వంటి సూచనలు, సలహాలు చేసినట్లు పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై డిసిపి రాజేష్ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎసిపి శ్రీనివాస్, సిఐ, బాలరాజ్, మున్సిపల్ కమిషనర్ సుమన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## కోర్టు ధిక్కరణ కేసులో కలెక్టర్, ఆర్‌డిఒ, తహసీల్దార్‌కు షోకాజు నోటీసులు

ప్రజాపక్షం/యాచారం : మండల పరిధిలోని ఫార్మాసిటి భూసేకరణ విషయంలో కలెక్టర్ నారాయణరెడ్డి, ఆర్‌డిఒ అనంతరెడ్డి, తహసీల్దార్ అయ్యప్ప కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారని హైకోర్టు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఫార్మాసిటికి సేకరించిన భూముల్లో కూలీలు ఎంతోమంది ఉన్నారు. వారి ఉపాధి దెబ్బతింటుంది. ఫార్మాసిటికి సేకరించిన భూములను స్వాధీనం చేసుకోవద్దని హైకోర్టు నోటీసులు జారీ చేసినా అధికారులు కోర్టును దిక్కరించి పనులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది. మేడిపల్లి కూలీల కేసులో ఫిర్యాదు 1039 /2025 ఆర్‌డిఒ, తహసీల్దార్‌కు, నానక్‌నగర్ కూలీల విషయంలో ఫిర్యాదు 1080/2025లోలో కలెక్టర్, ఆర్‌డిఒ, తహసీల్దార్‌లు నాలుగు వారాల్లో కోర్టు దిక్కరణ చేసినందుకు స్వయంగా లేదా అడ్వకేటు ద్వారా సమాధానం చెప్పాలని కోర్టు నోటీసులు జారీ చేసింది. అధికారులు చట్ట వ్యతిరేక పనులు చేస్తూ రైతులను బెదిరించడం సరైంది కాదని కోర్టు తెలిపింది. ఇకనైనా అధికారులు కోర్డు ఆర్డర్ ప్రకారం నడుచుకోవాలంది.

## కార్మిక హక్కుల రక్షణకు 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె

ఎల్‌బి నగర్ మున్సిపల్ జోన్ ప్రధాన కార్యరద్శి మద్దిలేటి



ప్రజాపక్షం/ఎల్‌బినగర్ : ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఎఐటియుసి ఎల్‌బి నగర్ మున్సిపల్ సంఘం జోన్ ప్రధాన కార్యదర్శి మద్దిలేటి పిలుపునిచ్చారు. బుధవారం హయత్ నగర్, సరూర్ నగర్, ఎల్‌బి నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌లకు సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక పోరాటాలు, ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్న 44 చట్టాలలో 29 చట్టాలను కేంద్రం తీసేస్తూ 4కోడ్‌లు తెచ్చి కార్మికుల హక్కులను హరిస్తున్నారని ఆరోపించారు. కార్మిక ప్రజా రైతు వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎఐటియుసి ఎల్‌బి నగర్ సర్కిల్ కార్యదర్శి కె.లక్ష్మి, ఎం.నరసమ్మ, రాములమ్మ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## మైనర్‌లకు వాహనం ఇస్తే తల్లిదండ్రులపై చర్యలు : ఎసిపి



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : వాహనాదారులు తమ వాహనాల పత్రాలు వాహనంతో పాటు ఉండాలని, లైసెన్స్ కలిగిన వారే వాహనాలు నడపాలని, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు ఉంటాయని వనస్థలిపురం ఎసిపి కాశిరెడ్డి తెలిపారు. బుధవారం బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ లోని శివాలయం వద్ద వనస్థలిపురం సిఐ సిహెచ్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎసిపి కాశిరెడ్డి మాట్లాడుతూ మైనర్‌లకు వాహనం ఇస్తే వారి తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.సైబర్ క్రైమ్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ జటావత్ రవి నాయక్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి సబితకు శుభాకాంక్షలు తెలిపిన బిఆర్‌ఎస్ నేతలు



ప్రజాపక్షం/గండిపేట : ఓబుళాపురం మైన్స్ కేసులో నాంపల్లి సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ కోర్టు తనను నిర్దోషిగా తేల్చి చెప్పిన శుభ సందర్భములో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి బిఆర్‌ఎస్ మణికొండ నేతలు బుధవారం శుభాకాంక్షలు తెలిపారు. మణికొండ మున్సిపాలిటీ బిఆర్‌ఎస్ అధ్యక్షులు సీతారాం దూళిపాళ ఆధ్వర్యంలో బిఆర్‌ఎస్ నేతలంతా సబితా ఇంద్రారెడ్డి నివాసానికి చేరుకొని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి టపాకాయలు కాల్చి, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు కుంభగల్ల ధనరాజ్, గుట్టమీది నరేందర్, రూపారెడ్డి, అందే లక్ష్మణ్ రావు, ఉపేంద్రనాథ్ రెడ్డి, విజయలక్ష్మి, రాజేంద్ర ప్రసాద్, జై రామ్, భానుచందర్, సుమనళిని, రమణ మూర్తి, కందడ ప్రవీణ్ కుమార్,అశోక్, ఎస్.రేఖ, బిందు, మౌనేష్,మహేష్,శేఖర్, గోపి తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ టెంపుల్ పాలకవర్గం మార్చాలని కార్పొరేటర్‌కు వినతి



ప్రజాపక్షం/ఎల్‌బినగర్ : వనస్థలిపురంలోని గణేష్ టెంపుల్ పాలకవర్గం భక్తులకు సౌకర్యాలు కల్పిస్తామని చెప్పుకుంటూ వారి ఇష్టానూసారం ఇష్టనూసారంగా వ్యవహరిస్తున్నారని కాలనీ ప్రజలు ఆరోపిస్తున్నారు. తీర్మాణాలు లేకుండా పాలకవర్గం అనేక అవినీతి కార్యక్రమాలకు పాలుపడుతున్నారని వారు ఆరోపించారు. తక్షణమే ఆలయ పాలకవర్గాన్ని తొలగించి నూతన పాలకవర్గం ఏర్పాటు చేయాలని కాలనీ ప్రజలు డిమాండ్ చేశారు.

### కార్పొరేటర్‌కు కాలనీ వాసులు వినతి

వనస్థలిపురంలోని ఫేస్1, 2 కాలనీ వాసులు బుధవారం వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డిని కలిసి గణేష్ టెంపుల్ పాలకవర్గంను మార్చాలని వినతి పత్రం అందజేశారు. గత 25 ఏళ్లుగా గణేష్ టెంపుల్ పాలకవర్గంపై వివిధ రకాల అవినీతి ఆరోపణలు ఉన్నాయని వారు తెలిపారు. గతంలో రఘుపతిరెడ్డి ఆధ్వర్యంలో కమిటీ రద్దు అయిన సమయంలో కె. లక్ష్మ య్య, సోమసుందరం, జగదీష్ కుమార్‌ల అధ్యక్షతన కాలనీవాసుల సమక్షంలో జరిగిన తీర్మాణానికి కట్టుబడి ప్రతి మూడు సంవత్సరాలకు ఒక సారి పాలకవర్గం మార్పు జరగాలని వారు తెలిపారు. కానీ వాటిని పాటించకుండా ఆనాటి నుంచి పాలకవర్గం వారి అక్రమాలకు అడ్డు అదుపులేకుండా పోయిందని వారు తెలిపారు. మినిట్స్ బుక్స్, అకౌంట్ బుక్స్ పై క్షుణంగా పరిశీలించి పాలకవర్గంపై చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి వినతిపత్రంలో వివరించారు. కార్యక్రమంలో పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.

# దేశ రక్షణలో సైనికుల పాత్ర వెలకట్టలేనిది

రాష్ట్ర ఐటి శాఖ మంత్రి శ్రీధర్‌బాబు





ప్రజాపక్షం/షాద్‌నగర్/కొత్తూర్: దేశరక్షణలో సాయుధ బలగాల పోరాట పటిమను చూస్తుంటే గర్వంగా ఉందని, సైనికుల పాత్ర వెలకట్టలేనిదని తెలంగాణ రాష్ట్ర ఐటి శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజక వర్గంలోని కొత్తూర్, నందిగామ మండలాల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి పర్యటించారు. అనంతరం కొత్తూర్ మున్సిపాలిటీ పరిధిలోని నాట్కో ట్రస్టు పరిశ్రమ యాజమాన్యం నూతనంగా నిర్మించిన జిల్లా పరిషత్ పాఠశాల భవనాన్ని మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కలిసి ప్రారంభించారు. నందిగామ మండల పరిధిలోని మేకగూడ గ్రామంలో నాట్కోట్రస్టు ద్వారా అంగన్ వాడీ భవనం, గ్రామ పంచాయతీ భవనం, చాకలి దాని గుట్ట తండల్లో అంగన్ వాడీ భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నట్లు తెలిపారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని అన్ని గ్రామ పంచాయతీలో మౌలిక వసతులు కల్పించి అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తున్నట్లు వివరించారు. ఆపరేషన్ సిందూర్ పేరుతో ఉగ్రవాద నిర్మూలన లక్ష్యంగా భారత సాయుధ దళాలు పనితీరు గర్వంగా ఉందన్నారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. షాద్‌నగర్ అభివృద్ధి పై రాష్ట్ర ముఖ్యమంత్రి ఆశీర్వాదం ఉందని సంతోషం వ్యక్తం చేశారు. షాద్‌నగర్ ప్రాంత అభివృద్ధికి పూర్తి స్థాయి సహాయ సహకారాలు ఉన్నాయన్నారు. దేశాన్ని కాపాడే ప్రయత్నంలో రాష్ట్ర ప్రభుత్వ సహాయ సహకారాలు ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్య శాఖ అధికారి శశిధర్ రావు, ఎంఇవో అంగూర్ మున్సిపల్ చైర్ పర్సన్ లావణ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు దేవేందర్ యాదవ్, డోలి రవీందర్ , సోమ్లా నాయక్, మాధవి, గోపాల్ గౌడ్, తహశీల్దార్ రవీందర్ రెడ్డి, ఎంపిడివో అరుంధతి, మండల పార్టీ అధ్యక్షుడు హరినాథ్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్, నాట్కో ట్రస్టు సభ్యులు సత్యనారాయణ, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందే మోహన్, మాజీ ఎంపిపి శివ శంకర్ గౌడ్, శ్రావణ్, వెంకట్ రెడ్డి, లింగా రెడ్డి, సీతారాములు తదితరులు ఉన్నారు.

## తెలంగాణలో టిడిపిని బలోపేతం చేస్తాం

టిడిపి అధినేత, ఎపి సిఎం చంద్రబాబు



ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలుగుదేశం అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును తెలంగాణకు టిడిపి రాష్ట్ర నాయకుడు కట్ట రాములు కలిశారు. తెలంగాణలో ఉన్న రాజకీయ పరిస్థితులు ఆయనకు తెలిపారు. త్వరలోనే తెలంగాణలో టిడిపి బలోపేతానికి దృష్టిసారిస్తామని చంద్రబాబు చెప్పినట్లు రాములు చెప్పారు.

## గౌలిపుర స్లాటర్ హౌస్ త్వరలో పున:ప్రారంభిస్తాం

జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి.కర్ణన్



ప్రజాపక్షం/హైదరాబాద్ : సంతోష్ నగర్ సర్కిల్ గౌలిపుర మేకల మండి (స్లాటర్ హౌస్) త్వరలో పున:ప్రారంభిస్తామని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి. కర్ణన్ అన్నారు. గౌలిపుర స్లాటర్ హౌస్ భవనాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. గౌలిపుర మేకల మండి గతంలో జిహెచ్‌ఎంసి ఆధ్వర్యంలో సజావుగా నడిచిందని, కాలనీకి చెందిన ఒక వ్యక్తి కోర్టుకు వెళ్లడంతో నిలిచిపోయిందని, అప్పటి నుండి స్లాటర్ హౌస్ పనిచేయకపోవడంతో దానిపై ఆధారపడిన కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారని, కోర్టు తీర్పు ఇచ్చి చాలా రోజులు అవుతున్నందున యంత్రాలు, మరమ్మత్తులు ఇంకా కొన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కమ్యూనిటీ పెద్దలు ఈ సందర్భంగా కమిషనర్‌ను కోరారు. బిల్డింగ్, యంత్రాల మరమ్మత్తులు, నీరు ఇతర వసతులు ఏర్పాటు చేసి త్వరలోనే పునః ప్రారంభించడం జరుగుతుందని కమ్యూనిటీ పెద్దలకు కమిషనర్ తెలిపారు. ప్రాజెక్ట్ ఇంజనీర్‌కు ప్రతిపాదనలు తయారు చేయాలని కమిషనర్ ఆదేశించారు. కమిషనర్ వెంట అదనపు కమిషనర్(ఆరోగ్యం) ఎస్.పంకజ, జోనల్ కమిషనర్ వెంకన్న, జోనల్ ఎస్ఈ మహేశ్వర్‌రెడ్డి, ప్రాజెక్టు ఎస్ఈ శ్రీలక్ష్మి , సంతోష్ నగర్ డిప్యూటీ కమిషనర్ మంగతాయారు, గౌలిపుర కార్పొరేటర్ భాగ్యలక్ష్మి , చీఫ్ వెటర్నరీ అధికారి అబ్దుల్ వకీల్ పాల్గొన్నారు.

## జిహెచ్‌ఎంసి ట్రాన్స్‌పోర్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని వినతి



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఈవిడిఎంకు పంపించిన కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ కార్మికులను తిరిగి జిహెచ్‌ఎంసి ట్రాన్స్‌పోర్ట్ విభాగంలోకి తీసుకోవాలని కార్మికులు కోరారు. ఈ మేరకు బుధవారం జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. అదనపు కమిషనర్ సి.ఎన్. రఘుప్రసాద్‌ను కలిసి తమను తిరిగి జిహెచ్‌ఎంసి ట్రాన్స్‌పోర్ట్ విభాగంలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అందుకు రఘుప్రసాద్ సానూకులంగా స్పందించి, ఈ అంశాన్ని కమిషనర్ దృష్టికి తీసుకేళ్లుతానని కార్మికులకు హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్మికులు ఆకుల శ్రీనివాస్, సుముద్రాల శ్రీనివాస్, ఎం.డి.జహీర్, గడ్డం జగదీశ్, కె.బాలరాజు, సి.హెచ్.భూపతి, మురళీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా జిహెచ్‌ఎంసి ట్రాన్స్‌పోర్టు విభాగంలో కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న తమను ఉన్న పలంగా ఉద్యోగాల నుంచి తొలగిస్తే తమ కుటుంబాలు రోడ్డున పడుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. జిహెచ్‌ఎంసిలో పనిచేస్తున్న తమను హైడ్రా పరిధిలోని ఈవిడిఎంలోకి పంపించారని, కానీ వేతనాలు మాత్రం జిహెచ్‌ఎంసి ద్వారానే ఇచ్చేవారన్నారు. ఈవిడిఎం నుంచి తమను జిహెచ్‌ఎంసి పంపించారన్నారు. ప్రస్తుతం జిహెచ్‌ఎంసిలో తిరిగి తమను విధులలోకి తీసుకోవడం లేదన్నారు. తమను విధులలోకి తీసుకోకపోతే ఉపాధి కోల్పోయి, తమ కుటుంబాలను పోషించుకోవడం కష్టమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం గడచిన ఏప్రిల్ మాసం వేతనం కూడా తమకు అందలేదన్నారు. తమ పట్ల దయచూపించి, తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కార్మికులు వేడుకున్నారు.

## యువతకు భవిత ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్



ఇస్కీ డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వర్‌రావు

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఆధునిక ప్రపంచంలో ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ ప్రాధాన్యత పెరిగిందని, స్కూల్ నుండి కాలేజీకి వెళ్ళే ప్రతి యువత ఈ ఆధునిక టెక్నాలజీపై అవగాహన కల్పించుకోవాల్సిన అవసరం తప్పనిసరిగా ఉందని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వర్‌రావు అన్నారు. కాలేజ్ కన్వెన్షన్ సెంటర్ సెమినార్ హాల్లో బుధవారం నిరుద్యోగ యువత కోసం ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన 4.0 కార్యక్రమాన్ని రామేశ్వర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్త్ కేర్, రవాణా, మ్యానుఫాక్చరింగ్, రిటైల్స్, గేమింగ్, ఈ కామర్స్, సైబర్ సెక్యూరిటీ, ఫైనాన్స్ రంగాల్లో ఆర్టిఫిషియల్ ఏఐ బాగా పనిచేస్తుందన్నారు. ఎస్కీతో ఒప్పందం చేసుకున్న నగరంలోని ఇంజనీరింగ్ కాలేజీలలో ఇప్పటికే ఏఐ అండ్ ఎమ్ఎల్ మీద శిక్షణ పూర్తి చేశామని, మరికొన్ని కాలేజీలు మిగిలి ఉన్నాయని, త్వరలో ఈకాలేజీలలో శిక్షణ పూర్తిచేస్తామన్నారు. సమావేశంలో ఎమ్‌జిఐటి ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ యువతకు అవసరమైన కోర్సులను ఇస్కీ అందిస్తున్నందుకు కృతజ్ఞతలు చెప్పారు. సమావేశంలో టివి.రజనీకాంత్, రాజేష్ పర్షత్, ఎమ్‌కె.గాంధీ, సాయికిషోర్ పాల్గొన్నారు.

## పాత కార్ల మాటున లిక్కర్ దందా

దిగుమతి మద్యాన్ని పట్టుకున్న ఎస్‌టిఎఫ్

ప్రజాపక్షం/హైదరాబాద్: పాత కార్లు ఎక్కడ కనిపించినా తక్కువ ధరలకు కొనుగోలు చేసి ఎక్కువ ధరలకు అమ్మకాలు జరిపే వ్యాపారాన్ని చేస్తూ.. సైడ్ బిజినెస్‌గా కొనుగోలు చేసిన కార్‌లో ఆయా రాష్ట్రాల్లో తక్కువ ధరలకు లభించే మద్యం బాటిల్లను తీసుకువచ్చి హైదరాబాదులో ఎక్కువ ధరలకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నటువంటి ముఠాను బుధవారం ఎస్‌టిఎఫ్ డి టిమ్ సిఐ నాగరాజు బృందం పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. నాగర్ కర్నూలుకు చెంది రవీందర్ కత్రావత్ తరచూ ఢిల్లీ ఇతర రాష్ట్రాలకు వెళ్తూ పాత కార్లను కొనుగోలు చేసి తీసుకువచ్చి హైదరాబాదులో ఎక్కువ ధరలకు అమ్మకాలు జరిపే వ్యాపారం నిర్వహిస్తాడు. ఢిల్లీ ప్రాంతాల్లో కొనుగోలు చేసిన కారులో తక్కువ ధరలు కలిగిన మద్యం బాటిల్లను కారు వెనుక డిక్కీలో వేసుకుని హైదరాబాద్ కు తీసుకొని వస్తాడు. ఢిల్లీ నుంచి తీసుకొచ్చినటువంటి మద్యం నాగర్‌కర్నూల్‌కు చెందిన నాగిరెడ్డి, కర్మన్‌ఘాట్‌కు చెందిన సంతోష్‌లకు అందజేస్తాడు. ఢిల్లీ నుంచి తీసుకొచ్చినటువంటి మద్యం బాటీలను అమ్మకాలు జరిపిన లాభాల్లో ఇద్దరూ పంచుకుంటారు. సమాచారం సేకరించిన ఎస్‌టిఎఫ్ డిటీం సిఐ నాగరాజుతో పాటు ఇతర సిబ్బంది కలిసి నాగిరెడ్డి ఇంటిలో దాడులు నిర్వహించారు. దాడిలో ఢిల్లీకి చెందిన 105 మద్యం బాటిల్లు లభ్యమయ్యాయని సిఐ తెలిపాడు. ఎస్‌టిఎఫ్ డీటీంను ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ షాన్ వాజ్‌ఖాసిం , ఎస్‌టిఎఫ్ డిటీం లీడర్ యాదవులు అభినందించారు.

## ఆక్రమణలను తొలగించిన హైడ్రా

2500 గజాల ప్రభుత్వ భూమి స్వాధీనం

ప్రజాపక్షం/హైదరాబాద్ : బండ్లగూడ మండలం కందికల్ గ్రామంలోని ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలను హైడ్రా తొలగించింది. 303, 306 సర్వే నంబర్లలో ఉన్న 2500 గజాల ప్రభుత్వ స్థలాన్ని హైడ్రా స్వాధీనం చేసుకుంది. ఈ స్థలం యుఎల్‌సి భూమికగా, సయ్యద్ బషీరుద్దీన్, సయ్యద్ అమీదుల్లా హుస్సేన్ కబ్జా చేశారు. అర్బన్ ల్యాండ్ సీలింగ్ కింద ఉన్న భూమిని తన పేరుమీద రెగ్యులరైజ్ చేసుకునేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించకపోయినా, అందులో అనుమతులు లేకుండా షెడ్డులు, గదులు నిర్మించారు. ఈ మేరకు ప్రభుత్వ భూమి కబ్జా జరుగుతోందని, కాపాడాలని స్థానికుల నుంచి ప్రజావాణికి ఫిర్యాదు అందడంతో హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సంబధిత అధికారుల నివేదిక ఆధారంగా ప్రభుత్వ భూమి అని నిర్ధారించుకున్నారు. హైకోర్టు కూడా ఈ అక్రమ కట్టడాలను తొలగించాలని 2 నెలల క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు అక్కడ నిర్మించిన గదులను, రేకుల షెడ్డులు, షాపులు 4 వరకూ కూల్చివేశారు. ప్రభుత్వ భూమిని కాపాడగలిగామంటూ స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. హైడ్రాకు ఫిర్యాదు చేయగానే క్షేత్ర స్థాయిలో పరిశీలించి, ఆక్రమణల తొలగింపును చేపట్టిన హైడ్రాకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్‌కి, రెవెన్యూ, పోలీసు అధికారులకు స్థానిక ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

## నేడు హైడ్రా పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించనున్న సిఎం రేవంత్‌రెడ్డి




ప్రజాపక్షం/హైదరాబాద్ : ఆక్రమణదారులపై ఉక్కుపాదం మోపుతున్న హైడ్రాకు ఇప్పుడు పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేశారు. హైడ్రా కార్యాలయం బుద్ధ భవన్ పక్కనే హైడ్రా పోలీసు స్టేషన్ ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం హైడ్రా పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించనున్నారు. డిజాస్టర్, ఫైర్ విభాగాల మాదిరే సొంతంగా పోలీస్ స్టేషన్ ఏర్పాటుతో హైడ్రా కార్యకలాపాలకు మరింత బలం సమకూరనుంది. ఈ పోలీస్ స్టేషన్‌కు ఎస్‌హెచ్‌ఓగా ఏసిపి పి. తిరుమల్ నియమితులయ్యారు. ఆరుగురు ఇన్‌స్పెక్టర్లు, 12 మంది ఎస్‌ఐలు, 30 మంది కానిస్టేబుళ్లు ప్రస్తుతానికి ఈ పోలీసు స్టేషన్‌కు సమకూరనున్నారు. 10500ల చదరపు అడుగుల విస్తీర్ణంలో జి ప్లస్2గా ఈ పోలీస్ స్టేషన్ నిర్మించారు.

## కాలనీ సంక్షేమ సంఘాలతో అభివృద్ధి

ఎంపి ఈటెల రాజేందర్



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : కాలనీ సంక్షేమ సంఘాల సమన్వయంతో కాలనీలు అభివృద్ధి దిశగా ముందుకు సాగుతాయని మల్కాజ్‌గిరి ఎంపి ఈటెల రాజేందర్ అన్నారు. బుధవారం బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లోని స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో విజయపురి కాలనీ ఫేస్1, హరిహరపురం కాలనీ సంక్షేమ సంఘం నూతనంగా ఎన్నికైన సందర్భంగా ఎంపి ఈటెల రాజేందర్‌ను వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కాలనీల సమస్యలను వినతిపత్రంలో వివరించారు. ఈ సందర్భంగా ఎంపి ఈటెల రాజేందర్ మాట్లాడుతూ కాలనీల సమస్యల పరిష్కరించడానికి తన సహకారం ఎల్లప్పుడు ఉంటుందని, కాలనీ అభివృద్ధికి తన ఎంపీ నిధుల నుంచి నిధులు కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రావు, విజయపురి కాలనీ ఫేస్1 అధ్యక్షులు వెంకట్‌రెడ్డి, హరిహరపురం కాలనీ అధ్యక్షులు శంకరయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శి సందడి సందీప్ రెడ్డి, కాలనీ వాసులు మురళీకృష్ణ, నరేష్ కుమార్, పృద్వి, సత్తయ్య, సాయి గోపాల్, వేణుగోపాల్‌రెడ్డి, వెంకటరమణ, సుదర్శన్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్గత రోడ్ల అభివృద్ధికి నిధులు

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : ఎల్‌బి నగర్ నియోజకవర్గంలోని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలకు అంతర్గత సీసీ, బిటీ రోడ్లు నిర్మించడానికి నిధులు మంజూరు చేయాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి.కర్ణన్‌ను ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ డివిజన్‌లోని 15 కాలనీలకు అంతర్గత రోడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, చినుకుపడితే బురద మయంగా రోడ్లు మారుతున్నాయని ఆయన తెలిపారు. కొన్ని కాలనీల్లో వర్షాపు నీరు పూర్తిగా రోడ్లపైనే నిలుస్తుందని, రోడ్లు ఏర్పాటు చేయడం ద్వారా వర్షపు నీరు నిల్వలేకుండా పోతుందని, తక్షణమే నిధులు మంజూరు చేయాలని కమిషనర్‌ను కోరారు. ఈ మేరకు కమిషనర్ సానుకులంగా స్పందించినట్లు తెలిపారు.స్థానిక బిఎన్‌రెడ్డి నగర్ బిఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి ఆయన వెంట ఉన్నారు.

## ఘనంగా వాసవి మాత జన్మదినోత్సవం



**ప్రజాపక్షం/మద్దూరుః** పట్టణ కేంద్రంలోని వాసవి మాత మందిరంలో ఘనంగా వాసవి మాత జన్మదినం ను జరుపుకున్నారు. ఈ సందర్భంగా మద్దూరులోని ఆర్యవేశ్య మహాసభ ఆధ్వర్యంలో వాసవి మందిరంలో అమ్మవారికి ఒడి బియ్యం, కుంకుమార్చన పల్లకి సేవ కార్యక్రమాలు కటకం శైలజ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో అభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో శోభారాణి, గాయత్రి, సరస్వతి, మధు, అరుణ, జ్యోతి, శివాని, సుజాత ,మీనా తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో సమ్మర్ క్యాంపులు



**ప్రజాపక్షం/దోమ :** పరిగి నియోజకవర్గంలో దోమ మండలంలోని బొంపల్లి ప్రభుత్వ పాఠశాలలో సమ్మర్ కాంప్యులో భాగంగా ఎ1 కంప్యూటర్ తరగతులను బుధవారం జిల్లా విద్యాధికారి రేణుకాదేవి సందర్శించి విద్యార్థులతో, తల్లిదండ్రులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎ1 కంప్యూటర్ పరిజ్ఞానం సమర్థవంతంగా నేర్చుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించే విధంగా బోధన చేపట్టాలని డిఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓరామ్‌మస్తా, ,ఎంఈఓ వెంకట్ ,ప్రధానోపాద్యాయులు షిపి, ఉపాధ్యాయులు అమర్నాద్, లాల్య, ఆంజనేయులు ,మల్లేశ్వర్ ,శ్రీవిద్యా , ప్రవీణ్‌కుమార్, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.



## యుద్ధ వాతావరణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** యుద్ధ వాతావరణంలో తీసుకోల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని శామీర్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ అన్నారు. బుధవారం తూంకుంట మున్సిపాలిటిలోని వై జంక్షన్ వద్ద సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశం పాకిస్థాన్ దేశాల మద్య నెలకొన్న ప్రస్తుత ఉద్రిక్తల నేపథ్యంలో ప్రజల్లో అప్రమత్తతను పెంపొందించుటకు, అత్యవసర పరిస్థితిల్లో సురక్షితంగా ఉండేందుకు శామీర్‌పేట పోలీసులు సిఐ శ్రీనాథ్‌ల ఆద్వర్యంలో సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నామని చెప్పారు. సాయంత్రం 4 గంటల నుంచి 4.30 గంటల వరకు జరిగిన మాక్ డ్రిల్‌లో సైరన్‌లతో కూడిన పోలీస్ వాహానా లు ముక్యమైన ప్రాంతాల్లో తిరిగి అత్యవసర హెచ్చరికల శబ్దాలను చేశాయన్నారు. ఈ శబ్దాలతో ప్రజలు అలాంటి పరిస్థితుల్లో వచ్చే హెచ్చరికల శబ్ద పరిచయాన్ని పొందారని చెప్పారు. ఇంకా అలాంటి వేళల్లో ప్రజలకు తగిన ముఖ్యమైన సలహాలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాద బాధితులను తక్షణమే ఆదుకోవాలి



* సర్వస్వం కోల్పోయిన బాధితులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి

**హైదరాబాద్ :** మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, నాగోల్, సాయి నగర్ గుడిసెల్లో జరిగిన అగ్ని ప్రమాద బాధితులను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు ఇటి నరసింహ, రాష్ట్ర సమితి సభ్యులు చందు నాయక్, ఫైమీద, రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు సామిడి శేఖర్ రెడ్డి, బాతురాజు నరసింహ, రాములుతో కలసి బుధవారం వేర్వేరుగా పరామర్శించారు. అగ్ని ప్రమాదం వలన 28 గుడిసెలు పూర్తిగా, కొన్ని గుడిసెలు పాక్షికంగా దగ్ధమయ్యాయని, దీంతో నిత్యావసర సరకులు, వస్తువులు, డబ్బులు, బంగారం తోపాటు సర్వస్వం



కోల్పోయామని బాధితులు చాడ వెంకట్ రెడ్డికి వివరించారు. రెండు దశాబ్దాల క్రితం నాగోల్, సాయి నగర్‌లో జరిగిన సిపిఐ భూ పోరాటంలో భాగంగా ప్రభుత్వ భూమిలో వందలాదిమంది పేదలకు గుడిసెలు వేయించారని, ఆతరువాత వారికీ ఇళ్ల పట్టాలుకూడా సిపిఐ స్థానిక నాయకత్వం ఇప్పించడం జరిగిందని గుర్తు చాడ చేశారు. అకస్మాత్తుగా మంటలు చెలరేగి గుడిసెలు దగ్ధమై సర్వస్వం కోల్పోవడం చాలాబాధాకరం, బాధితులకు సిపిఐ అన్ని విధాలా ఆదుకుంటుందని అని అన్నారు. తక్షణ సహాయం కింద ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని పెంచి వెంటనే అందజేయాలని, అలాగే అగ్ని ప్రమాదంలో గుడిసెలు, ఇళ్ళు కోల్పోయిన బాధితులకు ఇంటి నిర్మాణానికి ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేయాలనీ చాడ వెంకట్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



## పార్టీ బలోపేతానికి కృషి చేస్తా

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** బిజెపి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని బిజెపి పార్టీ మూడుచింతలపల్లి మండల నూతన అద్యక్షుడుగా ఎన్నికైన తప్పెట్ల నరేందర్‌గౌడ్ అన్నారు. బుధవారం మూడుచింతలపల్లి మండలానికి కేశవరం గ్రామానికి చెందిన తప్పెట్ల నరేందర్‌గౌడ్ బిజెపి పార్టీ మండలాధ్యక్షుడు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్, మేడ్చల్ ఎంఎల్‌ఎ కంటెస్ట్ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, జిల్లా బిజెపి అధ్యక్షులు బుద్ది శ్రీనివాస్, మాజి అధ్యక్షులు విక్రమ్‌రెడ్డిలను కలిసి వారిని ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాపై నమ్మకంతో మూడుచింతలపల్లి మండల పార్టీ బిజెపి అద్యక్షుడుగా ఎన్నుకున్నందుకు పార్టీ పెద్దలకు రుణపడి ఉంటానన్నారు. పార్టీని అన్ని గ్రామాల్లో ముందుకు తీసుకెళ్లడానికి తనవంతు కృషి చేస్తానన్నారు. అలాగే మూడుచింతలపల్లి మండలం నారాయణపూర్ గ్రామ మాజి ఉపసర్పంచ్ హన్మంతు బిఆర్ఎస్ పార్టీ నుంచి మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ సమక్షంలో బిజెపిలో చేరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏనుగు సుదర్శన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు బుద్ది శ్రీనివాస్, జిల్లా నాయకురాలు హైమారెడ్డి, మాజి అధ్యక్షుడు నందాల శ్రీనివాస్, కార్యదర్శి మల్లెపల్లి నాగరాజు, విజయలక్ష్మి , వెంకటేష్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ స్ఫూర్తితో యువత ఉన్నత స్థానాలకు ఎదగాలి

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:** వికారాబాద్ పట్టణంలోని ఎన్నేపల్లి చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 12 అడుగుల కాంస్య విగ్రహన్ని ఆవిష్కరించిన తెలంగాణ రాష్ట శాసన సభాపతి ప్రసాద్‌కుమార్, ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎంపి కొండవిశ్వేశ్వర్‌రెడ్డి, శాసనమండలి చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, చేవెళ్ల, తాండూర్, పరిగి ఎమ్మెల్యేలు రాంమోహన్‌రెడ్డి, యాదయ్య, మనోహర్‌రెడ్డి, మాజీ శాసన సభ్యులు ఆనంద్, జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ జిల్లా ఎస్‌పి నారాయణరెడ్డి, తదితరులు పాల్గోన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ రాజ్యాంగ ప్రదాత, దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాల ఆత్మబంధువు, భారత రత్న డాక్టర్ భీంరావు అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం ద్వారా మన వికారాబాద్‌కు ఒక గౌరవం లభించింది. అంబేద్కర్ ఒక చరిత్ర నేటి వాస్తవానికి ప్రతీక అన్నారు.



దేశంలోని కోట్లాది మంది దళిత, గిరిజనులు తలెత్తుకుని బ్రతుకుతున్నారు. అంటే ధైర్యం పేరు అంబేద్కర్ విద్య,ఉద్యోగాలు, రాజకీయ, సామాజికి సామాజిక రంగాలలో తమ వాటాను పొందుతూ, ప్రజాప్రతినిధులు అవుతున్నారు. అంటే దానికి కారణం అంబేద్కర్ రిజర్వేషన్లు అనే బ్రహ్మాస్త్రాన్ని మనకు ఇచ్చాడు. అంబేద్కర్ దారి చూపించారు అని ఆ దారిలో నడిచి మనం ఉన్నత స్థానాలను అందుకోవాలని అన్నారు. పూరి గుడిసెలో, దళిత వాడలలో, గిరిజన గుడిసెలలో పుట్టిన కూడా దేశ అత్యున్నత పదవులు పొందుతున్నారు. అంటే దానికి ఏకైక కారణం అంబేద్కర్ అందించిన రిజర్వేషన్లు అనే బ్రహ్మాస్త్రం. నేను శాసనసభ స్పీకర్ అయింది అంటే అంబేద్కర్ రిజర్వేషన్ల బిక్షనే అన్నారు. దేశంలో సుపరిపాలన జరిగి అట్టడుగు వర్గాలకు న్యాయం జరగాలనే సంకల్పంతో రిజర్వేషన్లు కల్పించారు. అంబేద్కర్ అనేది ఒక పేరు కాదు అది ఈ దేశ ప్రజల జీవన రేఖ, దళిత, బడుగు, బలహీన వర్గాల జీవితాలకు వెలుగును ఇచ్చిన సూర్యుడు అని తెలిపారు. అంబేద్కర్ పోరాట స్ఫూర్తితో నేటి యువత తమ జీవిత లక్ష్యాలను సాధించి ఉన్నత స్థానాలకు ఎదగాలని కోరుకుంటున్నానని అన్నారు. అంబేద్కర్ ఈ దేశ దళిత , గిరిజన, బడుగు, బలహీన వర్గాలకు ఒక కాగడాలాగా వెలుగును పంచుతున్నారు. ఆ వెలుగులో మనం విజయం అనే గమ్యాన్ని అందుకోవాలి అని అప్పుడే అంబేద్కర్‌కు నిజమైన నివాళులర్పించిట్లు ఉంటుందని అన్నారు.

ఉస్మానియా యునివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఖాసీం :ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సమాజంలో అసమానతలను రూపమాపేందుకు తన జీవితకాలం పోరాడిన మహవ్యక్తి బాబాసాహెబ్ అంబేద్కర్ అన్నారు. అంబేద్కర్ వారసులుగా తమ జీవిత శైలిని మార్చుకుంటూ హక్కుల కోసం పోరాడాలని అయాన పిలుపునిచ్చారు. దేశ భవిష్యత్తు బాగుండాలనే వారి ఆకాంక్షను నెవేర్చాల్సిన బద్యత మన అందరిపై ఉందని అయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుదీర్ , ఆర్‌డిఓ వాసుచంద్ర , తహసీల్దార్ లక్ష్మి నారాయణ, పట్టణ అద్యక్షులు సుధాకర్‌రెడ్డి అర్టి మెంబర్ జాఫర్, అంబేద్కర్ వాదులు తదితరులు పాల్గోన్నారు.



రావి నారాయణరెడ్డి నగర్ కాలనీ ఫేజ్ 3లో గుడిసెలు దగ్ధమైన బాధితుల సహాయార్థం సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రాచారి, ఎం.యాదిరెడ్డి లకు రూ.20వేల చెక్కును అందజేస్తున్న నవచేతన విజ్ఞాన సమితి అధ్యక్షులు పల్లా వెంకట్‌రెడ్డి, కార్యదర్శి బిఎస్ఆర్ మోహన్‌రెడ్డి, కోశాధికారి ఉజ్జిని రత్నాకర్‌రావు

## చెరువులో మునిగి బాలిక మృతి

**ప్రజాపక్షం / కొడంగల్ :** వేసవి కాలంలో ఈత సరదా తీర్చుకునేందుకు కొంత మంది పిల్లలు ఒంటిరిగా చెరువు దగ్గరకు వెళ్లి ఒడ్డున స్నానమాడుతు సరదాగా ఆడుకుంటున్న సమయంలో ప్రమాదవశాత్తు నీట మునిగి ఓ బాలిక మృతి చెంది న ఘటన కొడంగల్ నియోజకవర్గం లోని బోంరాస్‌పేట మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు మండల పరిధిలోని రేగడిమైలారం గ్రామానికి చెందిన బలిజ ప్రవీణ్, మమత పెద్ద కూతురు భవ్యశ్రీ(9) కొడంగల్ లో ఓ ప్రైయివేటు పాఠశాలలో మూడవ తరగతి పూర్తైంది. కాగా బుధవారం మధ్యా హ్నం వేసవి విడిదిగా తనతోటి పిల్లలతో కలిసి ఇంటి సమీపంలో ఉన్న పటేల్ చెరువు వద్దకు వెళ్లింది. చెరువులో సరదాగా స్నానమాడుతు ఆడుకుంటు ఇంతింత లోనికి వెళ్లడంతో కొందరు చిన్నారులు నీట మునగగా భయపడి భయటికి వచ్చారు. కాని భవ్యశ్రీ మాత్రం లోతుకు వెళ్లి మునిగిపోవడంతో తోటి చిన్నారులు కేరింతలు, అరుపులు కేకలు వేయగా చెరువులో గోర్రెలకు నీళ్లు తాగిస్తున్న గ్రామానికి చెందిన గొర్రెల మంద కాపరులు గమనించి చెరువులోకి దూకి గల్లంతైన బాలికను వెలికతీశారు. విషయం కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో వారు అక్కడికి చెరుకుని బాలికను చూసిన గ్రామస్థులు బోరున విలపించారు. చెరువు ప్రమాదాలకు చిన్నారులను దూరంగా ఉంచాలని, జాగ్రత్తలు తీసుకోవాలని పలువురు సూచిస్తున్నారు.





## అంగరంగ వైభవంగా శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మూడుచింతలపల్లి మండలం కేశవరంలోని శ్రీ బాలాజి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వయంబూగా వెలిసిన శ్రీ వేంకటేశ్వరస్వామి అలివేలు మంగా పద్మావతి సమేతంగా నిర్వహించిన కల్యాణతంతు భక్తులందరిని ఆకట్టుకుంది. వేద పండితుల మంత్రాల శరణుఘోషతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఉదయం ఆరు గంటల నుంచి సుప్రభాత సేవలు, స్వామి వారికి పంచామృతాభిషేకాలు, మహాగణపతి విశ్వక్సేన పూజ, కలశ స్థాపన, ధ్వజారోహణ, అగ్ని ప్రతిష్ట, అనంతరం స్వామి అమ్మవార్ల కల్యాణం ఆలయ కమిటీ నిర్వాహకులు అత్యంత భక్తి శ్రద్దలతో నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకుని తరించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఎంఎల్‌ఎ చామకూర మల్లారెడ్డి, మాజి ఎంఎల్‌ఎ సుదీర్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్‌యాదవ్, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్, గ్రంధాలయ చైర్మన్ బొంగునురి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఆర్‌టిఎ మెంబర్ జైపాల్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అంజలియాదవ్, ఆలయ చైర్మన్ మర్యాల రమేష్, పురోహితులు నందగిరి ఉపేందర్‌రావు, హారీష్, బిజెపి అద్యక్షుడు నరేందర్‌గౌడ్, మాజి ఎంపిటిసి హన్మంతరెడ్డి, మాజి ఉపసర్పంచ్ విశ్వేశ్వర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మల్లాపూర్‌లో మాక్‌డ్రిల్



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** పహల్గాం ఉగ్రదాడి అనంతరం పాకిస్తాన్‌తో యుద్ధ మేఘాలు కమ్ముకొన్న నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేసే క్రమంలో దేశవ్యాప్తంగా కార్యక్రమంలో భాగంగా బుధవారం మేడ్చల్ జిల్లాలోని మల్లాపూర్ ప్రధాన రహదారిలో మాక్ డ్రిల్ నిర్వహించారు. భావత్, పాకిస్తాన్‌ల మధ్య యుద్ధం తీవ్రమైన పక్షంలో ఎక్కడ ఎలాంటి ఉత్పన్నం ఎదురైనా తీసుకోవాల్సిన జాగ్రత్తలతో సమీప వాసులను రక్షిస్తూ తమకు తాము కాపాడుకొనేందుకు గాను అవగాహన కల్పించే లక్ష్యంగా ఈ మాక్‌డ్రిక్ నిర్వహించారు. నిత్యం రద్దీగా ఉండే ఎన్ఎఫ్‌సి సమపంలోని నాచారం, మల్లాపూర్ ప్రధాన రహదారి పక్కనే ఉన్న మే ఫ్లవర్ గ్రాండ్ అపార్ట్‌మెంట్ సముదాయాన్ని మాక్‌డ్రిల్ కోసంఎంచుకొన్న అధికారులు ఉదయం నుండే స్థానికులను, సమీప వాసులను అప్రమత్తం చేసారు. పోలీసు, డిఆర్ఎఫ్, ఎన్‌డిఆర్ఎఫ్, హైడ్రా, ఫైర్ లాంటి 12 ప్రభుత్వ విభాగ అధికారులు, సిబ్బంది ఈ మాక్‌డ్రిల్‌లో పాల్గొన్నారు.



యుద్ధంతో ఎక్కడ బాంబు దాడులతో జన సమూహా లుండే నివాస, వాణిజ్య ప్రాంతాల్లో చెలరేగా మంటల నుండి ప్రజలను సురక్షితంగా కాపాడుకొనేందు ప్రభుత్వ పరంగా ఎలాంటి చర్యలు తీసుకొంటారన్న విషయాలను వివరించారు.

టెర్రరిస్టులు కాల్పులు జరుగటం, ఒక భవనంలోకి వెళ్లి కాల్పులు జరిపితే వారిని రక్షించే క్రమంలో ప్రభుత్వ పరంగా సైరన్ మోగించగానే అప్రమత్తం అవ్వాలని, అధికారిక వార్తలను మాత్రమే నమ్మాలే తప్ప వదంతులను పట్టించుకోకుండా ప్రభుత్వం ద్వారా వచ్చే సమాచారాన్ని మాత్రమే నమ్మాలని సూచించారు.

మల్లాపూర్‌లో జరిగిన మాక్‌డ్రిల్‌కు అగ్నిమాపక విభాగ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసన్న కుమార్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లా ఫైర్ ఆఫీసర్లు శ్రీనివాస్, కరీమల్లా, మల్కాజిగిరి, చర్లపల్లి స్టేషన్ ఫైర్ ఆఫీసర్లు గణేష్ యాదవ్‌లతో 30 మంది అగ్ని మాపకదళ విభాగ సిబ్బంది జిహెచ్ఎంసి, హైడ్రా, ఎన్‌డిఆర్ఎఫ్, పోలీస్, డిఆర్ఎఫ్ తదితర ప్రభుత్వ విభాగాలతో కల్సి అపార్ట్‌మెంట్‌లో చెలరేగిన మంటలను అదుపు చేసే ప్రక్రియను చేస్తూ లోపల చిక్కుకున్న వారిని బయటకు తీసుకొని వచ్చి, వారికి ప్రాథమిక చికిత్సలందిస్తూ ఆస్పత్రికి తరలించే విధానాన్ని మాక్‌డ్రిల్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాక్‌డ్రిల్ కేవలం ప్రజలకు అవగాహన కల్పించేందుకు మాత్రమే అని, ప్రజలను అప్రమత్తంగా ఉందేందుకు సన్నాహక చర్యలు అని, ఎవరూ ఎలాంటి భయభ్రాంతులకు గురి కావద్దని అధికారులు పేర్కొన్నారు. మాక్‌డ్రిల్‌కు ముందుగా పోలీసు పెట్రోలింగ్ వాహనాతో సైరన్లు మోగించి మాక్‌డ్రిల్‌ను ప్రారంభించారు. యుద్దంలో భాగంగా బాంబు దాడులు, వైమానిక దాడులు జరిగితే ఎక్కడి వారు అక్కడే తమ నివాస ప్రాంతాల్లో ఉంటూ భయ భ్రాంతులకు గురి కాకుండా ముందుగా తమ ఇళ్లల్లోని లైట్లన్నిటిని ఆర్పేసి,సురక్షిత ప్రాంతాల్లోకి చేరుకోవాలని అధికారులు సూచించారు. జిల్లా కలెక్టర్ గౌతం ఈ మాక్‌డ్రిల్‌ను పరిశీలించారు.





## ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించాలి

### ఎమ్మెల్యే కెపి వివేక్

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** మానవాళికి నష్టం కలిగించే ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించివేయాలని రాష్ట్ర శాసనసభ బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేక్ పత్రికా ప్రకటన ద్వారా అన్నారు. పహల్గాంలో ఉగ్రదాడికి ప్రతీకారంగా మంగళవారం అర్ధరాత్రి పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిక్షణా శిబిరాలపై భారత సైన్యం జరిపిన ఆపరేషన్ సింధూర్ దాడులపై బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే వివేక్ స్పందించారు. మానవాళికి నష్టం కలిగించే ఏ ఉన్మా దం, ఉగ్రవాదం లాంటి ఏ చర్య అయినా కూకటివేళ్లతో పెకిలించేయాలని, ఉగ్రవాదాన్ని సమూలంగా నాశనం చేసేందుకు తమ ప్రాణాలను పణంగా పెట్టి వీరోచితంగా పోరాడిన భారత సైన్యానికి అండగా ప్రతిఒక్కరు ఉండాలని, అందుకు తాను సైతం భారతీయుడైనందుకు గర్విస్తున్నానని పేర్కొన్నా రు.

**ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి**

ఉచిత వైద్య శిభిరాలను ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేక్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని జీడిమెట్ల డివిజన్ అయోధ్యనగర్‌లోని కమిటీహాల్‌లో గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత క్యాన్సర్ వైద్య శిభిరాన్ని వివేక్ ప్రారంభించారు. చికిత్స చేయించుకున్న వారికి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ పేద ప్రజలకు వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని, ఈ వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మానవ సేవయే పరమావధిగా ముందుకు సాగుతున్న గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్‌ని అభినందించారు. కార్యక్రమంలో నాయకులు మన్నెరాజు, అశోక్, భాస్కర్, శ్రీకాంత్, వేణు యాదవ్, సిద్ధిరాములు, సుధాకర్ గౌడ్, నరేందర్ రెడ్డి, సమ్మయ్య నేత, తదితరులు పాల్గొన్నారు.




**అపురూపకాలనీలో సాయిబాబా వార్షికోత్సవ వేడుకలు...**

కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని సుభాష్‌నగర్ డివిజన్ అపురూప కాలనీలో సాయిబాబా దేవాలయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన స్థానిక ఎమ్మెల్యే కెపి వివేక్ ప్రత్యేక పూజలు చేశారు. సాయినాథుని కృపతో ప్రజలంతా సుభిక్షంగా జీవించాలని వేడుకున్నారు. కార్యక్రమంలో మన్నెరాజు, శ్రీకాంత్, అశోక్, వేణు యాదవ్, భాస్కర్ పాల్గొన్నారు.

**అపురూప కాలనీలో కమిటీ హాల్ భవనం ప్రారంభం**

కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని సుభాష్‌నగర్ డివిజన్ అపురూప కాలనీలో నూతనంగా నిర్మించిన కమిటీ హాల్ భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే కెపి వివేక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ కమిటీ హాళ్లు ప్రజావసరాలకు ఉపయోగపడతాయని, అపురూపకాలనీయే కాకుండా ప్రక్కన ఉన్న కాలనీ వాసులకు ఈ కమిటీ హాల్ ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.

## ఘనంగా కన్యకాపరమేశ్వరి జయంతి ఉత్సవాలు



**ప్రజాపక్షం / కొడంగల్ :** ఆర్యవైశ్యుల కుల దైవమైన శ్రీ కన్యకా పరమేశ్వరి మాత జయతోత్సవాలను పురస్కరించుకుని కొడంగల్ పట్టణంలో వైభవంగా నిర్వహించారు. బుధవారం పట్టణంలోని నగరేశ్వర స్వామి ఆలయంలో శివునికి జలాభిషేకం నిర్వహించిన అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు. ఆర్యవైశ్య కుల సంఘ మహిళలు ఏకమై అమ్మవారికి కుంకుమార్చన, అష్టోత్తరం,అష్టోత్తర శతనామావళి పూజలను నిర్వహించారు. అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలను స్వీకరించిన అనంతరం ఆలయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షుడు కట్కం శివకుమార్ గుప్త, నందారం ప్రశాంత్, కొత్త ఎల్లయ్య గుప్త, చిదిరి వినోద్‌గుప్త, ఆకుల ప్రవీణ్ గుప్త, చిదిరి వీరన్నలతో పాటు మహిళ సంఘం సభ్యులు మమత, అనిత, హైమావతి, శ్రీదేవి, గాయత్రి, ప్రసన్నలతో పాటు తదితరులు పాల్గోన్నారు.

## ఫోకస్

# కళారంగం

## ప్రపంచ ప్రఖ్యాత జానపద నృత్యాలు

ప్రపంచ ప్రసిద్ధి జానపద కళారూపాల జాబితాను పరిశీలిస్తే ప్రతి ఒక్కటీ ఆయా దేశాల సంస్కృతి ప్రత్యేకతను ప్రతిబింబిస్తుంది. చైనాలో లయన్ డాన్స్, డ్రాగన్ డాన్స్ ఫేమస్. జపాన్ అనగానే బోన్ ఒడోరి గుర్తుకొస్తుంది. ఇండోనేసియాలో బరాంగ్ డాన్స్,కేచక్ డాన్స్, స్పెయిన్‌లో ఫ్లమెంకో, రష్యాలో కోసాక్ డాన్స్, ఐర్లాండ్‌లో



ఐరిష్ స్టెప్ డాన్స్, గ్రీస్‌లో సిర్టాకి, నైజీరియాలో, బాటా డాన్స్, దక్షిణ ఆఫ్రికాలో గుమ్ బూట్ డాన్స్, ఘనాలో కప్లా డాన్స్, బ్రెజిల్‌లో, సంబా, అమెరికాలో స్క్వేర్ డాన్స్, టాప్ డాన్స్, న్యూజిలాండ్‌లో హాకా (మాఒరి ప్రజల యుద్ధ నృత్యం), ఆస్ట్రేలియాలో అబారిజినల్ డ్రీమ్‌టైమ్ డాన్స్ ప్రఖ్యాతమైనవి. ఇక భారత దేశంలో ముఖ్యమైన జానపద నృత్యాల విషయానికి వస్తే, దేశంలోని పలు ప్రాంతాలు అనేక ప్రాంతీయ జానపద నృత్యాలకు నెలవు. వాటిలో కొన్ని ప్రసిద్ధమైనవి. భంగ్రా అనేది పంజాబ్ రాష్ట్రానికి చెందిన నృత్యం. ఇది సంతోషాన్ని, వేడుకలను ప్రతిబింబిస్తుంది. గర్బా , దాండియా రాస్ గుజరాత్ రాష్ట్రానికి చెందినవి. గర్బా మట్టి కుండలను పట్టుకుని చేస్తారు. దాండియా రాస్ కర్రలతో జరిపే నృత్యం. గమ్మత్ జానపద నృత్యం గోవాలో ప్రసిద్ధమైనది. మహారాష్ట్రానికి చెందిన లావణి జానపద నృత్యం వేగంగా పాడే పాటలతో అత్యంత ఆకర్షణీయంగా ఉంటుంది. తెలంగాణా ప్రాంతానికి చెందిన జానపద నృత్య రూపం బతుకమ్మ ఆట. గోమ్మటేశ్వర నృత్యం కర్ణాటకలో ప్రసిద్ధి చెందినది. కొలాటం దక్షిణ భారత దేశంలో, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో ప్రజల మధ్య ప్రాచుర్యం పొందిన కర్రల ప్రదర్శన. పులికళి కేరళ రాష్ట్రానికి చెందిన, పులి వేషధారణతో చేసే వినోదాత్మక నృత్యం. తెయ్యం కూడా కేరళలో ఆరాధనా ధర్మంతో కూడిన జానపద నృత్యం. భూమి నృత్యం మధ్యప్రదేశ్‌లో గోండ్ తెగల నృత్యం. చౌ నృత్యం పశ్చిమ బెంగాల్, ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాల్లో జరిగే మాస్క్ ధరించి చేసే యుద్ధ నృత్యం. బిద్ధి నృత్యం అసోంలో జరిపే ఒక ప్రత్యేక జానపద నృత్యం. రౌఫ్ అనేది కాశ్మీర్‌లోని మహిళలు చేసే ఉత్సవ నృత్యం. దుమ్మాల్ జమ్మూకశ్మీర్ ప్రాంతానికి చెందిన పురుషులు చేసే యుద్ధ నృత్యం. పొయక్కల్ కుదిరై తమిళనాడులో కాళ్లకు గుడ్డ గొర్రె పాదాలతో గుఱ్ఱపు ఆకారాన్ని ధరించి చేసే నృత్యరూపక విన్యాసం.



## ఉత్తమ కెరీర్‌కు 'ఫైన్ ఆర్ట్స్'




ప్రవృత్తినే వృత్తిగా ఎంచుకుంటే, ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు. ఎన్నో కళారూపాలు, సంప్రదాయాలు ఉన్నాయి. వాటిలో కొన్నింటిని ఏర్చికూర్చి, 'ఫైన్ ఆర్ట్స్' పేరిట విద్యార్థులకు శిక్షణనిస్తున్న ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు ఉన్నాయి. ఉత్తమ కెరీర్ కోరుకునే వారికి 'ఫైన్ ఆర్ట్స్' ఓ చక్కటి అవకాశాన్ని కల్పిస్తుంది. 'ఫైన్ ఆర్ట్స్' అంటే నైపుణ్యంతో కూడిన సృజనాత్మక కళలు. ఇవి మానవ భావోద్వేగాలను, సౌందర్యాన్ని, సృజనశక్తిని వ్యక్తపరిచే కళలు. 'ఫైన్ ఆర్ట్స్'లో ప్రధానంగా ఆరు విభాగాలు ఉంటాయి:ఫైన్ ఆర్ట్స్ విభాగాలు ఉంటాయి. వాటిలో మొదటిది చిత్రకళ (Painting). ఆయిల్ పేయింటింగ్, వాటర్ కలర్స్, అక్వారెల్, అక్రిలిక్ వంటి విధానాల్లో చిత్రాలు వేయవచ్చు. కాగా, శిల్పకళ (Sculpture) అనేది రాతి, లోహం, మట్టి మొదలైన పదార్థాలతో విగ్రహాలు, శిల్పాలు తయారు చేసే విధానం. సంగీతం (Music) గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. శబ్దాల ద్వారా భావాలను వ్యక్తపరచే కళ. దీనిలో శాస్త్రీయ సంగీతం, లలిత సంగీతం, ఆధునిక సంగీతం మొదలైన విభాగాలు ఉంటాయి. సంగీతంలోనూ కెరీర్ అద్భుతంగా ఉంటుంది. ఓకల్ (గాత్రం), ఇన్‌స్ట్రుమెంట్ (వాయిద్యం) ప్రక్రియలు అందుబాటులో ఉంటాయి. శరీరచలనాల ద్వారా భావప్రకటనను నాట్యంగా పేర్కోవచ్చు. భారత్‌నాట్యం, కూచిపూడి, కథక్ మొదలైన శాస్త్రీయ నృత్యరీతులు ఎన్నో ఉన్నాయి. నాట్య కళాకారులకు డిమాండ్ ఎక్కువ. నాటకకళ (Drama / Theatre) ఇటీవల కాలంలో మళ్లీ పుంజుకుంటున్నది. సుమారు మూడునాలుగు దశాబ్దాలుగా కళావిహీనమైన నాటక రంగం కొత్త చిగురులు వేయడం ఆనందకరం. కథానాయక పాత్రల్లో నటిస్తూ భావాలను, సంఘటనలను ప్రదర్శించే ఈ కళ, మిగతా వాటితో పోలిస్తే ఎంతో ఉత్తమమైనదిగా పేర్కొంటారు. సినిమా రంగం ఏ స్థాయిలో విస్తరించిందో అందరికీ తెలిసిందే. చిత్రీకరణ, స్క్రీన్‌ప్లే, నటన, దర్శకత్వం మొదలైన అంశాలతో కూడిన సమగ్ర కళను సినీ కళగా పేర్కోవచ్చు. మొత్తం మీద 'ఫైన్ ఆర్ట్స్' భావప్రకటనకు ప్రాధాన్యమిస్తాయి. అంతర్లీన అభిరుచులకు అనుగుణంగా కళా విధానాలను అభివృద్ధి చేస్తాయి. సృజనాత్మకతకు వేదికగా నిలుస్తాయి. భావోద్వేగాల చలనానికి మార్గంగా ఉపయోగపడతాయి. వీటి వల్ల కెరీర్ స్థిరపడడమేకాదు... మానసిక ఆహ్లాదం, సాంస్కృతిక పరిరక్షణ, వ్యక్తిత్వ వికాసం, సామాజిక సందేశాల వ్యాప్తి వంటి ఉపయోగాలు కూడా ఉన్నాయి.

## అనితర సాధ్యం..
# డాలీ విలక్షణత్వం!



సాల్వడార్ డాలి... పొడవాటి మీసాలతో విచిత్రంగా కనిపించే విలక్షణ చిత్రకారుడు. 1904, మే 11న స్పెయిన్‌లోని కాటలోనియా రాష్ట్రం ఫిగరస్‌లో జన్మించిన డాలీ జీవితం, కళా శైలి చాలా ప్రత్యేకమైనవి. సుమారు శతాబ్దకాలం క్రితమే చిత్రలేఖనంలో అధివాస్తవిక ధోరణులతో సంచలనం సృష్టించాడు. బాల్యంలోనే అతనిలో అసాధారణమైన ఊహాశక్తి కనిపించింది. అనూహ్యమైన భావోద్వేగాలను అభివృద్ధి చేసుకున్నాడు. మాడ్రిడ్‌లోని సన్ఫెర్నాండో అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో విద్యాభ్యాసం చేశాడు. కళాశాలలోనే అతని విలక్షణత్వం' స్పష్టమైంది. అహంకారిగా, మొండివాడిగా, విచిత్రమైన అభిప్రాయాలతో కూడిన వ్యక్తిగా ముద్రపడ్డాడు. అతని జీవితంలో కీలకమైన వ్యక్తి గాలా. ప్రముఖ ఫ్రెంచ్ కవి పాల్ ఎల్యులార్డ్‌ను వివాహం చేసుకున్న గాలాను డాలి ప్రేమించాడు. ఆరంభంలో డాలికి ఆమె వ్యక్తిగత కార్యదర్శిగా మారింది. అనంతరం వారిద్దరూ వివాహం చేసుకున్నారు. గాలా ప్రభావం డాలిపై ఎక్కువగా ఉందని అతనిని తెలిసిన వారు చెప్తారు. మొత్తం మీద విలక్షణమైన డ్రస్సింగ్ స్టైల్, తనదైన మీసం... ప్రవర్తన ద్వారా కూడా కళను జీవితం చేసినవాడు. సర్రియలిజం లేదా అధివాస్తవికత అతని చిత్రాల్లో కనిపిస్తుంది. కలలు, అపచేతన మేధస్సు ప్రపంచాన్ని కళగా మలిచిన డాలి శైలి చాలా కొత్తగా ఉంటుంది. సర్రియలిజాన్ని అత్యంత చక్కగా, శాస్త్రీయంగా ఉపయోగించి అనేక చిత్రాలు సృష్టించాడు. అసాధ్యమైన దృశ్యాలు ఎన్నో అతని బొమ్మల్లో కనిపిస్తాయి. కాలుగల కప్పలు, మృదువైన గడియారాలు వంటి చిత్రణ అతనికి ప్రత్యేక గుర్తింపు సంపాదించిపెట్టింది. హైపర్‌రియలిస్టిక్ స్టైల్‌తో, కలలు నిజమైనట్లు చూపించేవాడు. అపారమైన ప్రామాణికతతో గీసిన అసాధారణ దృశ్య స్వప్నాలు అతని ఆలోచనా శక్తికి, కొత్త పోకడలకు అద్దం పడతాయి. అర్థరహిత అనుభూతులను కళగా మార్చడం డాలి ప్రత్యేకత. 'ది పెర్సిస్టెన్స్ ఆఫ్ మెమరీ' (1931), 'మెల్టింగ్ క్లాక్స్' వంటి చిత్రాలు కాలానికి సంబంధించిన మన భావనల నాశనాన్ని సూచిస్తాయి. కలల ప్రపంచాన్ని తీక్షణమైన ప్రతిబింబంగా చూపించడంలో డాలి అత్యంత ప్రతిభావంతుడు. 'ది ఎలిఫెంట్స్' (1948) అనే చిత్రం అప్పుడేకాదు.. ఇప్పటికీ విచిత్రంగా కనిపిస్తుంది. లోతైన అర్థాలను గమనిచాలని సూచిస్తుంది. అందులో అతను చిత్రించిన పొడవైన కాళ్లతో ఏనుగులను పెరుగుతున్న భారీ, అసహజమైన స్థిరత్వానికి సంకేతంగా భావించవచ్చు. అదే విధంగా 'స్వాన్స్ రిఫ్లెక్టింగ్ ఎలిఫెంట్స్' (1937) జలవనరుల ప్రతిబింబంలో హంసలు ఏనుగుల్లా మారడాన్ని చూపుతాడు. అపచేతన భావనలు ఎలా మెలిపోతాయో ఈ చిత్రం వివరిస్తుంది. 'మెటామార్ఫోసిస్ ఆఫ్ నార్సిసిస్' (1937) చిత్రం నార్సిసిస్ పురాణాన్ని ఆధునిక, మానసిక దృష్టితో తిరిగి మలిచిన కృతి. సర్రియలిజాన్ని డాలి ప్రజాపరం చేశాడు. అపారమైన ప్రజాదరణతో, అధివాస్తవికతను ముఖ్య కళా ఉద్యమంగా మార్చాడు. ఆల్ఫ్రెడ్ హిచ్‌కాక్ చిత్రం 'స్పెల్‌బౌండ్' (1945)లో కలల సన్నివేశాలను డాలీ రూపొందించాడు. వాల్ట్ డిస్నీతో 'డెస్టినో' అనే ఎక్స్‌పెరిమెంటల్ యానిమేషన్ పండించాడు. పెయింటింగ్, శిల్పం, ఫ్యాషన్, సినిమా రంగాలతోపాటు రచయితగా కూడా డాలి ఎన్నో నూతన ప్రయోగాలు చేశాడు.






**వ్యక్తిత్వమే కళగా:** సజీవ ప్రదర్శనలతో, అతను తన జీవితాన్ని కూడా కళారూపంలో తీర్చిదిద్దుకున్నాడు.

**సంపూర్ణ విశ్లేషణ:** అపార ఊహాశక్తి... అత్యంత ప్రతిభాపూరిత సాంకేతిక నైపుణ్యం... కలలోని అస్పష్ట భావాలను స్పష్టంగా చూపే విశిష్ట దృష్టి డాలి ప్రత్యేకతలు. అతను చూపించిన కలలు అనేవి భయపడించేలా ఉండేవి కాదు... ఆశ్చర్యపరచేవి. మానవ అపచేతన మేధస్సు ఎంత గొప్పదో తెలియజేసేవి. 'I don't do drugs. I am drugs' (నేను మత్తు మందులు తీసుకోను. నేనే ఒక మత్తును) అనడం డాలి వంటి అసాధారణ ప్రతిభావంతుడిగా చెల్లింది. అతను కలల, భ్రమల, భయాల, ఆశ్చర్యాల ప్రపంచాన్ని అత్యంత అద్భుతమైన చిత్రాల్లో పట్టుకున్న గొప్ప కళాకారుడు డాలి 1982 జూన్ 10న తుదిశ్వాస విడిచాడు. భౌతికంగా దూరమైనప్పటికీ, తన విలక్షణమైన చిత్రాల ద్వారా నిత్యం మనల్ని పలకరిస్తునే ఉంటాడు.

# దేశంలో యుద్ధ వాతావరణం

● తీరు మార్చుకోని మోదీ ● హామీలపై ప్రజల్లో సన్నగిల్లుతున్న విశ్వాసం ● సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశంలో బాగం

**ప్రజాపక్షం/ఖమ్మం:** పహల్గాం దాడి తర్వాత దేశంలో యుద్ధ వాతావరణం నెలకొందని సరిహద్దుల్లో ఉద్రిక్తత చోటు చేసుకుంటుందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్న దానిని తుద ముట్టించాల్సిందేనని ఆయన తెలిపారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం బుధవారం బెజవాడ రవి అధ్యక్షతన స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన హేమంతరావు మాట్లాడుతూ మోదీ ఆలోచనలో ఎటువంటి మార్పు లేదని ప్రజల గురించి కాకుండా సంపన్న వర్గాల గురించి మాత్రమే ఆలోచిస్తున్నారన్నారు. ముఖ్యంగా వ్యవసాయ కార్మికులకు సంబంధించి పని దినాలు తగ్గించడం, వ్యవసాయ రంగాన్ని పూర్తిగా విస్మరించడం జరుగుతుందని ఆయన తెలిపారు. దేశంలో నెలకొన్న ఉద్రిక్తతను మత ఉన్మాదులు అవకాశంగా తీసుకోకుండా చూడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో జాప్యం జరుగుతుండడంతో ప్రభుత్వం పట్ల విశ్వసనీయత సన్నగిల్లుతుందని హేమంతరావు తెలిపారు. రైతు ప్రభుత్వంగా చెప్పుకునే రైతు రుణమాఫీ, రైతు భరోసా విషయంలో ప్రభుత్వం లక్ష్యం దిశగా పని చేయలేదన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే కేవలం 40 శాతం మాత్రమే రుణమాఫీ పూర్తయినట్లు తెలుస్తుందని హేమంతరావు అన్నారు. రైతు భరోసా నాలుగు ఎకరాల వరకు రైతుల ఖాతాల్లో వేశామని చెబుతున్నప్పటికీ అది కూడా అమలు కాలేదన్నారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో జరుగుతున్న జాప్యం రైతుల పాలిట శాపంగా మారిందని ఆయన తెలిపారు. కోతలు విధించడంతో పాటు కొనుగోళ్లలో లోపాలు ఉన్నాయని ఆయన తెలిపారు. రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేసే విషయంలో మిల్లర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆయన తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ముఖ్యమంత్రి వ్యాఖ్యలు ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమయ్యాయని భవిష్యత్తులో ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని హేమంతరావు తెలిపారు. రాష్ట్రంలో వ్యవసాయ కార్మికులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం పని దినాలను తగ్గించిందని సగానికి పని దినాలు తగ్గించడం వ్యవసాయ కార్మికుల జీవనోపాధిని దెబ్బతీయడమేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై స్పందించాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. రైతు బీమా, పంటల బీమా విషయంలో ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా పంటల బీమా అమలు కాకపోవడం శోచనీయమన్నారు. ప్రకృతి వైపరీత్యాలు ఇతరత్రా కారణాలతో పంటలు నష్టపోవడం జరుగుతుందని బీమా వర్తించక రైతులు ఆర్థికంగా చితికిపోతున్నారని హేమంతరావు తెలిపారు. శత వసంతాల సిపిఐ ముగింపు సభ ఖమ్మంలో జరగనుందని ఈ మహాసభకు 20 దేశాల నుంచి ప్రతినిధులు హాజరు కానున్నారన్నారు. ముగింపు సభకు ముందు మండల, జిల్లా, రాష్ట్ర జాతీయ మహాసభలు జరగనున్నాయని నిర్ణీత తేదీల్లో ఖమ్మంజిల్లాలోని అన్ని మండల మహాసభలను పూర్తి చేయాలని హేమంతరావు స్పష్టం చేశారు. కార్యక్రమాల నివేదికను జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ ప్రవేశపెట్టగా మహాసభలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా తదితరులు పాల్గొన్నారు.



## జమ్ముకశ్మీర్ సమస్య పరిష్కరించడంలో
# బిజెపి ప్రభుత్వం వైఫల్యం

● ఉగ్రవాదాన్ని అంతం చేసేందుకు సిపిఐ సంపూర్ణ మద్దతు ● మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి ● 27, 28 తేదీలలో జిల్లా మహాసభలు : మర్రి వెంకటస్వామి

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** భారతదేశంలో బిజెపి రాజకీయ విధానాలు వేరైనప్పటికీ సిద్ధాంత వైరుధ్యాలు ఉన్నప్పటికీ దేశంలో ఉగ్రవాదాన్ని అంతం చేయడం కోసం భారత ప్రధాని నరేంద్ర మోదీ తీసుకునే చర్యలకు సిపిఐ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి వెల్లడించారు. బుధవారం సిపిఐ జిల్లా కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న వెంకటస్వామి మాట్లాడారు. దేశంలో అత్యంత ప్రమాదకరమైన పరిస్థితులు నెలకొన్నాయని, నాడు భారత దేశం నుంచి పాకిస్తాన్ విడిపోయిన సందర్భంలో జమ్ముకశ్మీర్ స్వయం ప్రతిపత్తి కలిగి ఉండేదన్నారు. జమ్ముకశ్మీర్ సమస్య పరిష్కరించడంలో బిజెపి ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. పాకిస్తాన్‌లో ఉన్న ఉగ్రవాదులు, ఉగ్రవాద సంస్థలు జమ్ము కశ్మీర్‌లో ఇటీవల ప్రవేశించి పహల్గాంలో అమాయక ప్రజలపై కాల్పులు జరిపి చంపడం దుర్మార్గపు చర్య అని, ఆ ఘటన అనంతరం దేశంలో అంతరంగిక భద్రత సమస్యలు ఉత్పన్నమయ్యాయని, ఉగ్రవాదుల దాడులను నిలువరించడానికి కేంద్ర ప్రభుత్వం భారత సైన్యం సింధూర పేరుతో నిర్వహించే ఆపరేషన్ సిపిఐ స్వాగతిస్తుందన్నారు. చత్తీస్ఘడ్, తెలంగాణ బార్డర్‌లో మావోయిస్టులు , ఆదివాసీలపై దాడులను నిలిపివేయాలని కోరారు. కేంద్ర భద్రతా బలగాలు కర్రెగుట్ట ప్రాంతాన్ని చుట్టుముట్టి అమాయక ఆదివాసీలను, మావోయిస్టులను విచ్చలవిడిగా చంపడం అన్యాయమన్నారు. కేంద్ర ప్రభుత్వంతో మావోయిస్టులు చర్చలకు సిద్ధమని మూడుసార్లు లేఖలు పంపినా కేంద్రం పెడచెవిన పెడుతోందన్నారు. చర్చలు జరిపి సమస్యలు పరిష్కారం అయితే అంతరంగిక భద్రత సమస్య ఉండదని, ఇది నిరంతరం కొనసాగాలని దురుద్దేశ్యంతో కేంద్రం చర్చలకు పిలువకపోవడం సరికాదన్నారు. మావోయిస్టులు సైతం వ్యక్తిగత హింసకు తావు లేకుండా ఎవరినీ చంపకుండా జనజీవన స్రవంతిలో కలిసి ప్రజల కోసం పనిచేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై వామపక్ష లౌకిక ప్రజాస్వామ్య శక్తులను కలుపుకుని పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ విజ్ఞప్తి చేస్తుందన్నారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం పోలీసు బలగాలను వెనక్కు పంపించి శాంతి చర్చలు జరిపి ప్రజా సమస్యలను చర్చించి తగిన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. సిపిఐ దేశంలో ఆవిర్భవించి వంద సంవత్సరాలు అడుగిడిన సందర్భంగా దేశవ్యాప్తంగా డిసెంబర్ వరకు వందేళ్ల ఉత్సవాలు నిర్వహించుకుంటున్నామన్నారు. సిపిఐ సంస్థాగత నిర్మాణంలో భాగంగా ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు మహాసభలు నిర్వహించడం జరుగుతుందని, ఈ నేపథ్యంలో జిల్లాలో ఇప్పటికే 75 శాతం గ్రామశాఖ, ఏడు మండలాల మహాసభలు జరిగాయని తెలిపారు. మిగిలిన 9 మండలాలు, గ్రామశాఖ మహాసభలు పూర్తి చేసుకుని ఈ నెల 27, 28 తేదీలలో సిపిఐ జిల్లా మహాభసకరీంనగర్‌లో నిర్వహిస్తున్నామని , ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడవెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్ హాజరవుతున్నారని తెలిపారు. సమావేశంలో సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, న్యాలపట్ల రాజు, కిన్నెర మల్లవ్వ, ఏఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బోనగిరి మహేందర్, సిపిఐ నగర నాయకులు కొట్టె అంజలి, మాడిశెట్టి అరవింద్, నగునూరి రమేష్ తదితరులున్నారు.



## వలస ఆదివాసీలకు ఎస్‌టి కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలి

గిరిజనుల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా

**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** రెండు దశాబ్ధాలకు పైగా పెనగడప అటవీ ప్రాంతాల్లో స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్న ఆదివాసీలకు కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా ప్రభుత్వాన్ని, అధికారులను కోరారు. చుంచుపల్లి మండలం, పెనగడప గ్రామ పంచాయతీ పరిధిలోని పాలవాగు, జగ్గారం, మర్రిగూడెం, గడ్డిగుట్ట ఆదివాసీ గ్రామాల ప్రజల సమావేశం బుధవారం సిపిఐ జిల్లా కార్యాలయం 'శేషగిరిభవన్'లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సాబీర్ పాషా వలస ఆదివాసీలను ఉద్దేశించి మాట్లాడారు. ఇతర రాష్ట్రాల నుంచి దశాబ్దాల క్రితం గిరిజన ఆదివాసీలు స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నారని, వీరికి రెవిన్యూ శాఖా ద్వారా ధ్రువీకరణ పత్రాలు జారిచేయండంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఆదివాసీ గ్రామాల్లో వారికి కావాల్సిన త్రాగునీరు, రోడ్లు, విద్యుత్ వంటి సౌకర్యాలతో పాటు వైద్య సదుపాయం అందుబాటులోకి తెచ్చేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో సిపిఐ నాయకులు నీడాల సుధాకర్, కట్టా ఉదయ్, మన్నే వీరభద్దరావు, లక్ష్మణరావు, మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ఎర్రజెండా రాజ్యం రావడం ఖాయం

● భవిష్యత్ కమ్యూనిస్టులదే ● పెట్టుబడిదారీ విధానం పతనం తప్పదు ● సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** దేశ భవిష్యత్ కమ్యూనిస్టులపై ఆధారపడి ఉందని, రానున్న రోజుల్లో ఎర్రజెండాకు పూర్వ వైభవం రావడం ఖాయమని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని రంగాపురం గ్రామంలో వెలిదండ, రంగాపురం గ్రామాల సిపిఐ శాఖ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. పెట్టుబడిదారి విధానం పతనం ఖాయమని అన్నారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదారులకు, అధికారంలో ఉన్న పెద్దలకు అనుకూలమైనటువంటి నిర్ణయాలు చేస్తూ పేదలను విస్మరిస్తున్నారని ఆయన విమర్శించారు. దేశంలోని మతోన్మాద శక్తులు బిజెపి, దాని అనుబంధ సంఘాలు అధికారంలో ఉండటం వల్ల మైనార్టీ మతాలపై రోజు రోజుకు తీవ్రమైన దాడులు పెరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయడంలేదన్నారు. అత్యంత నిరుపేదలైన వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి రూ.12వేలు ఇస్తామని, అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తామని, విద్య, ఉద్యోగ నియమాకాలను పూర్తి చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి సంవత్సరం దాటిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రెండు లక్షలపై ఉన్న రుణం తీసుకున్న వారికి కూడా రెండు లక్షలు మాఫీ చేసి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. అంతకు ముందు పెద్ద ఎత్తున గ్రామంలో ర్యాలీ నిర్వహించి పార్టీ దిమ్మెలపై జెండాలను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, సిపిఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు పోటు పూర్ణచందర్‌రావు, కడియాల అప్పయ్య, ఎడ్ల అంజిరెడ్డి, మామిడి శ్రీనివాస్, సైదులు, తదితరులు పాల్గొన్నారు.



## 15 నుండి ఎఐవైఎఫ్ జాతీయ మహాసభలు

ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రీ



**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి :** అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) 17వ జాతీయ మహాసభలు ఈనెల 15నుండి18వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతి లో నిర్వహించడం జరుగుతుంద ని, ఈ సభలకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రీ అన్నారు. వరంగల్‌లోని శివనగర్ సిపిఐ ఆఫీస్ ఎదురుగా ఎఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభల పోస్టర్లను ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రీ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రీ మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో చరిత్రక, ఆధ్యాత్మిక, లౌకిక కేంద్రంగా ప్రపంచ ప్రసిద్ధి చెందిన తిరుపతిలో అఖిల భారత యువజన సమాఖ్య ఎఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభలు నిర్వహించడం జరుగుతుందని, ఈ మహాసభలకు దేశవ్యాప్తంగా 29 రాష్ట్రాల నుండి 1000 మందికి పైగా యువజన ప్రతినిధులు హాజరవుతున్నారన్నారు. బిజెపి ఎన్‌డిఎ కేం ద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న యువజన వ్యతిరేక విధానాలు, రాజకీయాలు, నియంతృత్వ కార్పొరేట్ విధానాలు, విద్యా, వైద్యం, ఉపాధి హక్కుల కోసం, సామాజిక, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక విలువలు తదితర అంశాలు, కార్పొరేట్ కబంధహస్తాల్లో నలుగుతున్న చట్టసభలు, రాజకీయాలు, మీడియా విలువలు, రక్షణ కోసం చర్చించి భవిష్యత్ కార్యాచరణ చేపట్టనున్నారు. మే 15 తేదీన మహాసభ ప్రారంభ రోజు వేలాది మంది యువతి, యువకులచే భారీ ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. దేశం కోసం తృణప్రాయంగా ప్రాణాలు అర్పించిన సర్దార్ భగత్ సింగ్, రాజగురు, సుగుదేవ్, చంద్రశేఖర్ ఆజాద్, అల్లూరి సీతారామరాజు, కన్నెగంటి హనుమంతు లాంటి అమరవీరుల వారసత్వాన్ని పునికి పుచ్చుకొని 1934లో ఏర్పాటైన రాష్ట్ర యువజన సమాఖ్య స్వతంత్ర అనంతరం 1959 మే 3వ తేదీన అఖిల భారత యువజన సమైక్యగా ఎఐవైఎఫ్ ఆవిర్భవించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి సుధీర్, హసీనా, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## నిత్యావసర ధరలు తగ్గించాలి

చిట్యాల మండల సిపిఐ కార్యదర్శి ఎండి అక్బర్

**ప్రజాపక్షం/చిట్యాల:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెరిగిన నిత్యావసర ధరలను వెంటనే తగ్గించేలా చర్యలు తీసుకోవాలని నల్లగొండ జిల్లా చిట్యాల మండల సిపిఐ కార్యదర్శి ఎండి అక్బర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం జరిగిన పార్టీ పట్టణ కౌన్సిల్ సమావేశం దేశగాని బాలరాజు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలపైన నియంత్రణ లేకపోవడంతో బ్లాక్ మార్కెట్ వ్యాపారస్థులు విచ్చలవిడిగా ధరలు పెంచుతూ ప్రజల పైన అధిక రేట్లు మోపడం జరుగుతుందన్నారు. ఆరుగాలం శ్రమించి రైతాంగం మార్కెట్‌లోకి ధాన్యం తరలిస్తే వాటి కొనుగోలులో జాప్యం జరగుతుండటంతో రైతులు ఆర్థిక ఇబ్బందులకు గురౌతున్నారని అన్నారు. ధాన్యం కొనుగోలులో వేగం పెంచాలని అక్బర్ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పట్టణ కార్యదర్శి షేక్ షరీఫ్, నాయకులు గుండాల సత్తయ్య, దండిగ నర్సింహ్మా, బాల్‌రెడ్డి, కె రామలింగయ్య, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు

**ప్రజాపక్షం/నూతన్‌కల్:** ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. బుధవారం మండల పరిధిలోని తాళ్ల సింగారం గ్రామంలో పాలేరు వాగుపై 3.48 కోట్ల వ్యయంతో నిర్మించే చెక్ డ్యామ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఈ చెక్ డ్యామ్‌ల నిర్మాణంతో భూగర్భజలాలు పెరగడంతో పాటు రైతులకు వ్యవసాయానికి కావాల్సిన నీరు అందుతుందని, దాంతో రైతుల పంట పొలాలు సస్యశ్యామలం అవుతాయని అన్నారు. ఏఐసిసి అత్యంత ప్రతిష్టాత్మకంగా దేశవ్యాప్తంగా తీసుకున్న జై బాపు, జై బీమ్ జై సంవిధాన్ పాదయాత్రలో భాగంగా పాల్గొని మాట్లాడారు. గాంధీ అహింస పద్ధతిలో పోరాటం చేస్తూ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచి స్వాతంత్ర్యం తేవడం జరిగిందన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం రిజర్వేషన్లు అమలు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెవిటి వెంకన్నయాదవ్, తుంగతుర్తి మార్కెట్ కమిటి చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ నాగం జయసుధ సుధాకర్‌రెడ్డి, తొనకునూరి సైదులు, పసుల అశోక్, బంటు బద్రి, గుగులోతు కృష్ణ పాల్గొన్నారు.

## సూర్యాపేట జిల్లాలో 31 మంది ఎఎస్‌ఐలకు కౌన్సిలింగ్ బదిలీ

ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా ఎస్‌పి నర్సింహ్మా




**ప్రజాపక్షం/సూర్యాపేట:** సూర్యాపేట జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్‌ల నందు పనిచేస్తూ మూడు సంవత్సరాలు సర్వీసును పూర్తి చేసుకున్న 31 మంది ఎఎస్‌ఐ లకు బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయం నందు కౌన్సిలింగ్ నిర్వహించి బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ నర్సింహా మాట్లాడుతూ కోరుకున్న చోటుకు పోస్టింగ్ ఇచ్చాం, అనుభవాన్ని ఉపయోగించి పోలీస్ సేవలు అందించాలని దిశా నిర్దేశం చేశారు. జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్ పనిచేస్తూ సుధీర్ఘకాలం ప్రజలకు సేవలందించిన అనుభవం ఉన్నదని, కష్టమైన పరిస్థితుల్లో కూడా ఉద్యోగం నిర్వహించి కానిస్టేబుల్ స్థాయి నుండి ఎఎస్ఐ స్థాయి వరకు ప్రమోషన్లు పొందారని, పూర్తిస్థాయి అనుభవాన్ని ఉపయోగించి ప్రజలకు మెరుగైన సేవలందించాలని కోరారు. పోలీస్ స్టేషన్‌లో స్టేషన్ హౌజ్ ఆఫీసర్‌కు, జూనియర్స్‌కు, తోటి సిబ్బందికి పనిలో సలహాలు ఇస్తూ ఆదర్శంగా ఉండాలన్నారు. స్టేషన్ పరిధిలో జరిగే అసాంఘిక కార్యకలాపాలు గుర్తించి నిరోధించడంలో కృషి చేయాలన్నారు. జిల్లా అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, అడ్మినిస్టేషన్ అధికారి మంజు భార్గవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ నాగభూషణరావు, సిబ్బంది ఉన్నారు.

## రైస్ మిల్లుల వద్ద దిగుమతులను వేగంగా చేయాలి : సబ్‌కలెక్టర్



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రైస్ మిల్లుల వద్దకు వచ్చే ధాన్యం లారీల నుంచి ధాన్యాన్ని వేగంగా దిగుమతి చేసుకోవాలని రైస్ మిల్లర్లకు సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ సూచించారు. బుధవారం పట్టణంలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో రైస్ మిల్లర్లతో ఐకేపీ సెంటర్ల నుంచి వస్తున్న ధాన్యం దిగుమతులపై సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ఐకేపీ సెంటర్ల నుంచి వస్తున్న ధాన్యం లారీలను మిల్ పాయింట్ల వద్ద దిగుమతులు చేసుకోవడంలో ఆలస్యం కావడంతో కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకపోతున్నాయని వర్షాలు వచ్చినట్లయితే ధాన్యం తడిసి రైతులు నష్టపోయే ప్రమాదం ఉన్నందు కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే ధాన్యం లారీలను దిగుమతులు చేసుకోవాలన్నారు. సమావేశంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, మిల్లర్స్ అసోసియేషన్ మిర్యాలగూడ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, పౌర సరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

## సమ్మర్ క్యాంప్‌లను సద్వినియోగం

**ప్రజాపక్షం/ జోగులాంబ గద్వాల ప్రతినిధి:** వేసవి సెలవుల్లో విజ్ఞానంతో పాటు వినోదాన్ని పొందు తూ పాఠ్య పాఠ్యేతర అంశాలను నేర్చుకునే అవకాశం సమ్మర్ క్యాంప్‌ల ద్వారా లభిస్తుందని, ఈ అవకాశాన్ని ప్రతీ విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. గద్వాల్‌లో హైదరాబాద్ లెర్న్ ఓ రామ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విశ్వం సమ్మర్ క్యాంప్‌ని బుధవారం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యేమాట్లాడుతూ పాఠశాలలో పుస్తకాలకే పరిమితమైన విద్యార్థులను ఎంతో సంతోషకరంగా ఎన్నో రకాల అంశాలతో వారి నైపుణ్యాన్ని వెలికితీయడానికి ఈ క్యాంపు ఉపయోగపడుతుందని తెలియజేశారు. పాఠశాల కరస్పాండెంట్ పత్తి శ్రీధర్ మాట్లాడుతూ గద్వాల్ జిల్లా విద్యార్థులకు మొట్టమొదటిసారిగా రోబోటిక్స్, ఏఐ టెక్నాలజీ వంటి ప్రతిష్టాత్మకమైన ప్రోగ్రామ్స్ ని అందించి వారిని కంప్యూటర్ రంగంలో తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందుకు ఎంతో గర్వంగా ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాలల అధ్యక్షులు బాబు నాయుడు, బీచుపల్లి, ప్రదీప్, మాజీ ఎంపీపీ విజయ్, మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, ప్రిన్సిపల్స్ రత్నం, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.



# తాలు, తరుగు తీయకుండానే...

ధాన్యం మిల్లులకు తరలించడంపై కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జికి షోకాజ్ నోటీస్

నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/నల్లగొండ(శాలిగౌరారం):** తాలు, తరుగు తీయకుండానే ధాన్యాన్ని మిల్లులకు పంపిస్తుండటం పట్ల ధాన్యం కొనుగోలు కేంద్రం ఇంచార్జ్ కి షోకాజ్ నోటీస్ జారీ చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు.బుధవారం ఆమె శాలిగౌరారం మండలం, రామగిరి శివారు లో ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిల్లులకు పంపించేందుకు సిద్ధంగా ఉన్న ధాన్యం బస్తాలను తనిఖీ చేయగా ఆ బస్తాలలో తాలు, తరుగు ఉండడంపై సెంటర్ నిర్వాహకులపై అగ్ర వ్యక్తం చేశారు. తాలు, తరుగు తీయకుండా పంపిస్తే మిల్లుల వద్ద ధాన్యం తిరస్కరించడం జరుగుతుందని, అలా ఎందుకు పంపిస్తున్నారని సెంటర్ ఇన్చార్జిపై ఆగ్రహం వ్యక్తం చేయడమే గాక షో కాజ్ నోటీస్ జారీ చేయాలని ఆదేశించారు.ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం వహించినందుకు గాను అవసరమైతే వచ్చే సంవత్సరం కేంద్రం బాధ్యతలను వేరొకరికి అప్పగిస్తామని తెలిపారు. ధాన్యం కొనుగోలులో నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని, సరైన తేమ శాతం ఉండి, తాలూ ,తరుగు లేకుండా ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. అంతేకాక ఈ ధాన్యం కొనుగోలు కేందర్ం చెరువుకు సమీపంలో ఏర్పాటు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేయడమే కాకుండా, వచ్చే సంవత్సరం కొనుగోలు కేంద్రాన్ని మార్చాలని చెప్పారు.పౌరసరఫరాల జిల్లా మేనేజర్ హరీష్ ,ఆర్డీవో వై. అశోక్ రెడ్డి, డి సి ఓ పత్యా నాయక్, తహసిల్దార్ యాదగిరి, తదితరులు ఉన్నారు.

### రైతులు ఒక్క రూపాయి కూడా ఎవ్వరికీ ఇవ్వొద్దు

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి :** ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యాన్ని లారీలలో మిల్లులకు తరలించే సమయంలో రైతులు ఒక్క రూపాయి కూడా ఎవరికి ఇవ్వాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు.బుధవారం మండలం పరిధిలోని శాపల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంను నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకస్మికంగా తనిఖి చేశారు. ఈసందర్భంగా కేంద్రం వద్ద రైతుల నుండి ఎవరైన డబ్బులు వసూలు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. అకాల వర్షం వల్ల ధాన్యం తడిచిపోకుండా తక్షణమే కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యాన్ని తరలించాలని ఆదేశించారు. రికార్డు లు సరిగ్గాలేనందున కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల మేనేజర్ హరీష్, ఆర్డిఓ అశోక్‌రెడ్డి, తహశీల్దార్ వెంకటేశ్వర్లు తదితరులు మండల అదికారులు పాల్గోన్నారు.

# సమన్వయంతో బాలకార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్




**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** అధికారులందరు సమన్వయంతో చేసుకుంటూ జిల్లాలో ఉన్న బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అన్నారు.బుధవారం కలెక్టర్ చాంబర్ నందు అసిస్టెంట్ లేబర్ కమిషనర్ అరుణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎలిమినేషన్, ఏరాడిక్షన్ ఆఫ్ చైల్డ్ అండ్ అడాలసెంట్ లేబర్ జిల్లా టాస్క్‌పోర్సు కమిటికి కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను పనులలో పెట్టుకుంటే యాజమానులపై కేసుతో పాటు జరిమాన వేసి చర్యలు తీసుకోవాలని తెలిపారు. వచ్చే 15 రోజులలో తహసిల్దార్లు, ఎంపీడీవోలు, మండల స్థాయి టాస్క్‌పోర్సు కమిటిలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇటుక బట్టీలు, ప్యాక్టరీలలో, దుకాణాలలో ఉన్న బాల కార్మికులను గుర్తించి వారిని బడిలో చేర్పించి వారికి హస్టల్ వసతి కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యవసాయ పనులకి తీసుకెళ్లకుండా వ్యవసాయశాఖ సిబ్బంది తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఇటుక బట్టీలు, ప్యాక్టరీ చట్టం ప్రకారం కార్మికశాఖలో రిజిస్టేషన్ చేసుకోవాలని, కార్మికులు ఎంతమంది ఉన్నారు. వారి ప్రాంతం వయస్సులతో సంబంధించిన వివరాలు రిజిస్టేషన్ చేసుకోవాలని, లేకపోతే తనిఖీలు చేపట్టాలని, బొగ్గు బట్టిలపై అటవీశాఖ అధికారులు తనిఖీలు చేయాలని సూచించారు. సంచార జాతులకి సంబంధించిన వారి పిల్లలను ఇటుక బట్టిలకి వారు చిన్న పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల నుండి రేషన్ ఇప్పించాలని, 518 సంవత్సరాల లోపు వేల్పేర్ హాస్టల్‌లో చేర్పించాలని సూచించారు. ఈ సమావేశంలో సహాయ కార్మిక కమిషనర్ అరుణ, జిల్లా ప్రోటక్షన్ ఆఫీసర్ రవికుమార్, డిఆర్‌డివో పిడి అప్పారావు, డిపివో యాదయ్య, డిడబ్ల్యూఓ నర్సింహరావు, చైల్డ్ వెల్పేర్ కమిటి చైర్మన్ రమణరావు, డిఎంహెచ్‌వో కోటచలం, ఇండ్రస్టిస్ జిఎం సీతరాంనాయక్, వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి, మోప్మా పిడి రేణుక, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



## కార్మిక హక్కులను కాలరాస్తున్నారు

కేంద్రంపై ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఇమ్రాన్ ధ్వజం

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** మే 20వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఇమ్రాన్ పిలుపునిచ్చారు. బుధవారం పోచంపల్లి పట్టణ కేంద్రంలో కోదండరాంరెడ్డి పెద్దన్న భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ అనేక చట్టాలను మారుస్తూ లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మికుల శ్రమను దోచి పెట్టుబడిదారులకు ధారాదత్తం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా గ్రామ స్థాయి నుండి పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొని కార్మికుల హక్కులను కాపాడుకోవాలని దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు అందరూ పాల్గొనాలని అన్నారు. రైతు వ్యతిరేక నల్ల చట్టాల రద్దు కోసం అనేక పోరాటాలు నిర్వహించి రైతు చట్టాలను వ్యతిరేకంగా పోరాడిన స్ఫూర్తితో కార్మిక వ్యతిరేక లేబర్ కోడులకు వ్యతిరేకంగా పోరాడాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కమిటీ సభ్యులు మంచాల మధు, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు చేరాల లింగయ్య అధ్యక్షతన ఏ ఐ టి యు సి జిల్లా సహాయ కార్యదర్శి గనబోయిన వెంకటేష్, సిపిఎం పట్టణ కార్యదర్శి దుబ్బాక జగన్, సిపిఐ మండల కార్యదర్శి గోడల్ల భూషణ్, గీత పనివారాల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పబ్బు యాదయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు చేరాల లింగయ్య, సిఐటిసి నాయకులు వడ్డే పల్లి యాదగిరి, రజినీకాంత్, ఆటో యూనియన్ మండల అధ్యక్షులు కొండమడుగు సత్తయ్య పాల్గొన్నారు.

## మతోన్మాద బిజెపిపై వ్యతిరేకంగా పోరాటం

సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/అనంతగిరి:** మతోన్మాద బిజెపికి వ్యతిరేకంగా పోరాడాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో దేగ వీరయ్య, బాణాల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన పార్టీ మండల మూడవ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. కేంద్రంలోని మోడి ప్రభుత్వం కులం, మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెడుతూ పాలన సాగిస్తున్నాడని అన్నారు. వ్యవసాయ, కార్మిక విధానాలను అనుసరిస్తూ కార్పోరేట్ శక్తులకు కొమ్ము కాస్తుందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాల్సిన అవసరం అసన్నమైందన్నారు. నాటి నుండి నేటి వరకు పేదల పక్షాన పోరాడిదే కేవలం ఎర్రజెండా మాత్రమేనని అన్నారు. అనంతరం నూతన మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బద్దం కృష్ణారెడ్డి, బత్తినేని హనుమంతరావు, నూకల శ్రీను, వాకా పుల్లారెడ్డి, బాణోతు కోటేశ్వరరావు పాల్గొన్నారు.



# అకాల వర్షం...తడిసి ముద్దైన ధాన్యం

**ముషంపల్లి రైతులు కన్నీరు మున్నీరు**





**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నల్లగొండ మండలంలోని ముషంపల్లి గ్రామంలో బుధవారం తెల్లవారుజామున కురిసిన అకాల వర్షానికి ఐకెపి కేందర్ంలో ఉన్న వరి ధాన్యం తడిసి ముద్దై వరద నీరుకు ధాన్యమంత కొట్టుకుపోయింది. ఆరుగాలం రైతు శ్రమించి వ్యవసాయం సాగు చేసి వరి ధాన్యం పండిస్తే అకాల వర్షంతో పంట అంతా నష్టపోయి రైతులు జోరున విలపిస్తున్నారు. రైతు పండించిన పంటను ఐకెపి కేంద్రాలకు తరలిస్తే అక్కడ ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో నెలల తరబడి ధాన్యం రాశులు అక్కడే ఉండడంతో అకాల వర్షానికి ధాన్యం రాశులు తడిసి ముద్దయి వరదలో కొట్టుకుపోతుంటే రైతులు అల్లాడిపోతున్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో జాప్యం చేయడంతో రోజులు తరబడి ధాన్యం రాశులు నిల్వ ఉండడంతో అకాల వర్షాలకు తడిసి ముద్దాయితున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి త్వరితగతిన ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా అకాల వర్షాలతో తడిసిపోయిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు మద్దతు ధర కల్పించాలని కోరారు.

# బునాదిగాని కాల్వ పనులు పూర్తైన వెంటనే సాగునీరు

ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/బీబీనగర్:** బునాదిగాని కాల్వ పనులను వెంటనే పూర్తి చేయాలని భోనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని మక్తరం తారం గ్రామం ఎర్రగుంట వద్ద కాల్వ పనులను ఇరిగేషన్ శాఖ ఉన్నత అధికారులతో కాల్వను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయకట్టు రైతులు పడుతున్న ఇబ్బందులను చూసి రాష్ట్ర మంత్రివర్యులు ఉత్తమ కుమార్ రెడ్డికి వినతి పత్రం అందజేసిన వెంటనే కాల్వ మరమ్మత్తులు వెడల్పు కోసం రూ. 500 కోట్ల రూపాయలను వెంటనే మంజూరు చేశారన్నారు. కాల్వ ద్వారా నీరు రాక కొంతమంది రైతులు ఇబ్బంది పడుతుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెరువుతో నిధులు మంజూరు చేయించి టెండర్లు పిలిపించిన అనంతరం బుధవారం రైతులు ఉన్నత అధికారులతో కాల్వ పనులను పరిశీలించారు. నాలుగున్నర కిలో మీటర్లు కాల్వ వెడల్పు లేక పోవడం వల్ల అడ్డగూడూర్ ధర్మారం వరకు సాగునీరు అందక పోవడం చూడలేక రాష్ట్ర ముఖ్యమంత్రి చొరవతో మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి తో నిధులు మంజూరు చేయాలని కోరారు. రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాల్వ పనులు పూర్తయిన వెంటనే సాగునీరు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ కసిరెడ్డి నారాయణరెడ్డి, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు, ఆర్డీవో కృష్ణరెడ్డి, స్పెషల్ డిప్యూటి కలెక్టర్ లాండ్ ఎక్వసేషన్ జగ్గన్నాదరావు, ఇరిగేషన్ యస్సి వెంకటేశ్వర్లు, ఈఈ పోచమల్లు డీఈ లావణ్య, తహసిల్దార్ భగత్, సింగల్ విండో వైస్ చైర్మన్ గడ్డం బాలకృష్ణ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సురకంటి సత్తిరెడ్డి నాయకులు గోలి పింగళి రెడ్డి సంధి బసవయ్య, బద్దం వాదేవ్ రెడ్డి, కిలేందర్, నాయకులు పాల్గొన్నారు.



## తూకంలో తేడా రావొద్దు

జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు



**ప్రజాపక్షం/చివ్వెంల:** కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తుకాల్లో ఏమాత్రం తేడా రావద్దని జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు కోనుగోలు కేంద్రాల నిర్వాహకులను అదేశించారు. బుధవారం చివ్వెంల మండలంలోని వట్టిఖమ్మంపాడు1, వాల్యాతండా, అక్కలదేవిగూడెం గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్లలో తాలు, చెత్త చేదారం లేకుండా ధాన్యాన్ని శుభ్రపర్చి అమ్మకానికి కొనుగోలు కేంద్రానికి తీసుకరావాలని కోరారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. వట్టిఖమ్మంపాడు నుండి 16584 క్వింటాళ్లు, వాల్యాతండా నుండి 17505 క్వింటాళ్లు, అక్కలదేవిగూడెం నుండి 5574 క్వింటాళ్లు కొనుగోలు చేసి మిల్లులకు తరలించినట్లు తెలిపారు. వాల్యాతండా కొనుగోలు కేంద్రంలో కాంటా వేస్తున్న ధాన్యాన్ని పరిశీలించి, రైతులకు ఏమైన సమస్యలున్నాయా అడిగి తెలుసుకున్నారు. పిపి వెంకన్న, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు శిరిష, మల్లేశ్వరి, శైలజ, ప్రియాంక, గంగమ్మ పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ సత్తా చాటుదాం

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్పరాజు రామలింగయ్య



**ప్రజాపక్షం/చండూరు:** ప్రతి కార్యకర్త సైనికుడిలా కష్టపడి పనిచేస్తూ రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలపేలక్ష్యంగా ముందకుసాగాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్పరాజు రామలింగయ్య , మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం చండూరు మండలం బంగారి గడ్డ గ్రామంలో జరిగిన సిపిఐ శాఖ మహాసభకు వారు ముఖ్య అతిథిగా హాజరైయారు. గ్రామంలోని భగత్ సింగ్ బిసి కాలనీలో పార్టీ అరుణ పతాకాన్ని మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ ఎగురవేశారు. అనంతరం జరిగిన మహాసభలో రామలింగయ్య మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ కష్ట జీవుల కోసం ,వ్యవసాయ కూలీల కోసం ,కార్మిక వర్గం కోసం అనునిత్యం పోరాటాలు చేసే ఏకైక పార్టీ సిపిఐ అన్నారు. భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాటాలు నిర్వహించి భూమి లేని నిరుపేదలకు భూములు పంచిన ఘనత భారతకమ్యూనిస్టుపార్టీదేనని అన్నారు. సిపిఐని గ్రామంలో బలోపేతం చేసుకుంటూ త్వరలో రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేసి గెలుపే లక్ష్యంగా పనిచేయవలసిన అవసరం ఉందని అన్నారు. సిపిఐ మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో సిపిఐ బలోపేతం కోసం కృషి చేయాలని పార్టీ శ్రేణులకు చూచించారు. మే 12న దోనిపాముల గ్రామంలో జరుగు మండల 15వ మహాసభకు పార్టీశ్రేణులు అధ్యతిక సంఖ్యలో తరలివచ్చి మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామశాఖ నూతన కార్యదర్శిగా పల్లె నర్సింహ్మా తిరిగి ఏకగ్రీవంగా ఎన్నికైయారు. గ్రామ శాఖ సహాయ కార్యదర్శి కొండ్రెడ్డి సాయి కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ , మండల పార్టీ సహాయ కార్యదర్శులు పల్లె యాదయ్య, బొడ్డు వెంకటేశ్వర్లు , మండల కార్యవర్గ సభ్యులు బరిగెల వెంకటేశం , కర్నాటి వెంకటేశం , సిహెచ్ ఊషయ్య, ఇరిగి సంజీవ,శాఖ కార్యదర్శి పల్లె నర్సింహ్మా, మాజీ సర్పంచ్‌లు బోయపల్లి జంగయ్య , బిక్షమయ్య , గీత పనివారల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పల్లె శంకరయ్య , ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డం నవీన్ , మాదగోని శ్రీశైలం , నాయకులు జక్కలి పరమేష్ , బోయపల్లి శివలింగయ్య,పల్లె మల్లేశం , శ్రీను, వెంకటేశం , రమేష్ పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## విద్యార్థులకు బహుమతులు అందజేత




**ప్రజాపక్షం/బిజినేపల్లి :** మండలంలోని తోటపల్లి సుబ్రహ్మణ్యం మెమోరియల్ హైస్కూల్‌లో గత నాలుగురోజులనుండి చిత్రలేఖనం, సైన్స్, మ్యాథ్స్ ఇతర అంశాలపై ప్రతిభకనబర్చిన విద్యార్థులకు నిర్వాహకులు నరసింహారావు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 30వరకు విద్యార్థులకు ప్రత్యేకించి చిత్రలేఖనం, సైన్స్, మ్యాథ్స్ ఇతర అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. దీనిలోభాగంగా వారంవారం ప్రతిభకనబర్చిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జగత్‌రెడ్డి, సురేష్‌బాబు, తిరుపతయ్య, ప్రమోద్‌కుమార్, ప్రవీణ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## పోలీసు జాగిలంతో ఆకస్మిక తనిఖీలు

జిల్లా ఎస్‌పి యోగేష్ గౌతమ్



**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** బుధవారం రోజు మక్తల్ మండలం కేంద్రంలో నార్కోటిక్స్ స్నైపర్ పోలీసు జాగిలంతో పలు ప్రదేశాలలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించడం జరిగిందని డిఎస్‌పి ఎన్. లింగయ్య తెలిపారు. గంజాయి మత్తు పదార్థాల నిర్మూలన గురించి, అక్రమ రవాణా జరగకుండ మ క్తల్ పట్టణంలో పకడ్బందీగా తనిఖీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా కిరాణా షాపులలో, అనుమానంగా ఉన్న పంట పొలాల్లో, పన్ షాప్‌లలో తనిఖీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రజలు, ఎవరైనా గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు వినియోగిస్తున్న లేదా రవాణా చేసిన, సరఫరా చేసిన వెంటనే డయల్ 100కు కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుంది అని డిఎస్‌పి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎచ్‌పి. బలరాం, నార్కోటిక్స్ స్నైపర్ డాగ్ విక్కి, డాగ్ హ్యాండ్లర్ నరేందర్ పాల్గొన్నారు.

## భారత ఆర్మీ దాడిని స్వాగతిస్తున్నాం

మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్॥ వాకిటి శ్రీహరి



**ప్రజాపక్షం/ మక్తల్ :** పహల్గాం ఉగ్ర దాడికి నిరసనగా బుధవారం తెల్లవారుజామున భారత ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా పాకిస్తాన్ తో పాటు పిఓకేలోని 9 ఉగ్ర స్థావరాలపై భారత వాయిసేవ దళాలు దాడి చేసి ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసి ఉగ్రమూకలను తుద ముట్టించడాన్ని స్వాతిస్తున్నామని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఓ ప్రకటనలో తెలియజేశారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా దానిని అంతం చేయాల్సిందేనని, ఉగ్రవాద నిర్మూలనతో భారత ప్రభుత్వానికి వంద శాతం మద్దతు పలుకుతున్నామని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే వాకిడి శ్రీహరి ఆదేశాల మేరకు మక్తల్ పార్టీ కాంగ్రెస్ నాయకులు. మక్తల్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి అంబేద్కర్ చౌక్ వరకు జాతీయ జెండాను చేత పట్టుకొని ర్యాలీ తీశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం




**ప్రజాపక్షం/మద్దూర్ :** ఏరా ఎలాగున్నావ్ ఎనాళ్లయిందో మిమ్మల్ని చూసి ఇంట్లో అందరూ బాగున్నారా అంటూ ఒకప్పటి బాల్య స్నేహితులు 35 సంవత్సరాముల తర్వాత కలుసుకున్నారు. వివరాల్లోకెత్తే ఉమ్మడి మద్దూర్ మండలంలోని భూనీడ్ గ్రామంలో 1989–90 ఏడవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సమ్మేళనంలో 1989 ఉపాధ్యాయులను శాలువాలు, మేమేంటోతో ఘనంగా సన్మానించారు. ఉపాధ్యయులు తర్వాత ఒక్కసారిగా కలుసుకోవడంతో అందరూ బాలలుగా మారి ఆనందోసహాలతో తమ అమ్యూలమైన సమయాన్ని కొద్ది గంటల పాటు గడినారు. కరాచలనాలు, కౌగిలింతలతో తమ కలయికను పూర్తికానివ్వక చిన్నప్పటి అనుభవాలను తమ కలయికను పూర్తికానివ్వక చిన్నపటి అనుభావాలను నెమరు వేసుకుంటు మనస్ఫూర్తిగా నవ్వుకున్నారు. ఏన్నో భావోద్వేగాల మధ్య తమకు దొరికిన కొద్ది మధుర క్షణాలను ఆనందంగా గడిపారు. తన ఒడిలో విద్యను అభ్యసించిన చిన్నారులను చూసుకుని వారు చదివిన పాఠశాల కూడా ఎంతో మురిసిపోయింది. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మహిపాల్ గౌడ్, సవారి శీను, గోవర్దన్ రెడ్డి, కిషన్ సింగ్,, కృష్ణ నర్సిములు, దామోదర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఇందిరా పద్మ మాధవులు, మహిపాల్ రెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు స్నేహబంధాలను పెంపొందిస్తాయి



**ప్రజాపక్షం/వెల్దండ :** క్రీడలు మానసికోల్లాసంతో పాటు స్నేహబంధాలను కలిగిస్తాయని మాజీ వైస్‌ఎంపిపి అనిల్‌కుమార్ అన్నారు. బుధవారం మండలపరిధిలోని రాచూర్ గ్రామంలో నిర్వహిస్తున్న ఆర్పిఎల్5 సీజన్ పోటీలను అనిల్‌కుమార్ సందర్శించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటమిని చూసి నిరాశచెందకూడదని క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. యువత బెట్టింగ్‌లాంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. చిన్నతనం నుంచే క్రీడలపట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ జయమ్మపర్వతాలు, క్రీడాకారులు నాగేష్, రాజు, పురన్‌చంద్, శ్రీనివాస్, నిరంజన్, క్రాంతి, రమేష్, వెంకటేష్, ప్రహ్లాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.


## నూతన కోర్టు భవనాలకు నిధులు మంజూరు చేయాలి



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** కల్వకుర్తిలో నూతనకోర్టు భవనాల నిర్మాణానికి పరిపాలన అనుమతులతోపాటు నిధులు కేటాయించాలని బార్ ఆసోసియేషన్ అధ్యక్షులు నరేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం పట్టణంలోని బార్ ఆసోసియేషన్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కల్వకుర్తికోర్టు భవనం 1938లో నిర్మాణం జరిగిందని, ప్రస్తుతకోర్టు భవనం శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. కల్వకుర్తిలో జూనియర్ సీనియర్ కోర్టు కేసులు ఎక్కువగా పెండింగ్‌లో ఉండటంతో పట్టణంలో ఆడిషనల్ డిస్ట్రిక్‌సెషన్స్ జడ్జికోర్టు(ఏడిజే), ఆడిషనల్ మెజిస్ట్రేట్‌కోర్టు(ఏడిఎం) ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి సహకారంతో ఫైల్స్ తడవకుండా తాత్కాలిక ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారని తెలిపారు.కార్యక్రమంలో వైస్‌ప్రెసిడెంట్ జయంతికుమార్, జాయింట్‌సెక్రటరీ మల్లేష్, అడ్వైజరీ వెంకటరెడ్డి, లక్ష్మినారాయణ, అమరేందర్, రాంగోపాల్, నాగరాజు, ప్రశాంత్, జంగయ్య, శ్రీకాంత్, సుభాష్, నరేష్, వెంకటరమణ, లక్ష్మణరాజు పాల్గొన్నారు.

# మతిభ్రమించి మాట్లాడుతున్న కెటిఆర్

ఎమ్మెల్యే మేఘారెడ్డి



**ప్రజాపక్షం / వనపర్తి :** ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిపై నిరాధార ఆరోపణలు చేస్తూ మతి భ్రమించినట్లుగా మాట్లాడితే ఊరుకునేది లేదని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. తండ్రి చాటు బిడ్డగా రాజకీయాల్లోకి వచ్చి పదేళ్ల అవినీతి అధికారం అనుభవించిన నువ్వా మా సిఎం గురించి మాట్లాడేది తెలంగాణ అమరవీరుల త్యాగాల చితిమంటల మీద పదేళ్ల పాటు రాష్ట్రాన్ని దోచుకుంది నువ్వు, మీ నాన్న కెసిఆర్ కాదా అన్నారు. పదేళ్ల పాటు రాజభోగాలు అనుభవించి తెలంగాణ ప్రజలకు చిప్ప మిగిల్చింది మీరు కాదా అన్నారు. మీరు తెలంగాణను ఎలా దోచుకున్నరన్న దాని గురించే కదా మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు, ఉద్యోగులు చెప్పారు. వారికి వాస్తవ పరిస్థితిని వివరించారు. పదేళ్లలో ప్రభుత్వ ఉద్యోగులను ఎంత హీనంగా చూశారో అందరికి తెలుసన్నారు. మీ హయంలో ఏనాడైన మొదటి తేదీన ప్రభుత్వ ఉద్యోగులు జీతాలు తీసుకున్నారా ఒక రోజైనా వాళ్లను పిలిచి మాట్లాడారా ... ఉద్యోగుల పైన ప్రేమ ఉంటే 8వేల కోట్ల రూపాయల బకాయిలు ఎందుకు పెట్టి పోయారు. ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వడం చేతకాక వాళ్ల పదవీ విరమణ వయస్సును 61 ఏళ్లకు పెంచారు. ఆర్‌టిసి కార్మికులపై కెసిఆర్ తెగ ప్రేమ చూపిస్తున్నాడు. 2019లో ఏకంగా 52 రోజుల పాటు ఆర్‌టిసి కార్మికులు సమ్మె చేసినా పట్టించుకోని నియంతలు మీరు మీ ప్రభుత్వ వైఖరి వల్ల ఖమ్మంలో ఆర్‌టిసి డ్రైవర్ శ్రీనివాస్ రెడ్డి పట్టపగలు పెట్రోల్ పోసుకొని తగలపెట్టుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ నాడు మీరు పట్టించుకోలేదన్నారు. మీరు ప్రభుత్వ ఉద్యోగులపైన ప్రేమ చూపించడం అంటే హత్య చేసినోడే సంతాపం తెలిపినట్లుందన్నారు. ముఖ్యమంత్రి రాష్ట్ర ఉద్యోగులకు ఆర్థిక పరిస్థితి గురించి, మీరు చేసిన అప్పుల గురించి వివరించారు. ఆర్థికంగా క్లిష్ట పరిస్థితి ఉన్నప్పటికి ఇప్పటికే మీరు పెండింగ్ పెట్టిన మూడు డిఎల్లో ఒకటి ఇచ్చాం .. వచ్చే నెల నుంచి పెండింగ్ బకాయిలు విడతల వారిగా విడుదల చేయబోతున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పైన కెటిఆర్ వ్యక్తిగత విమర్శలు చేసి పైశాచికి ఆనందాన్ని పొందుతున్నాడు. బట్టకాల్చి మీదేసి కెటిఆర్ శాడిస్ట్‌లా ఆనందపడుతున్నాడు. కాగితాలు బయట పెట్టు మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 42 సార్లు ఢిల్లీ వెళ్లారు. ఇంకా వెళ్తారు. ఆయన రహస్యంగా వెళ్లలేదు శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుంచి బహిరంగంగానే ఢిల్లీ వెళ్లారు. నీ చెల్లి కవిత లాగా రహస్యంగా ఢీల్లి వెళ్ల లేదు ... నీ లాగా దుబాయ్ వెళ్లలేదు అని ఆయన మండిపడ్డారు. కేసిఆర్ హైదరాబాద్ నుంచి స్పెషల్ ఫ్లైట్ వేసుకొని తానా తందానా బ్యాచ్ తో సింగపూర్ , చైనా వెళ్లాడన్నారు. ఫాంహౌస్, గెస్ట్ హౌస్‌లు , విల్లాలు ఎలా వచ్చాయో చెప్పాలన్నారు.

## ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమంలో వృద్ధులు, దివ్యాంగుల అర్జీలు స్వీకరణ



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** వృద్ధులు, దివ్యాంగుల సమస్యల పరిష్కారం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అర్బన్ తాహసీల్దార్ కార్యాలయంలో మొదటిసారిగా వృద్ధులు, దివ్యాంగుల కోసం నిర్వహించిన ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ స్థానిక సంస్థల అదనపు కలెక్ట ర్ శివేంద్ర ప్రతాప్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వయోవృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రతి నెల మొదటి బుధవారం నిర్వహించే ప్రత్యేక ప్రజావాణిలో తమ తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చన్నారు. ఈ ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమంలో 38 మంది అర్జీలను ఆమె స్వీకరించి అక్కడే ఉన్న సంబంధిత అధికారులను సమస్యల పరిష్కరానికి స మాలోచనలు చేశారు. సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జగపతిరావు మా ట్లాడుతూ స్థానికంగా ఉన్న కొన్ని సమస్యలను కలెక్టర్ దృష్టికి తేగా వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు డిఆర్‌డిఒ బోజప్ప, నగరపాలక సంస్థ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, జిల్లా మహిళాశిశు సంక్షేమ అధికారిని జరీనాబేగం, అర్బన్ తాహసీల్దార్ ఝా న్సీరాం, ఎల్‌డిఎం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు

జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి




**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ ప్రతినిధి :** వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మండల ప్రత్యేక అధికారులు ఎంపిడిఒలు, ఎంపిఒలు, మిషన్ భగీరథ ఇంజినీరింగ్ అధికారులతో మండలాల వారీగా తాగు నీటి సరఫరాపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవిలో తాగు నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని, ఎక్కడైనా పైపులైన్ లికేజీలు, పైప్ లైన్ డ్యామేజ్‌లను గుర్తించి వెంటనే రిపేర్‌లు చేయాలని, ఆదేశించారు. సిసి. కుంట మండలంలో 13 హ్యాబి టేషన్‌లలో వనపర్తి జిల్లా రామనపాడు, నల్ల ద్వారా లీకేజీ తదితర కారణంగా గ్రిడ్ వాటర్ తక్కువగా వస్తుందని కలెక్టర్ దృష్టికి రాగా, తాగు నీటి సరఫరా మెరుగు పరచాలని మిషన్ భగీరథ గ్రిడ్ అధికారులను ఆదేశించారు. అడ్డాకుల మండలంలో బలీద్‌పల్లి, కన్ననూర్ గ్రామంలో వనపర్తి నల్ల ద్వారా సరిపడా తాగు నీటి రావడం లేదని తెలుపగా మే 15లోగా తాగు నీటి సరఫరా మెరుగు పరచాలన్నారు. ప్రతి ఇంటికి నీటి కొరత లేకుండా నీరు అందేలా చూడాలని, మోటార్లు మరమ్మతులు ఉన్న చోట నీటి కొరత లేకుండా ట్యాంకర్లు, బోర్వెల్, బావులు వంటివి ఏర్పాట్లు చేయాలని, డిమాండ్ కంటే తక్కువ సప్లై ఉంటే తగిన సప్లై చేయాలని, మే 15వ తేదీ లోగా ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు లేకుండా రిపేర్లు వంటివి చేయాలని. ఏమైనా ప్రతిపాదనలు వుంటే పంపించాలని వెంటనే మంజూరు చేస్తామని తెలిపారు. వేసవిలో ప్రజలకు తాగునీరు అందించడంలో ఎలాంటి సమస్య లేకుండా చూడాలన్నారు. ఈ సమావేశం లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, మిషన్ భగీరథ ఎస్‌ఇ జగన్మోహన్, జిల్లా పరిషత్ సిఇఒ వెంకట్ రెడ్డి, డిపిఒ పార్థ సారథి, డిఆర్‌డిఒ నర్సింహులు, మిషన్ భగీరథ గ్రిడ్ ఇనాన్‌చార్జి ఇఇ శ్రీనివాస్, ఇంట్రా ఇఇ పుల్లారావు, ఎంఎస్‌ఒలు ఎంపిడిఒలు, ఎం.పిఒలు, ఎఇలు , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 20న సమ్మెకు నోటీసులు అందజేసిన ఆస్పత్రి కార్మికులు



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** లేబర్ కోడ్‌ల రద్దుకై కాం ట్రాక్టు ఔట్సోర్సింగ్, ఉద్యోగులను కార్మికులను పర్మనెంట్ చేయాలని, కాలం చెల్లిన టెండర్లను రద్దుచేసి కార్మికులకు కనీస వేతనం 26వేలకు పెంచాలని, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల నిరసిస్తూ మే 20న జరుగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూ పరిటెండెంట్ డాక్టర్ సంపత్ కుమార్ సింగ్‌కి డి మాండ్ సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రా ష్ట్ర కార్యదర్శి పి. సురేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభు త్వం తీసుకోచ్చిన రైతు నల్ల చట్టాలు, నాలుగు లేబర్ కోడుల వల్ల కార్మికులు శ్రామికులు తీవ్రమై న సంక్షభంలోకి నెట్టబడుతున్నారని ఆవేదన వ్య క్తం చేశారు. దశాబ్దాల తరబడి ప్రభుత్వ రంగాల లో కాంట్రక్ట్ ఔట్సోర్సింగ్ పద్ధతుల్లో పనిచేస్తున్న సి బ్బందికి పర్మనెంట్ కొలువులు పగటి కలలుగానే మిగిలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మే 20న జరగబోయే సార్వత్రిక సమ్మెలో అన్ని వర్గా ల కార్మికులు కర్షకులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొ ని కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహబూబ్ నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి వెంకటేష్, కాంట్రాక్ట ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ బ్రాంచ్ అధ్యక్షులు గోపాల్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ బుచ్చన్న, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ అధ్యక్షులు బి. చెన్నయ్య, ప్రధాన కార్యద ర్శి జే.నరసింహ , నాయకులు కార్మికులు అంజి భీమయ్య, మన్యం, అంజలయ్య, వరలక్ష్మి , మంజుల,అంజమ్మ , లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# అనర్హులకు ఇండ్లు ఎంపిక చేస్తే కఠిన చర్యలు

రఘుపతిపేటలో ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన
జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్




**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** జిల్లాలో వేసవికాలంలో తాగునీటి ఇబ్బందులు రాకుండా అధికారులు సమన్వయంతో పనిచేస్తూ సమృద్ధిగా తాగునీటి సరఫరా చేయాలని, ఇందిరమ్మ గృహాలసర్వే పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ అధికారులను ఆదేశించారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం రఘుపతిపేటలో ఇందిరమ్మ ఇళ్లపరిశీలన, ప్రాథమిక వ్యవసాయ సహకారసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరికొనుగోలు కేంద్రాన్ని, లింగసానిపల్లిలో మంచినీటి సరఫరాపై మిషన్‌భగీరథసంపుహౌస్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇందిరమ్మ గృహ లబ్దిదారులతో స్వయంగా మాట్లాడారు. నిరుపేదలకు మాత్రమే ఇందిరమ్మ ఇల్లు మంజూరుచేసేలా పటిష్ట ప్రణాళికద్వారా ముందుకు పోతున్నామన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం ఉచితంగా ఇసుకను అందజేస్తుందన్నారు. సిమెంటుధర మార్కెట్‌కు అనుగుణంగా అందించాలని, ఎవరైనా అధిక ధరలకు అమ్మిన, ఇంటినినిర్మించే మేస్త్రీలు అధికంగా డబ్బులు అడిగిన స్థానిక అధికారులు వారితో మాట్లాడాలని లేనియెడల కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వేసవికాలంలో మిషన్‌భగీరథ తాగునీటి సరఫరాపై గ్రామస్తులతో మాట్లాడారు. వేసవికాలంలో తాగునీటి సరఫరా సక్రమంగా జరిగేందుకు మిషన్‌భగీరథ అధికారులు మండల పరిషత్ జిల్లా పరిషత్ పంచాయతీ అధికారులు సమన్వయంతో పనిచేసి తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. మిషన్‌భగీరథలో అందుబాటులో ఉన్న అసిస్టెంట్ ఇంజనీర్లు, ఇతర సాంకేతిక సిబ్బంది షిఫ్టుల వారిగా 24గంటలు పనిచేస్తూ డిమాండ్ మేరకు అవసరమైన నీరు గ్రామీణ ప్రాంతాలకు చేరే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రఘుపతిపేట గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరికొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ధాన్యాన్ని, రిజిస్టర్లు పరిశీలించి , నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. త్వరితగతిన కొనుగోలుచేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని, లారీలకొరత లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. తేమశాతంరాగానే కొనుగోలు చేసి లారీలద్వారా మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్‌వెంట కల్వకుర్తి ఆర్‌డిఓ శ్రీనివాసులు, ఎంపిడిఓ వెంకట్‌రాములు, హౌసింగ్ అధికారులు ఉన్నారు.

## ప్రభుత్వ పథకాలు, పరిసరాల పరిశుభ్రతపై ఉపాధి కూలీలకు అవగాహన

**ప్రజాపక్షం / వీపనగండ్ల :** అర్హులైన ప్రతి ఒక్కరు ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ వనపర్తి జిల్లా తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రానికి సమీపంలో ఉపాధి హామీ పథకం పనుల వద్ద కూలీలకు కళాకారులు అవగాహన కల్పించారు. ఎండలు తీవ్రత ఎక్కువగా ఉండటంతో వడదెబ్బ తగలకుండా కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలని, కూలీలు పనులు చేస్తూ ఎక్కువగా నీళ్లు తాగుతూ ఉండటం వల్ల శరీర ఉష్ణోగ్రతను తగ్గించుకోవచ్చని, ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు పని చేయకుండా నీడలో విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. కూలీలు తలకు వస్త్రం లేదా టోపీలు ధరించాలని, ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు. అంతేగాక రోగాలు ప్రభలకుండా గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతతో పాటు ఇంట్లో పరిశుభ్రత పాటించాలని, వేసవి కాలం కావడం వల్ల ఈగలు ఎ క్కువగా ఉంటాయని వండిన పదార్థాలపై మూతలు ఉంచాలని అన్నారు. ఈ కార్యక్రమం లో పంచాయతీ కార్యదర్శి రమేష్ రెడ్డి, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు రాజు, నర్సింహ్మా, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ ఇవిఎం గోదాం తనిఖీ




**ప్రజాపక్షం / వనపర్తి :** ఇవిఎం గోదాం నెలవారి తనిఖీలో భాగంగా బుధవా రం ఆర్డీఓ కార్యాలయ సముదాయంలో ఉన్న ఇవిఎం గోదాం భద్రతను పరిసీలించారు. నిరంతర నిఘా కొరకు ఎంత మంది పోలీసుకు విధులు నిర్వహిస్తున్నారనే వివరాలు అడిగి రిజిస్టరును పరిశీలించారు. గోదాం కు నిరంతరం పోలీస్ భద్రత, సీసీ కెమెరాలతో పర్యవేక్షణ కల్పించడం జరుగుతుందని పోలీస్ సిబ్బంది తెలియజేశారు. ఆర్డీఓ సుబ్రమణ్యం, తహసీల్దార్ రమేష్ రెడ్డి, ఎలక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ కిషన్ నాయక్ , ఇతర సిబ్బంది కలెక్టర్ వెంట ఉన్నారు.

## ట్రాన్స్ ఫార్మర్ మంజూరుతో తీరనున్న మంచినీటి సమస్య

**ప్రజాపక్షం / వీపనగండ్ల :** మండల పరిధిలోని కల్వరాల సమీపంలోని నల్లకుంట వద్ద ఉన్న తాగునీటి బోరుబావికి విద్యుత్ సౌకర్యం సరిగ్గా లేకపోవడంతో గ్రామంలో తాగునీటి సమస్య జఠిలంగా మారిందని నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నర్సింహ అన్నారు. నల్లకుంట వద్ద పది సంవత్సరాల క్రితం తాగునీరు కోసం బోర్‌ను వేసి విద్యుత్ సమస్య రాకుండా ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలనే ఆలోచన గ్రామ పంచాయతీ పాలకులకు విద్యుత్ శాఖ అధికారులకు లేకపోవడంతో గ్రామంలో మంచినీటి సమస్య జఠిలంగా మారుతుందని, గ్రామంలో తాగునీటి సమస్య రాకుండా బోర్ బావికి ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును గ్రామస్తులు కోరడం జరిగిందని నర్సింహ తెలిపారు. అడిగిన వెంటనే నూతన ట్రాన్స్‌ఫార్మర్ మం జూరు చేయడంపైనర్సింహ, గ్రామస్తులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

## సైబర్‌నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాపక్షం/వెల్దండ :** మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో వందేమాతరం ఫౌండేషన్ శృతిలయ కల్చరల్ అకాడమివారి సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవిశిక్షణ శిబిరాన్ని ఎస్‌ఐ కురుమూర్తి సందర్శించారు. విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ సైబర్‌నేరాలపట్ల మోసపూరితమైన ప్రకటనలపట్ల విద్యార్థులుచాలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తులు ఎవరైనా ఆధార్‌కార్డునెంబర్ , ఫోన్‌నెంబర్, ఓటిపిలు చెప్పమంటే చెప్పకూడదన్నారు. అదేవిధంగా అమ్మనాన్నలకుకూడా సైబర్‌నేరాలగురించి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో జోనల్ ఇంచార్జీ శ్రీరామ్, మండల ఇంచార్జీ మల్లేష్, బ్రాంచ్‌ఇంచార్జీ శ్రీకళ, కోఆర్డినేటర్స్ పావని, ప్రేమలత, మహేశ్వరి పాల్గొన్నారు.




## వైభవంగా వాసవి కన్యకాపరమేశ్వరిదేవి జన్మదిన మహోత్సవం వేడుకలు



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో బుధవారం వైశాఖశుద దశమి రోజున వైభవంగా వాసవిమాత జన్మదినోత్సవ వేడుకలు దేవాలయ ఫౌండర్‌ట్రస్టు జూలూరి రమేష్‌బాబు ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఉదయం 6గంటల నుంచి అభిషేకాలు, పూజలు, గీతా, వాసవిమాతపారాయణం, హనుమాన్‌చాలీసా పారాయణ ము, అమ్మవారి పల్లకిసేవ, మహిళలచే సామూహిక కుంకుమార్చన, అమ్మవా రి డోలరోహణం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో మహిళలు , ఆర్యవైశ్యులు పాల్గొన్నారు. అనంతరం మంగళహారతి అనంతరం తీర్థప్రసాదాలు బోజన ప్రసాదాలు వితరణ కార్యక్రమం నిర్వహించారు. కా ర్యక్రమంలో ఆర్యవైశ్య పట్టణ, మండలసంఘం నాయకులు, అనుబంధ సం ఘాలు, వాసవి క్లబ్, ఆవోప, మహిళా సంఘం నాయకురాలు, మహిళలు పాల్గొన్నారు.

## స్వల్పకాలిక రకాలను ఎన్నుకోవాలి



**ప్రజాపక్షం/బిజినేపల్లి :** స్వల్పకాలిక రకాలను ఎన్నుకుని తక్కువ కాలంలో ఎక్కువ దిగుబడులను పొందవచ్చని డాక్టర్ కాడసిద్ధప్ప అన్నారు. బుధవారం రైతుముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా వనపర్తి మండలంలోని చిట్యాల గ్రామంలో రైతు వేదికలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ బిఎస్‌సి అగ్రికల్చర్ కళాశాల పాలెం, శాస్త్రవేత్తలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఎక్కువగా అధిక దిగుబడినిచ్చే స్వల్పకాలిక రకాలను ఎన్నుకొని మంచి లాభాలను పొందాలని రైతులకు సూచించారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో సీడ్ గోదాములో ప్రధానంగా వరి, జొన్న, ఆముధం, కందిరకాలు సాగుచేసుకోవడానికి లభిస్తాయన్నారు. అనంతరం డాక్టర్ దివ్య మాట్లాడుతూ తెగుళ్లపై దృష్టిపెట్టి విత్తన శుద్ధి లాంటి చర్యలు చేపట్టాలని ప్రత్యేకించి రైతన్నలకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి అనువల్య, వ్యవసాయ అధికారి కుర్మయ్య, పిఎసిఎస్‌చైర్మన్ వెంకటరావు, డైరెక్టర్ శాంతన్న, కళాశాల విద్యార్థులు ఆకర్స్, రామకృష్ణ, పల్లవి, కావ్య పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీ మృతి



**ప్రజాపక్షం/కొత్తకోట :** కొత్తకోట మండలం నాటవెల్లి గ్రామ శివారులో రోజువారి ఉపాధి హామీ పనులకు వెళ్తూ బోయ పద్మ (45) అనే మహిళ ఉపాధి కూలీ మృతి చెందింది. అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉపాధి కూలీలు తెలిపినా వివరాల ప్రకారం పనులు ప్రారంభించగా ఆమె ఎప్పటిలాగే ఉపాధి కూలీకి వచ్చేదని, ఉపాధి కూలీల కోసం ఎప్పటిలాగే టెంట్ , వాటర్ ఏర్పాటు చేసినా, వాటర్ వేడి కావడంతో తాగడానికి నీళ్లు తీసుకురావడానికి బావి దగ్గరకు వెళ్లింది. ఆ బావిలోకి దిగుతుండగా కాళ్లు జారీ బావి లో పడింది. కాసేపటికి ఇంకా తిరిగి రాకపోయే సరికి వచ్చి చూడగా నీళ్లల్లో తెలాడుతుందని తెలిపారు. ఈ విషయాన్ని మండల అధ్యక్షుడు నాగారపు బీచుపల్లి అధికారులతో మాట్లాడి వాళ్ల కుటుంబ సభ్యులను ఆదుకోవాన్నారు.

# క్రీడ

## మీ స్టేడియాన్ని పేల్చేస్తాం..

### అహ్మదాబాద్ నరేంద్ర మోదీ స్టేడియానికి బెదిరింపులు!



పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్‌పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. భారత్ బుధవారం పీవోకేలోని తొమ్మిది ఉగ్రమూకలను ధ్వంసం చేసింది. దాంతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్తత మరింత పెరిగింది. ఈక్రమంలోనే గుజరాత్ అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియానికి బాంబు బెదిరింపులు వచ్చాయి. స్టేడియాన్ని బాంబులతో పేల్చేస్తామని గుర్తు తెలియని వ్యక్తులు హెచ్చరించారు. ఉత్సాహంగా ఐపీఎల్ కొనసాగుతున్న వేళ బాంబు బెదిరింపులు రావడం కలకలం రేపింది. ఈ క్రమంలో పాక్ పేరుతో ఈ మెయిల్ బెదిరింపులో రాగా.. భద్రతా సంస్థలు అప్రమత్తమయ్యాయి. 'ఆపరేషన్ సిందూర్' పరిణామాల తర్వాత పాక్ పేరుతో హెచ్చరికలు రావడంతో మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయి. గుజరాత్ క్రికెట్ అసోసియేషన్ అధికారిక ఈమెయిల్ ఐడీకి గుర్తు తెలియని వ్యక్తుల నుంచి బెదిరింపులు వచ్చినట్లుగా విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నారు. తాము మీ స్టేడియాన్ని పేల్చేస్తామంటూ హెచ్చరికలు వచ్చినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ బెదిరింపులను అధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. గుజరాత్ పోలీసులు, సైబర్ క్రైమ్ నిపుణుల బృందం బెదిరింపు ఈమెయిల్ ఎక్కడి నుంచి వచ్చిందో ఆరా తీస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో ఎక్కడి నుంచి పంపారో తెలుసుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఐపీఎల్‌లో రెండు కీలకమైన మ్యాచులు రెండురోజుల్లో జరగనున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం స్టేడియం పరిసర ప్రాంతాలతో పాటు, స్టేడియంలోనూ భారీ భద్రతను పెంచారు.

## టెస్టులకు హిట్‌మ్యాన్ రిటైర్‌మెంట్!



భారత జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ సంచలన నిర్ణయం తీసుకున్నది. టెస్టులకు రిటైర్మెంట్ పలికాడు. ఇటీవల కొంతకాలంగా ఫామ్ లేమితో ఇబ్బందులుపడుతున్న హిట్‌మ్యాచ్ చివరకు టెస్టు ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పాడు. ఇప్పటికే టీ20లకు వీడ్కోలు పలికిన రోహిత్.. ఇకపై వన్డేల్లో కొనసాగనున్నాడు. జూన్‌లో ఇంగ్లాండ్‌తో జరిగే టెస్టు సిరీస్ వరకు బీసీసీఐ కొత్త కెప్టెన్‌ను ప్రకటించనున్నది.

## ఉత్కఠ పోరులో చెన్నై విజయం



ప్లే ఆఫ్స్‌కు చేరాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ ఓటమి పాలైంది. వరుస పరాజయాలతో సతమతమవుతున్న చెన్నై సూపర్ కింగ్స్ ఎట్టకేలకు ఒక విజయం సాధించింది. రెండు వికెట్ల తేడాతో కేకేఆర్‌పై గెలుపొందింది. నాలుగు పరాజయాల తర్వాత చెన్నైకు ఇది తొలి గెలుపు. 12 మ్యాచ్‌ల్లో ఇది మూడో విజయం. ఈ పరాజయంతో కోల్‌కతా ప్లే ఆఫ్స్ అవకాశాలను దాదాపు దూరం చేసుకుంది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కేకేఆర్ కెప్టెన్ అజింక్య రహానే బ్యాటింగ్ ఎంచుకున్నాడు. కెప్టెన్ నమ్మకాన్ని నిలబెడతూ కోల్‌కతా బ్యాటర్లు సమష్టిగా రాణించారు. కెప్టెన్ అజింక్య రహానే (48) మరోసారి కీలక ఇన్నింగ్స్ ఆడాడు. మనీష్ పాండే (36 నాటౌట్), ఆండ్రూ రస్సెల్ (38), సునీల్ నరైన్ (26) కూడా కీలక పరుగులు చేశారు. దీంతో కోల్‌కతా నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 179 పరుగులు చేసింది. చెన్నై బౌలర్లలో నూర్ అహ్మద్ మరోసారి సత్తా చాటాడు. ఏకంగా నాలుగు వికెట్లు పడగొట్టాడు. రవీంద్ర జడేజా, అన్షుల్ కాంబోజ్ ఒక్కో వికెట్ తీశారు. కోల్‌కతా నిర్దేశించిన 180 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన చెన్నైకు మంచి ఆరంభం లభించలేదు. గత మ్యాచ్ హీరో ఆయుష్ మాత్రే రెండో బంతికే అవుటయ్యాడు. ఆ తర్వాత కాన్వే (0), అశ్విన్ (8), రవీంద్ర జడేజా (19) కూడా త్వరగానే అవుటయ్యారు. 60 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన చెన్నైను బ్రేవిస్ (52), శివమ్ దూబె (45) ఆదుకున్నారు. ఉర్విల్ పటేల్ (31) కూడా కీలక పరుగులు చేశాడు. చివర్లో ధోనీ (17) మరోసారి తన మార్క్ ఇన్నింగ్స్ ఆడాడు. దీంతో చెన్నై 19.4 ఓవర్లలో ఎనిమిది వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.

## సౌతాఫ్రికాపై విజయం..
## ఫైనల్‌కు భారత్



**కొలంబో:** శ్రీలంక వేదికగా జరుగుతున్న ముక్కోణపు వన్డే సిరీస్‌లో భారత మహిళల క్రికెట్ జట్టు ఫైనల్‌కు చేరింది. బుధవారం సౌతాఫ్రికా జట్టుతో జరిగిన మ్యాచ్‌లో టీమ్ ఇండియా 23 పరుగుల తేడాతో విజయం సాధించింది. వరుసగా మూడు మ్యాచ్‌ల్లో ఓడిన సౌతాఫ్రికా.. శ్రీలంకతో జరగాల్సి ఉన్న సిరీస్ ఆఖరి మ్యాచ్‌లో గెలిచినా ఫైనల్‌కు చేరదు. ఆదివారం జరగనున్న ఫైనల్‌లో శ్రీలంకతో భారత్ తలపడనుంది. మ్యాచ్ విషయానికొస్తే తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 337 పరుగుల భారీ స్కోరు సాధించింది. జేమిమా రోడ్రిగ్స్ (123; 101 బంతుల్లో 15 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీ బాదేసింది. దీప్తి శర్మ (93; 84 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్సులు) శతకం అవకాశాన్ని చేజార్చుకుంది. స్మృతి మంధాన (51; 63 బంతుల్లో 6 ఫోర్లు) అర్ధ శతకం చేసింది. భారీ లక్ష్యఛేదనలో సౌతాఫ్రికా పోరాడి ఓడింది. 50 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 314 పరుగులు చేసింది. అన్నరీ డెర్క్సెన్ (81; 80 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సులు), క్లో ట్రయాన్ (67; 43 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సులు) రాణించారు. మియాన్ స్మిత్ (39), నొందుమిసో షాంగసే (36), తజ్మిన్ బ్రిట్స్ (26), నాడిన్ డి క్లర్క్ (22), సినాలో జాఫ్తా (21) పరుగులు చేశారు. భారత బౌలర్లలో అమన్‌జ్యోత్ కౌర్ 3, దీప్తి శర్మ 2... శ్రీ చరణి, ప్రతీకా రావల్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

## ఆ ఉంగరం, చేప ఏమయ్యాయి?

### చిరంజీవితో రామ్‌చరణ్



మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటించిన ఎన్నో వండర్ ఫుల్ హిట్ చిత్రాల్లో దర్శకేంద్రుడు కే రాఘవేంద్రరావు తెరకెక్కించిన ఫాంటసీ వండర్ చిత్రం జగదేక వీరుడు అతిలోక సుందరి కూడా ఒకటి. తెలుగు ఆడియెన్స్ ఎప్పటికీ మర్చిపోలేని ఈ సినిమా ఇపుడు ఫైనల్ గా 35 ఏళ్ళ తర్వాత రీరిలీజ్ కి వస్తుంది. అది కూడా 3డిలో వస్తుంది. మరి ఈ రీరిలీజ్ కోసం మళ్ళీ మెగాస్టార్ మరియు నిర్మాత అశ్వినీదత్ లు తమ మార్క్ ప్రమోషన్స్‌ని గతంలో 'ఇంద్ర'కి చేసిన రీతిలోనే చేస్తుండగా లేటెస్ట్‌గా ఓ క్రేజీ ప్రోమో వదిలారు. మరి ఇందులో మెగాస్టార్ తన మార్క్ ఎనర్జీ, టైమింగ్‌తో అదరగొట్టగా లాస్ట్‌లో మెగాస్టార్ వారసుడు, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కూడా ఇందులో సర్ప్రైజ్ చేయడం జరిగింది. అయితే ఇందులో తాను జగదేక వీరుడు క్లైమాక్స్ కోసం మాట్లాడ్డం ఆసక్తిగా మారింది. పార్ట్ 2కి ఉన్న స్కోప్‌పై తాను మాట్లాడ్డం జరిగింది. చివరిలో ఉంగరం దానిని మింగిన చేప ఏమయ్యాయి అంటూ చరణ్ చెప్పడంతో జగదేక వీరుడు పార్ట్ 2 పై ఆశలు చిగురించినట్టు అయ్యిందని చెప్పాలి. ఇక ఈ ఫుల్ ఇంటర్వ్యూ అయితే ఈ మే 8న రాబోతుండగా ఇందులో పార్ట్ 2పై మరింత క్లారిటీ రావొచ్చు.

## 'కింగ్‌డమ్'కి లైన్ క్లియర్!

మన టాలీవుడ్ సెన్సేషనల్ హీరో విజయ్ దేవరకొండ హీరోగా భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా దర్శకుడు గౌతమ్ తిన్ననూరి తెరకెక్కించిన అవైటెడ్ భారీ చిత్రమే కింగ్‌డమ్. విజయ్ నుంచి ఒక సాలిడ్ స్పై యాక్షన్ డ్రామాగా వస్తున్న ఈ సినిమా నుంచి రీసెంట్‌గా వచ్చిన సాంగ్ మంచి హిట్ అయ్యింది. ఇక ఈ సినిమా విడుదల పవన్ వీరమల్లు ఎఫెక్ట్‌తో అటు ఇటుగా ఉందని టాక్ వచ్చింది. కానీ ఇప్పుడు లైన్ క్లియర్ అయినట్లు తెలుస్తోంది. కింగ్‌డమ్ అనుకున్నట్లుగా మే 30నే రాబోతుందట. హరిహర వీరమల్లు ప్రస్తుతానికి ఇంకా డేట్ లాక్ చేసుకోకుండా ఉండడంతో కింగ్‌డమ్ అనుకున్న సమయానికే వస్తుంది అని ఇపుడు టాక్.




# రీల్

## 'కన్నప్ప' కోసం విష్ణు మంచు గ్లోబల్ ప్రమోషన్స్!



డైనమిక్ స్టార్ విష్ణు మంచు తన డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప'ను ఓ మైలు రాయి చిత్రంగా మలిచేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మార్కెట్‌ను స్టడీ చేస్తూ గ్లోబల్‌గా ప్రమోట్ చేసేందుకు రెడీ అవుతున్నారు. విష్ణు మంచు నటించిన ఈ హిస్టారికల్ మూవీ ప్రమోషన్స్‌ను అమెరికా నుంచి ప్రారంభించబోతున్నారు. కన్నప్ప USA టూర్ మే 8న న్యూజెర్సీలో ప్రారంభం కానుంది. అక్కడ విష్ణు నార్త్ బ్రున్స్‌విక్‌లోని రీగల్ కామర్స్ సెంటర్‌లో అభిమానులతో ముచ్చటించనున్నారు. మే 9న డల్లాస్‌కు బయలుదేరి వెళ్లి సాయంత్రం 7 గంటలకు గెలాక్సీ థియేటర్స్ గ్రాండ్‌స్కేప్, ది కాలనీ, టెక్సాస్‌లో ప్రేక్షకులతో సందడి చేయనున్నారు. ఈ పర్యటన మే 10న శాన్ ఫ్రాన్సిస్కో బే ఏరియాలో ముగుస్తుంది. అక్కడ ఆయన ఉదయం 10:30 గంటలకు సినీ లాంజ్ ఫ్రీమాంట్ 7 సినిమాస్‌ను సందర్శిస్తారు. ఈ చిత్రం ఓవర్సీస్ విడుదలను వాసారా చూసుకుంటోంది. అనంతరం ఇండియాకు తిరిగి రానున్న విష్ణు.. దేశంలోని పలు నగరాల్ని చుట్టి రానున్నారు.ఆధ్యాత్మిక తీర్థయాత్రలు, అన్ని వర్గాల ప్రేక్షకులతో కనెక్ట్ అవ్వడానికి, అన్ని ప్రాంతాల మీడియాతో విష్ణు మంచు ఇంటరాక్ట్ కానున్నారు. 'కన్నప్ప' నుంచి వచ్చిన భక్తి గీతం శివా శివా శంకరా విడుదలైనప్పటి నుంచి పాజిటివ్ వైబ్స్ క్రియేట్ అయిన సంగతి తెలిసిందే. ఈ చిత్రంలోని లవ్ ట్రాక్ కూడా అందరినీ ఆకట్టుకుంది. ఇక ఇప్పుడు అందరి దృష్టి కన్నప్ప ట్రైలర్‌పై ఉందన్న సంగతి తెలిసిందే. ట్రైలర్ రిలీజ్‌తో ఒక్కసారిగా అంచనాలు ఆకాశాన్నంటుతాయి. జూన్ 27న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ ఇలా పలు భాషలలో 'కన్నప్ప' చిత్రాన్ని గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నారు.

## ఫుల్ స్వింగ్‌లో శ్రీవిష్ణు..



మన టాలీవుడ్‌లో ఉన్నటువంటి టాలెంటెడ్ అండ్ వెర్సటైల్ యంగ్ హీరోస్‌లో శ్రీవిష్ణు కూడా ఒకరు. రీసెంట్ చిత్రం 'స్వాగ్' మూడు డిఫరెంట్ షేడ్స్‌ని అద్భుతంగా పండించిన శ్రీవిష్ణు ఇపుడు సింగిల్ సినిమాతో ఎంటర్టైన్ చేసేందుకు రాబోతున్నాడు. అయితే తన నుంచి రానున్న రోజుల్లో మరిన్ని సాలిడ్ ప్రాజెక్ట్‌లు అది కూడా దేనికదే సెపరేట్ కాన్సెప్ట్ లతో అలరించే విధంగా ప్లాన్ చేసుకుంటున్నాడు. మరి తన నెక్స్ట్ మూడు సినిమాలు కూడా ఇంట్రెస్టింగ్ జానర్స్‌లో రాబోతున్నాయి. తెలుగు ఆడియెన్స్‌కి ఎంతో ఇష్టమైన అమృతం సీరియల్ దర్శకుడు గుణ్ణం గంగరాజు బ్యానర్‌లో 'మృత్యుంజయ' అనే సినిమా చేస్తుండగా ఇది ఆల్రెడీ 30 రోజులు షూటింగ్ కూడా కంప్లీట్ అయ్యిందట. ఇక ఈ చిత్రం కాకుండా ఒక కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ ని తాను ప్లాన్ చేస్తుండగా ఇవి కాకుండా ఒక ఫారెస్ట్ బ్యాక్ డ్రాప్‌లో సినిమా చేయనున్నట్టుగా తెలిపాడు. ఇలా మొత్తం మూడు సినిమాలు తాను ప్లాన్ చేస్తుండగా ఇపుడు వస్తున్న సింగిల్ కాకుండా మిగతా మూడు చిత్రాలు వచ్చే ఏడాది వేసవి నాటికి రిలీజ్ అవుతాయని చెబుతున్నాడు. మరి మొత్తానికి మాత్రం శ్రీవిష్ణు ఇపుడు ఫుల్ స్వింగ్ లో కొనసాగుతున్నాడని చెప్పాలి.

## ఆంధ్రప్రదేశ్ కృష్ణా జలాల అక్రమ
# తరలింపు కట్టడి చేయాలి

> పాలమూరు-రంగారెడ్డి, సమ్మక- సారక్క ప్రాజెక్టులకు తక్షణమే నీటిని కేటాయింపులు చేయాలి
> కేంద్ర జల సంఘం చైర్మన్ అతుల్ జైన్‌కు నీటిపారుదల శాఖమంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి విజ్ఞప్తి



**ప్రజాపక్షం /హైదరాబాద్ :** రాష్ట్రంలోని పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుతో పాటు సమ్మకసారక్క ప్రాజెక్టుకు నీటి కేటాయింపుకు తక్షణమే చర్యలు తీసుకోవడంపాటు, ఆంధ్ర ప్రదేశ్ కృష్ణా జలాల అక్రమ తరలింపును ఆపాలని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి కేంద్ర జల సంఘం చైర్మన్ అతుల్ జైన్‌కు విజ్ఞప్తి చేశారు. న్యూఢిల్లీలో బుధవారం జల సంఘం చైర్మన్ అతుల్ జైన్‌తో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలోని వివిధ ప్రాజెక్టులకు సంబంధించినీటి కేటాయింపు సమస్యలను పరిష్కరించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కోరారు. అదేవిధంగా అంతర్‌రాష్ట్ర నీటి నిర్వహణ, మౌలిక సదుపాయాల భద్రత, పోలవరం ప్రాజెక్టు నుండి బ్యాక్ వాటర్ ప్రభావానికి సంబంధించిన తదితర అంశాలను మంత్రి కేంద్ర జల సంఘం చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లారు. కరువు ప్రభావిత జిల్లాలైన మహబాబ్‌నగర్, నాగర్ కర్నూల్, వికారాబాద్, రంగారెడ్డితో పాటు నల్గొండ జిల్లాలోని సుమారు 12.3 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో 2015లో పాలమూరురంగా రెడ్డి ప్రాజెక్టు ప్రారంభించడం జరిగిందని చైర్మన్‌కు వివరించారు. ఈ పథకం 60 రోజుల వరద కాలంలో కృష్ణా నది నుండి రోజుకు 2 టిఎంసి నీటిని ఎత్తిపోయడానికి ఐదు పంపింగ్ స్టేషన్ల ఉపయోగించి ఈ ప్రాంతంలో నీటి కొరత, భూగర్భ జల క్షీణతను పరిష్కరించడానికి ప్రతిపాదించబడిందని, ఈ ప్రాజెక్టుకు గాను 90 టిఎంసిల నీటి కేటాయించాలని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మొదటి దశలో 45 టిఎంసిలను వెంటనే మంజూరు చేయాలని కోరారు, తెలంగాణ ఇప్పటికే సిడబ్ల్యుసి నిర్దేశించిన విధానపరమైన అంశాలను పాటించడంతోపాటు డాక్యుమెంటేషన్ సమర్పించడం జరిగిందని చెప్పారు. అదేవిధంగా ములుగు జిల్లాలోని తుపాకుల గూడెం వద్ద ఉన్న సమ్మక్కసారక్క బ్యారేజీ, జె. చొక్కారావు దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ పథకం శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ (దశలు I అండ్ II) కింద దాదాపు 5.55 లక్షల హెక్టార్లకు నీటి పారుదలని స్థిరీకరించడానికి రూపొందించబడిందని మొత్తం 6.94 టిఎంసి సామర్థ్యంతో, ఈ బ్యారేజీ దాని మార్గంలో ఉన్న అనేక గ్రామాల తాగునీటి అవసరాలను కూడా తీరుస్తుందన్నారు. సమ్మక్కసారక్క ప్రాజెక్టుకు 44 టిఎంసిల కేటాయింపును వేగవంతం చేయాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి సిడబ్ల్యుసి చైర్మన్‌ను కోరారు. ఇందుకు సంబంధించి కూడా అన్ని పత్రాలను అందజేయడం జరిగిందని వివరించారు.

**కృష్ణా జలాలను ఏపి అక్రమంగా మళ్లించుకుంటోంది:** కృష్ణా నది జలాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అక్రమంగా మళ్లించుకుంటుందని, దీనిని అరికట్టేందుకు కీలకమైన ప్రదేశాలలో టెలిమెట్రీ పరికరాలను వెంటనే ఏర్పాటు చేయాలని సిడబ్ల్యుసి చైర్మన్‌తో పాటు పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ చైర్మన్‌గా అదనపు బాధ్యతలను నిర్వహిస్తున్న అతుల్ జైన్‌ను మంత్రి ఉత్తమ్ కుమర్‌రెడ్డి కోరారు. ఇందుకు సంబంధించి తెలంగాణ తెలంగాణ ఇప్పటికే తన ఆర్థిక వాటాను కృష్ణా నది నిర్వహణ బోర్డు (కెఆర్ఎంబి)కి విడుదల చేసిన విషయాన్ని ఈ సందర్భంగా చైర్మన్‌కు మంత్రి గుర్తు చేశారు. మరో ప్రధాన అంశమైన పోలవరం ప్రాజెక్ట్ నుండి బ్యాక్ వాటర్ కారణంగా తెలంగాణలో భద్రాచలంతో పాటు పలు ప్రాంతాలు ముప్పుకు గురువుతున్నాయని చైర్మన్ దృష్టికి తెచ్చారు. తెలంగాణ సరిహద్దు గ్రామాలపై బ్యాక్ వాటర్ ప్రభావాలను మళ్లీ పరిశీలించడంతోపాటు ఆయా ప్రాంతాలు ముంపునకు గురికాకుండా రక్షణ చర్యలు చేపట్టేలా ఆంధ్రప్రదేశ్‌కు సిఫార్సు చేయాలని కోరారు.

**కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణకు సిడబ్ల్యుసి సహకారం అందించాలి**

కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ (కెఎల్ఐఎస్) పై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డిఎస్ఎ) ఇటీవల ఇచ్చిన నివేదికను ఉత్తమ్ కుమార్ రెడ్డి సిడబ్ల్యుసి చైర్మన్ దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ నివేదిక మొత్తం ప్రాజెక్టు నిర్మాణం, డిజైన్ లోపం కేవలం మేడిగడ్డ బ్యారేజీ మాత్రమే పరిమితం కాకుండా అన్నారం, సుందిల్ల బ్యారేజీల సంబంధించి కూడా తీవ్రమైన ఆందోళనలను లేవనెత్తిందని మంత్రి వివరించారు. ఎన్‌డిఎస్ఎ తన సాంకేతిక తనిఖీల తర్వాత, కాళేశ్వరం ప్రాజెక్టు కొనసాగింపులో భాగంగా భద్రతను అంచనా వేయడానికి సిడబ్ల్యుసి సాంకేతిక సలహా పర్యవేక్షణను కోరాలని ప్రభుత్వానికి సిఫార్సు చేసిందని మంత్రి ఉత్తమ్ కుమర్‌రెడ్డి వివరించారు. ఇసుక పైపింగ్, ఫౌండేషన్ అస్థిరత, నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో ప్రాజెక్ట్ యొక్క కొన్ని భాగాలలో కోలుకోలేని నష్టం జరిగిందని తెలిపారు.. ఎన్‌డిఎస్ఎ సిఫార్సుల మేరకు సమగ్ర జియోటెక్నికల్, స్ట్రక్చరల్ సమీక్ష నిర్వహించడంలో రాష్ట్ర ప్రభుత్వంతో సిడబ్ల్యుసి కలిసి పనిచేయాలని, ప్రాజెక్ట్ పునరుద్ధరణ,రక్షణ కోసం దిద్దుబాటుకు సంబందించి తగినసలహాలు సూచనలు ఇవ్వాలని చైర్మన్ అతుల్ జైన్‌కు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఇందుకు సంబంధించి సిడబ్ల్యుసి చైర్మన్ అతుల్ జైన్ సానుకూలంగా స్పందించారని, తెలంగాణ ప్రభుత్వం చేసిన అన్ని విజ్ఞప్తిలపై సిడబ్ల్యుసి తక్షణమే వెంటనే చర్య తీసుకుంటుందని హామీ ఇచ్చారని తెలిపారు.



## సక్సెస్

(మొదటి పేజీ తరువాయి)

అక్కడ ఉన్నవారిని సురక్షితంగా బయటకు తీసుకొస్తున్నట్లుగా దృశ్యాలను మాక్‌డ్రిల్‌లో ప్రదర్శించారు. డిఆర్‌డిఎ సమీపంలోని ఓ కాలనీలోని 24 అంతస్తుల భవనంలో అత్యవసర పరిస్థితులు ఏర్పడితే ఎలా సురక్షితంగా కాపాడాలనే అంశాన్ని వివరించారు. అక్కడ ఫైరింజన్లను మోహరించారు. మొత్తంగా 12శాఖల అధికారుల సమన్వయంతో ఈ మాక్‌డ్రిల్ నిర్వహించారు. కాల్పుల్లో గాయపడిన వారిని తోటివారి సహాయంతో సురక్షిత ప్రాంతాలకు ఎలా తరలించాలనే అంశంపై అవగాహన కల్పించారు. మరోవైపు, విశాఖలోని పాత పోస్ట్ ఆఫీస్ కూడలిలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో వ్యవహరించాల్సిన విధానంపై అవగాహన కల్పించారు.

## ప్రణాళిక ప్రకారం నిర్దేశిత
# లక్ష్యాలు ధ్వంసం చేశాం

### రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్



**న్యూఢిల్లీ :** ఆపరేషన్ సిందూర్ పేరుతో ఒక ప్రణాళిక ప్రకారం నిర్దేశిత లక్ష్యాలను ధ్వంసం చేశామని రక్షణశాఖామంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. ఖచ్చితత్వంతో ఉగ్రవాద శిబిరాలను మాత్రమే ధ్వంసం చేశామన్నారు. భారత సైనిక దళాలు మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంటి గంట సమయానికి దాడులు ప్రారంభించి 25 నిమిషాల వ్యవధిలో తొమ్మిది ప్రాంతాలలో లక్ష్యాలను ధ్వంసం చేసే కార్యక్రమాన్ని పూర్తిచేశాయని రాజ్‌నాథ్‌సింగ్ చెప్పారు. పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీరులో ఉన్న ఉగ్రవాద మౌలిక సదుపాయాలపై ఈ దాడులు చేసినట్లు చెప్పారు. "ప్రతీకారదాడి హక్కును ఉపయోగించుకుని బాగా లోతుగా ఆలోచించి లెక్కప్రకారం ఈ దాడులు చేశాం, పహల్గామ్‌లో దాడికి ప్రతీకారంగా ఈ దాడులు జరిగాయి, పహల్గామ్‌లో అమాకులైన 26 మంది సామాన్యులను చంపినవారిని మాత్రమే మేం మా దాడుల ద్వారా హతమార్చాం'' అని చెప్పారు. ఆరు రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాలలో సరిహద్దు రహదారి సంస్థకు చెందిన 50 మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం చేసిన సందర్భంగా బుధవారం నాడు రాజ్‌నాథ్‌సింగ్ మాట్లాడుతూ పై విషయాలు చెప్పారు. ఉగ్రవాదుల మనోధైర్యాన్ని దెబ్బతీశామని, ఈ చర్య చాలా పరిమితమైనదనీ, వారి శిబిరాలను, ఇతర మౌలిక సదుపాయాలను మాత్రమే ధ్వంసం చేశామన్నారు. చాలా అప్రమత్తంగా, సూక్ష్మ బుద్ధితో, ఖచ్చితతత్వంతో భారత ఆర్మీ వ్యవహరించిందని చెప్పారు.

### సరిహద్దుల్లో 15 మంది మృతి

పాకిస్థాన్ పదాతిదళం దాడుల్లో సరిహద్దుల్లో మంగళవారం రాత్రి 15 మంది పౌరులు మరణించారని 43 మంది గాయపడ్డారని భారత సైన్యం ప్రకటించింది. భారత్ అధీనంలోని పూంఛ్, తాంగ్‌దార్ ప్రాంతాలలో కాల్పులు జరిగాయని పేర్కొంది. ఇదిలా ఉండగా పాకిస్థాన్‌లో అసలు ఉగ్రవాద కేంద్రాలు లేవని, భారత వైమానిక యుద్ధ విమానాలు పౌర ప్రాంతాలపై దాడులు చేసి 26 మంది ప్రజలను హతమార్చాయని, మరో 46 మంది ఈ దాడుల్లో గాయపడ్డారని, భారత ప్రభుత్వం నిరాధారమైన ప్రకటనలు చేస్తోందని పాకిస్థాన్ ప్రభుత్వం ప్రకటించింది. వాస్తవాధీనరేఖవద్ద గ్రామాలవెంబడి ఉన్న ప్రజలు భయపడి సామాన్లతో సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్ళారు. నియంత్రణరేఖ సమీపంలోని సలమాబాద్ గ్రామం భారత్ దాడుల్లో తీవ్రంగా నష్టపోయింది,. ఇదిలా ఉండగా భారత్‌కు చెందిన ఐదు యుద్ధ విమానాలను తమ సైన్యం కూల్చివేసిందని పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ మీడియాకు చెప్పారు. ఐతే భారత్ దీనిపై ప్రతిస్పందించలేదు. పరస్పర దాడుల కారణంగా రెండు దేశాలకు సంబంధించిన 550 విమానాలు రద్దయ్యాయి. పాకిస్థాన్‌వైపు 135 విమానాలు రద్దు కాగా, భారత్‌కు సంబంధించి 417 విమనాలు రద్దయ్యాయి.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com